వాసుకి గత వారంరోజులపై విహంగవీక్షణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 184 పేజీలు: 8+4 వెల: 6.50


భూమిపై పడుతున్న అంతరిక్ష ప్రయోగాల చెత్త 5లో

కర్ణాటకకు ఇప్పుడే రావొద్దు: విజయ్‌కి డికె సలహా



**డీలిమిటేషన్‌కు మద్దతు ఇచ్చేవారు దేశద్రోహులే**

తమిళనాడు రాజకీయ ప్రాతినిధ్యాన్ని హరించేందుకు కేంద్రం కుట్ర: రాహుల్ గాంధీ 6లో



**డ్రగ్స్ రహిత భారత్ యువత లక్ష్యం** 5లో

నశాముక్త్, వికసిత్ భారత్ సంకల్పం నెరవేరుతోంది: ప్రధాని మోడీ



**రాజకీయాల్లోకి 'కాక్రోచ్'!**

5న పార్టీ కీలక సమావేశం

సిజెపి భవిష్యత్‌కార్యాచరణ ఖరారు 2లో

## నీట్ పిజి 2026 సంస్కరణలకు శ్రీకారం

### అభ్యర్థులకు మూడు పరీక్షా నగరాల ఎంపిక అవకాశం

### 30న 1300 పైగా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** నీట్ పిజి-2026 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పలు కీలక సంస్కరణలను ప్రకటించింది. ఈనెల30న జరగనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)నిర్వహణ ఏర్పాట్లను కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ అధికారులతో సమీక్షించారు. అనంతరం అభ్యర్థులకు మరింత సౌలభ్యం కల్పించే చర్యలను వెల్లడించారు. ఈ యేడాది నీట్ పిజి-2026 పరీక్ష దేశవ్యాప్తంగా ఒకే షిఫ్ట్‌లో నిర్వహించనున్నారు. దాదాపు 340 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,300కు పైగా పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులకు ఊరట కలిగించే నిర్ణయంగా పరీక్షా >>2

## విద్య, పరిశోధనలో ఎపికి ఆస్ట్రేలియా సాయం

### నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు

మంత్రి లోకేష్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యామంత్రి జూలియన్‌హిల్ సమక్షంలో ఒప్పందాలు

ఐఐటి తిరుపతిలో సోలార్ తయారీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు



విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్, ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంఒయులు

**విజయవాడ.ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ ఆస్ట్రేలియా భాగస్వామ్యంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, సమ్మిళిత విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో భారత్‌ఆస్ట్రేలియా సహకారాన్ని మరింత బలోపేతం చేస్తూ ఏపీ ప్రభుత్వం ఆస్ట్రేలియాలోని ప్రముఖ విద్య, పరిశోధన, పారిశ్రామిక సంస్థలతో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆదివారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంవో యూలపై ఇరుపక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు. విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఇటీవల ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా అక్కడి విశ్వవిద్యాలయాలు, పరి శోధనా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులతో జరిపారు. ఏపీకి రావాలని ఆస్ట్రేలియా ప్రభుత్వానికి ఆహ్వానం పలికారు. ఏపీలో అవకాశాలు, ఇస్తున్న రాయితీలను వివిధ సంస్థల ప్రతినిధులకు వివరించారు. దీనిపై అప్పుడే సానుకూలంగా స్పందించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులు. మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా టూర్ వల్లే కీలకమైన ఎంవోయూలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సి షన్,ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూసౌత్‌వేల్స్ కలిసి >>2



పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## మచిలీపట్నం మెడికల్ కాలేజీకి పింగళి వెంకయ్య పేరు

### జాతీయ జెండా రూపొందించిన వెంకయ్య కృష్ణా జిల్లా వాసి కావడం గర్వకారణం

### ఆయన సేవలు నిరంతరం స్మరించుకోవాలి

పింగళి 150వ జయంతి కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ.ఆగస్టు 2,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ జెండా రూపొందించి దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించిన స్వాంతంత్ర్య సమర యోధులు పింగళి వెంకయ్యకు తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పించే లక్ష్యంతో మచిలీపట్నం మెడికల్ కాలేజీకి ఆయన పేరు పెడుతున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా చిలకలపూడి పోలీస్ స్టేషన్ సమీపంలోని పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. దేశం మొత్తం గర్వపడేలా జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య కృష్ణా జిల్లా వాసి అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామన్నారు. అలాంటి మహనీయుని సేవలను నిరంతరం స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. పింగళి వెంకయ్య ఆశయాలకు అనుగుణంగా >>2



ఆదివారం విజయవాడలో తక్కువ ధరకు బియ్యం దుకాణం ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

## రూ.52కే సన్న బియ్యం

### 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్లలో విక్రయాలు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులకు భారీ ఊరట కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధరల స్థిరీకరణపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారిస్తూ, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తక్కువ ధరలకే బియ్యం విక్రయాలను మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం ఉదయం విజయవాడలోని ఏపీఐఐసీ (కాలనీలో గల రైతు బజార్‌లో శాసన సభ్యులు గద్దె రామమోహన్, జిల్లా >>2



ఆలూరు ఎమ్మెల్యే

## విరుపాక్షి అరెస్ట్

### మొత్తం 15మందిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

### భారీగా నిరసనలు

**చిప్పగిరి/ఆలూరు ,ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గత రాత్రి మండల పరిధిలోని నేమకల్ పంచాయతీ మజారా గ్రామమైన సంఘాలలో వైయస్సార్‌సిపి కార్యకర్త గిరి, టిడిపి కార్యకర్తలు గురునాథ్ >>2

## పొగాకు రైతులకు భారీ ప్యాకేజి



### ప్రతి రైతుకు రూ.50వేల వడ్డీలేని రుణాలు

### కిలోకు రూ.10 ఎపి ప్రభుత్వ ప్రోత్సాహకం

### రైతుల ఖాతాల్లో నేరుగా జమ: కేంద్రమంత్రి పెమ్మసాని

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** పొగాకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సం యుక్తంగా భారీసహాయ ప్యాకేజీ ప్రకటించాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ప్రతి రైతుకు రూ.50వేల వడ్డీలేని రుణాలను రెండేళ్లలో చెల్లిస్తున్నట్లు ప్రకటించారు. సుమారు 45 వేల మంది రైతులకు కేంద్ర రుణ పథకం వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని పొగాకు రైతులకు రూ.250కోట్ల కేంద్ర రుణ సాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆఫ్ స్టైల్ రకాల పొగాకుకు కిలోకు రూ.10ల ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. బ్రైట్ రకానికి రూ.230,మీడియం రకానికి రూ.190, లో రకానికి రూ.110, ఆఫ్ స్టైల్ రకానికి రూ.130 కనీస కొనుగోలు ధరకు ఎగుమతిదారులు అంగీకారం తెలిపారని వెల్లడించారు. రైతుల ఖాతాల్లో నేరుగా రాష్ట్ర ప్రోత్సాహక నగదు జమ అవుతుందని తెలిపారు. సోమవారం నుంచే ఈ సహాయ ప్యాకేజీ అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. గత ఏడాది రూ.146 కోట్లతో బ్లాక్ బర్లీ రకం పొగాకును కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసిందని వెల్లడించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు కూటమి ప్రభుత్వంలోనే పూర్తి అయ్యాయని పెమ్మసాని చెప్పుకొచ్చారు. ఈ ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన 7రోడ్లలో 5 రోడ్లు పూర్తి అయ్యాయని వివరించారు. అభివృద్ధి ప్రాజెక్టులపై రాజకీయాలు కాకుండా ప్రజాప్రయోజనాలపై చర్చ జరగాలని సూచించారు. ఏపీకి మంచి ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్ట్ కావాలని చంద్రబాబు ఆలోచించారని తెలిపారు. ఈ విమానాశ్రయానికి కావాల్సిన భూమిని సేకరించి నిర్మాణాన్ని పూర్తి చేశారని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ టెండర్లకు పిలిచినప్పుడు జీఎంఆర్ ఏపీ మీద ఉన్న ప్రేమతో హై బిల్డింగ్ వేసి మరి టెండర్ దక్కించుకుందని తెలిపారు. ఈ విమానాశ్రయం నుంచి 20వేల టన్నులను ఎక్స్‌పోర్ట్ చేయొచ్చని వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి 60 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేసే విధంగా ఏర్పాటు చేశామని వివరించారు. ఏడు రెట్ల ప్రయాణికులు పెరిగిన ఇక్కడి నుంచి వెళ్లే విధంగా >>2



## పాక్ శాంతి ర్యాలీలో పేలుడు

### తొమ్మిది మంది మృతి, 18 మందికి తీవ్రగాయాలు

**ఖ్వెట్టా, ఆగస్టు 2:** పాకిస్థాన్ వాయువ్య ప్రాంతంలోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఆదివారం నిర్వహించిన శాంతి ర్యాలీలో జరిగిన భారీ పేలుడులో కనీసం తొమ్మిది మందిమృతి చెందగా, మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్వాత్ జిల్లాలోని కబల్ టౌన్‌లో నిర్వహిస్తున్న స్వాత్ పీస్ ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.స్వాత్ పోలీసులు వెల్లడించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, పేలుడులో తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోగా, 18 మంది తీవ్ర గాయాలతో ఆసు పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు ఆత్మాహుతి >>2

## 15 డెడ్‌లైన్

### సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన: ప్రభుత్వ ఉద్యోగుల జెఎసి

**విజయవాడ, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఈ నెల15వ తేదీలోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన తప్పదని రాష్ట్ర ప్రభుత్వఉద్యోగ సంఘాల అమరావతి జాయింట్ యాక్షన్‌కమిటీ (జె.ఎ.సి) నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎ.పి.జె.ఎ.సి అమరావతి రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం విజయవాడ రెవెన్యూ భవన్‌లో చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపట్ల ప్రభుత్వ వైఖరిపై సమావేశంలో పలువురు నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం రెండు విడతలుగా చర్చలు జరిపినప్పటికీ ఇప్పటివరకు నిర్ణయం ప్రకటించడం పోవడం వలన ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని సమావేశంలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. చర్చలు జరిపి నిర్ణయాలు ప్రకటించకుండా కావాలనే ఉద్యమాన్ని ప్రక్కదారిపట్టిస్తుందనే భావన ఉద్యోగులలో బలపడుతోందని నాయకులు పేర్కొన్నారు.ఈ సంద >>2

## శాంతించని గోదావరి

### ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు

### 14.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం

### కోనసీమలో లంక గ్రామాలకు తెగిన రాకపోకలు



గోదావరి ఉధృతికి లంకగ్రామాల్లోకి ప్రవేశించిన వరద నీరు

**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రతినిధి, ఆగస్టు2,ప్రభాత వార్త:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం నుంచి ధవళేశ్వరం వరకు వరద ఉధృతి కొనసాగుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా, ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 14.90 అడుగులకు చేరుకుంది. బ్యారేజీ నుంచి 14.52 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. వరద ఉధృతి >>2

## కర్ణాటక కేబినెట్ విస్తరణపై ఇంకా ఊగిసలాట

### మంత్రుల జాబితాపై హైకమాండ్ సిగ్నల్స్ కోసం వెయిటింగ్

**బెంగళూరు, ఆగస్టు 2:** కర్ణాటక మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన ఉత్కంఠకు సోమవారం తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్య మంత్రి డి.కె. శివకుమార్ సిద్ధం చేసిన కొత్త మంత్రుల జాబితాకు కాంగ్రెస్ హైకమాండ్ ఆమోదించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేబినెట్ విస్తరణ ప్రక్రియ తుది దశకు చేరుకున్నప్పటికీ, కొత్త మంత్రుల జాబితాకు పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ఆమోదం ఇంకా లభించలేదు. ప్రతిపాదిత జాబితాపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పార్టీ సీనియర్ నేతలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు సమాచారం. పార్టీ వర్గాల వివరాల ప్రకారం, ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మంత్రివర్గంలో చేర్చేందుకు సుమారు 20 మంది ఎమ్మెల్యేలతో తాత్కాలిక జాబితాను రూపొందించి కాంగ్రెస్ హైకమాండ్‌కు పంపించారు. మరో విడత చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కె.సి. వేణు గోపాల్, రణదీప్ సింగ్ సుర్జేవాలా సోమవారం మధ్యాహ్నానికి బెంగళూరుకు చేరుకుని, హైకమాండ్ ఆమోదించిన >>2



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

# సిఎం చంద్రబాబుతో ఆస్ట్రేలియా బృందం భేటీ

**విజయవాడ,ఆగస్టు 2,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడును అంతర్జాతీయ విద్యాశాఖ సహాయ మంత్రి, పౌరసత్వం, కస్టమ్స్, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం ఇక్కడ క్యాంప్ కార్యాలయంలో



కలిసింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వేగవంతమైన ఆర్థిక పరివర్తన, అభివృద్ధి కార్యక్రమాలు మరియు పెట్టుబడి, ఆవిష్కరణ, అంతర్జాతీయ సహకారానికి రాష్ట్రంలో ఉన్న విస్తారమైన అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యమంత్రి సహాయ మంత్రి జూలియన్ హిల్‌ను సాంప్రదాయ శాలువాతో సత్కరించి, ఆయనకు అరకు కాఫీ మరియు జ్ఞాపికను బహూకరించారు.

## విద్య, పరిశోధనలో ఎపికి ఆస్ట్రేలియా సాయం

>> ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటుచేయనున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సోలార్ తయారీ పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన వాణిజ్యీకరణకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ , శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు మరో ఎంఓయూ చేసుకున్నాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్జ్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యం. స్పెషల్ ఎడ్యుకేటర్స్ కు ప్రత్యేక శిక్షణ, సాధారణ ఉపాధ్యాయులకు శాస్త్రీయ ఆధారిత శిక్షణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల అవసరాలకు అనుగుణమైన బోధనా వనరుల రూపకల్పన చేపట్టనున్నారు. మూడో ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీటొండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా రాష్ట్రంలోని ఎంపిక చేసిన ఉన్నత విద్యాసంస్థల్లో సాంకేతిక ఆధారిత విద్యార్థుల మానసిక ఆరోగ్యం, సమగ్ర శ్రేయస్సుకు తోడ్పాటునందించే పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఈ వేదిక ద్వారా విద్యార్థుల తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సమాచార వనరులు, వెల్‌నెస్ అసెస్‌మెంట్ టూల్స్, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందగలుగుతారు. పైలట్ కార్యక్రమంలో పాల్గొనే విద్యాసంస్థలకు ఉచితంగా అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాల్లో పరస్పర సహకారాన్ని అందించడానికి 4వ ఎంఓయూ జరిగింది. ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం, విద్యా సంస్థలుపరిశ్రమల మధ్య బలమైన అనుసంధానం ఏర్పరచడం ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఎంఓయూలకు ముందు ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, ఏపీలో గల విస్తృత అవకాశాలను వివరించారు. అనంతరం జూలియన్ హిల్ ను సీఎం చంద్రబాబునాయుడు శాలువాతో సత్కరించారు. అరకు కాఫీని, ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ శాఖ ఎండీ గణేష్ కుమార్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ వి.ఉమా, చెన్నైలో ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ శ్రీమతి సిలై జాకీ, సహాయ కార్యదర్శి డా. డామియన్ ఒలివర్, మంత్రి సలహాదారు జార్జ్ థియోనే, హోమ్ అఫైర్స్ రీజనల్ డైరెక్టర్ స్టీవెన్ స్టీవెన్ బిడెల్, ప్రథమ కార్యదర్శి అలిసన్ మస్ గ్రోవ్, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ ప్రో వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ లీసా జాంబర్డాన్, రీటొండ్ వ్యవస్థాపకులు టాడ్ కింగ్, డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ మేనేజర్ మ్యాక్సిమిలియన్ మెక్ కలఫ్ పాల్గొన్నారు.

## పాక్ శాంతి ర్యాలీలో పేలుడు

>> దాడిగా కనిపిసు న్నట్లు ప్రాథమిక సమాచారం ఉన్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. భద్రతా పరిస్థితులు ఐటీవల నెలలుగా దిగజారుతున్న నేపథ్యంలో శాంతి, భద్రత పునరుద్ధరణకు డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజన మండలి స్వాత్ అమన్ జిర్గా ఈ శాంతి ర్యాలీని నిర్వహించింది. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు శాంతికి మద్దతుగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. పేలుడు అనంతరం సహాయక బృందాలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించాయి. పోలీసులు, ఇతర భద్రతా బలగాలు ఘటనాప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి. పేలుడుకు బాధ్యులెవరు, దాడి వెనుక ఉన్న కారణాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

## కర్ణాటక కేబినెట్ విస్తరణపై ఇంకా ఊగిసలాట

>> జాబితాను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. వారి పర్యటన అనంతరం కొత్త మంత్రుల పేర్లతో పాటు ప్రమాణ స్వీకార కార్యక్రమం తేదీ, సమయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం అధికారికంగా సమయాన్ని ప్రకటించక పోయినా, ముఖ్యమంత్రి మౌఖిక ఆదేశాల మేరకు ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి కచ్చితంగా రెండు నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ కేబినెట్ విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. జూన్ 3న 14 మంది సభ్యులతో తొలి మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయగా, మొత్తం 20 మంత్రి పదవులు ఖాళీగా ఉంచారు. పార్టీ అంతర్గత సంప్రదింపులు, హైకమాండ్ అనుమతి కోసం ఎదురుచూడాల్సి రావడంతో విస్తరణ పలుమార్లు వాయిదా పడింది. ఖాళీగా ఉన్న 20 మంత్రి పదవుల్లో 18 స్థానాలను ఈ విడతలో భర్తీ చేసే అవకాశం ఉందని, భవిష్యత్ రాజకీయ, సంస్థాగత అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు పదవులను ఖాళీగా ఉంచే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# నీట్-పిజిలో సంస్కరణలు

>> నగరాల ఎంపిక విధానంలో మార్పులు చేశారు. ఇకపై అభ్యర్థులు తమ ప్రాధాన్యత క్రమంలో మూడు పరీక్షా నగరాలను, వాటికి సంబంధించిన రాష్ట్రాలతో కలిసి ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. పరీక్షకు సుమారు మూడు వారాల ముందే అధికారిక వెబ్‌సైట్‌లో టెస్ట్ సిటీ ఇంటిమేషన్ స్లిప్‌ను విడుదల చేయనున్నారు. దీంతో అభ్యర్థులు తమ ప్రయాణం, వసతి ఏర్పాట్లను ముందుగానే ప్రణాళికాబద్ధంగా చేసుకునే వీలుంటుంది. పరీక్ష విధానంలోనూ మార్పులు చేశారు. ఇప్పటి వరకు ఉన్న 200 ప్రశ్నల స్థానంలో ఈసారి 180 ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. అయితే పరీక్ష సమయం మాత్రం యథాతథంగా 3 గంటల 30 నిమిషాలు కొనసాగుతుంది. ప్రశ్నల సంఖ్య తగ్గడంతో ఒక్కో ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి అభ్యర్థులకు ఎక్కువ సమయం లభించనుంది. పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు దరఖాస్తు ప్రక్రియతో పాటు పరీక్ష రోజున కూడా ఆధార్ ఆధారిత ధృవీకరణను అమలు చేయనున్నారు. వేలిముద్రల ధృవీకరణ విఫలమైతే ఐరిస్ (కంటి గుడ్డు) బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా అభ్యర్థుల గుర్తింపును నిర్ధారిస్తారు. నీట్ పిజి-2026కు మొత్తం 2,73,183 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గత యేడాదితో పోలిస్తే నమోదు సంఖ్య 12.5 శాతానికి పైగా పెరగడం వైద్య విద్యపై పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అధికారులు చెపుతున్నారు.

# శాంతించని గోదావరి

>> మరింత పెరిగే అవకాశాలు ఉండటంతో తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముంపు ముప్పు ఉన్న గ్రామాల్లో ప్రత్యేక బృందాలను మోహరించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను దశలవారీగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అధికారులు కల్పిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ, గోదావరి గట్టులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. ఎవరూ గోదావరిలో స్నానాలు చేయవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని, వరద నీటిని చూసేందుకు నది ఒడ్డుకు చేరుకోవద్దని హెచ్చరిస్తున్నారు. చిన్నారులను నీటి సమీపానికి వెళ్లనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి నదీ పాయలైన గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ట, వైనతేయ నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. దీంతో పలు లంక గ్రామాలు వరద నీటితో చుట్టుముట్టబడ్డాయి. ముక్తేశ్వరం సమీపంలోని తొగరుపాయ-ఎదురుబిడియం కాజ్‌వే పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చాకలిపాలెం సమీపంలోని కనకాయలంక కాజ్‌వే కూడా వరద



ప్రవాహంలో మునిగిపోవడంతో రవాణా పూర్తిగా స్తంభించింది. బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడుముడి లంక, జి.పెదపూడి లంక, ఆనగాల లంక, పెదమల లంక, అయోధ్య లంక, మర్రిమూల గ్రామాలకు రోడ్డు మార్గం ద్వారా వెళ్లే అవకాశం లేకుండా పోయింది. లంక గ్రామాల ప్రజలు ప్రస్తుతం అత్యవసర అవసరాల కోసం పడవల ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని వైద్యశాలలకు తరలించేందుకు కూడా అధికారులు ప్రత్యేక పడవలను వినియోగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. పరిస్థితిని గంట గంటకూ సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచనలు తప్పని సరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరద నీరు పోటెత్తి పాశర్లపూడి కరకట్ట దిగువ భాగంలో ఉన్న అప్పనపల్లి కాజ్వే వద్ద ప్రధాన రహదారి పూర్తిగా జలమయమైంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ దారిలో వాహనాల రాకపోకలపై అధికారులు పూర్తిగా నిషేధం విధించారు. ఈ వరద పరిస్థితుల వల్ల ప్రజలతో పాటు, అప్పనపల్లిలోని శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మధ్యలంక పరిసరాల్లో చిక్కుకుపోయిన పశువులను రైతులు ఇంజన్ బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లంక గ్రామాల్లో సాగు చేసిన పలు కూరగాయల పంటలు నీట మునగడంతో తాము భారీగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక రెవెన్యూ, పోలీసు లేదా విపత్తు నిర్వహణ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గోదావరి వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో పరిస్థితిని బట్టి మరిన్ని సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

# మచిలీపట్నం మెడికల్ కాలేజీకి పింగళి వెంకయ్య పేరు

>> అడుగులు వేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు , గౌడ కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురు మూర్తి, వెలుగు ఫౌండేషన్ ప్రతినిధులు, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

**48 మందికి సైకిళ్ల అందజేత:** నడవలేని స్థితిలో ఉన్నవారికి అండగా నిలిచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1800 మందికి ట్రైసైకిల్స్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు కృష్ణా జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రై సైకిల్లను లబ్దిదారులకు అందించారు. దివ్యాంగులు కూడా తమ విధులకు హాజరయ్యేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడడం లక్ష్యంగా ట్రైసైకిల్స్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. 70 శాతానికి పైగా అంగవైకల్యం కలిగి, పదోతరగతి చదువుకున్న వారికి సుమారు రూ.1.15 లక్షల విలువైన ట్రై సైకిల్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. దివ్యాంగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ చిత్తశుద్ధితో పని చేస్తోందని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే పెన్షన్ రూ.6 వేలకు పెంచాం. పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి ఏకంగా రూ.15 వేల చొప్పున అందిస్తున్నాం. దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా వారి స్వయం ఉపాధికి తోడుగా నిలుస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురు మూర్తి, దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ గడిపూడి నారాయణస్వామి తదితర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు గారు, జిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి మచిలీపట్నంలోని 46వ డివిజన్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని విచారించారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందుకున్నా, సమస్యలున్నా తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# రాజకీయాల్లోకి కాక్రోచ్ జనతాపార్టీ

### 5న కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం

**ముంబయి,ఆగస్టు 2:** ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాక్రోచ్ జనతా పార్టీ సీజేపీ ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్‌జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే రెస్పాన్స్ గ్రూప్ గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 15 డెడ్‌లైన్

>> ర్భంగా ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గత ప్రభుత్వంలో 28 వేల కోట్లు ఉండగా కూటమి ప్రభుత్వ హయాంలో మరో 25వేల కోట్ల రూపాయలు బకాయిలు పెరిగిపోయాయని వాపోయారు. ఉద్యోగుల బకాయిలు చెల్లించడం ప్రభుత్వ రాజ్యాంగ బాధ్యత కాదా అని బొప్పరాజు ప్రశ్నించారు. పనిచేసిన కాలానికి ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన సొమ్మును మాత్రమే కోరుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రతి ఆరునెలలకు ఒకసారి చెల్లించాల్సిన డి.ఎ.లను రెండు సంవత్సరాలుగా ఇవ్వకపోవడం ఉద్యోగులపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. ఒకవైపు పెరుగుతున్న పని ఒత్తిడి, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల 27 డిమాండ్లపై గత నెల 22వ తేదీన జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి జె.ఎ.సి. తీసుకుని వెళ్లినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పందన లేదన్నారు. ఆగస్టు 15లోపు ఉద్యోగుల ఆర్థిక, సేవా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయాలు వెలువడకపోతే, అదే వారంలో ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణను ప్రకటించాలని రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. ఈసమావేశంలో అమరావతి జె.ఎ.సిసెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు, ఉద్యమకమిటీ ఛైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు జె.ఎ.సి.లోని ప్రధాన భాగస్వామ్య సంఘాల రాష్ట్ర నాయకులు, సెక్రటేరియట్ మెంబర్లు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు భారీ ప్యాకేజి

>> భోగాపురం విమానాశ్రయం నిర్మించామని వెల్లడించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందే చంద్రబాబు 2200 ఎకరాల భూసేకరణ చేశారని పెమ్మసాని ప్రస్తావించారు. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారం కోల్పోయిన సమయానికి భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన భూమి కేవలం 500ఎకరాలు మాత్రం పెండింగ్‌లో ఉందని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో కేవలం 300 ఎకరాలు మాత్రమే సేకరించారని వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్ట్ కోసం జీఎంఆర్ వేసిన టెండర్‌ను జగన్ రీ టెండర్ చేశారని ప్రస్తావించారు. జగన్ ఐదేళ్ల పాలనలో భోగాపురం విమానాశ్రయాన్ని ముందుకు పోనివ్వలేదని ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పలుమార్లు ఈ ఎయిర్‌పోర్ట్ కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ఐడియా కూటమి ప్రభుత్వానిదే అని పెమ్మసాని స్పష్టం చేశారు. ఈ విమానాశ్రయంపై జగన్ డిబేట్‌కు రావాలని సవాల్ చేశారు. అమరావతి రైతులను అడ్డుపెట్టి సీడ్ యాక్సెస్ రోడ్లు రాకుండా జగన్ కుట్ర చేశారని దుయ్యబట్టారు. విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఏడు రోడ్లు కావాలని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఐదు రోడ్లను పూర్తి చేశామని అన్నారు. ఐదేళ్లలో ఒక్క రోడ్డు కూడా జగన్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ప్రజలు అభివృద్ధిని అర్థం చేసుకోవాలని సూచించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు తనపై చేసే వ్యాఖ్యలను తాను పట్టించుకోనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చాలా అభివృద్ధి కావాలని పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు.

# రూ.52కే సన్న బియ్యం

>> కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నూపూర్ అజయ్ కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో గత నెల రోజులుగా బియ్యం ధరలు కిలోకు సుమారు రూ.10 వరకు పెరిగినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను ప్రభుత్వం పరిశీలించిందని మంత్రి తెలిపారు. పౌర సరఫరాల శాఖ, ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో సమన్వయం చేసుకుని ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గతంలో కిలో రూ.64-65 వరకు ఉన్న బీపీటీ స్టీమ్ రైస్‌ను ప్రస్తుతం కేవలం రూ.52కు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఒక్క కుటుంబానికి గరిష్టంగా 10 కిలోల వరకు ఈ ధరకు బియ్యం కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. గతంలో కిలో రూ.58-60 వరకు ఉన్న బీపీటీ రా (పచ్చి) బియ్యాన్ని రూ.50 కు కిలో చొప్పున విక్రయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రాయితీ ధరల విక్రయాలు రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ప్రారంభమయ్యాయని వెల్లడించారు. రాష్ట్రంలోని 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్ల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండటంతో పాటు బహిరంగ మార్కెట్‌లో ధరలపై నియంత్రణ ఏర్పడేలా ఈ చర్య దోహదపడుతుందని పేర్కొన్నారు. దేశంలోనే వినియోగదారులకు ఇంత తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం ప్రత్యేకమైన కార్యక్రమమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులు రైతు బజార్లు, రైస్‌మిల్ అవుట్‌లెట్ల వద్ద జరిగే ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్ ధరల నియంత్రణపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వినియోగదారులపై నిత్యావసర వస్తువుల ధరల భారం పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# విరుపాక్షి అరెస్ట్

>> మధ్య ఫోన్ సంభాషణలో వివాదం చోటు చేసుకుంది. అనంతరం ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్న గ్రామస్తులు సర్ది చెప్పి పంపించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి, సోదరుడు శ్రీరాములు, తనయుడు చంద్రతో కలిసి దాదాపు ఐదు వాహనాలలో కార్యకర్తలతో కలిసి సంఘాల గ్రామానికి వెళ్లారు. అక్కడ నుండి టిడిపి కార్యకర్తలు అయిన శేఖర్ ఇంటికి, మరియు దళిత నాగరాజు ఇంటికివెళ్లి ఎమ్మెల్యే విరుపాక్షి, సోదరుడు శ్రీరాములు తనయుడు చంద్రతో పాటు పలువురు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు దాడికి పాల్పడేందుకు ప్రయత్నించారు. ఘటనలో శేఖర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దళిత నాగరాజు భార్య సుచిత్రపై దాడికి ప్రయత్నించడమే కాకుండా కులం పేరుతో దూషించారని, తన నైటీ చించారని, తన భర్తను చంపుతామంటూ బెదిరించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు పల్లవి, సుచిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎమ్మెల్యే విరుపాక్షి, సోదరుడు శ్రీరాములు, తనయుడు చంద్రతో సహా మరో 27 మందిపైదాడి హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ కేసు వేరువేరుగా కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

## ప్రధానికి మోడీకి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు

**విజయవాడ.ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** మత్తు రహిత సమాజమే లక్ష్యంగా నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలంటూ "ఎక్స్" సామాజిక మాధ్యమం వేదికలో మంత్రి నారాలోకేష్ పోస్టు చేసారు. డ్రగ్స్ నిర్మూలనపై దేశవ్యాప్తంగా 100 వారాలు కార్యక్రమంని జాతీయ ఉద్యమంగా నిర్వహించాలని ప్రధాని ఇచ్చిన పిలుపుతో ఈ జాతీయ ఉద్యమంలో అందరం భాగం అవుదాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో ఎన్నో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాం. ఈగల్ అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి సమాజభాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అలుపెరుగని కృషి చేస్తున్నామన్నారు.

## వారం - వర్జ్యం

03-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేష కార్తె,
తి.పంచమి రా.10.51
న.ఉత్తరాభాద్ర రా.9.57
వ.ఉ.7.19-ఉ.9.57
దు.1. మ.12.39-మ.1.30
దు.2. మ.3.13-సా.4.04
రాహు. ఉ.7.30-ఉ.9.00
శుభ ఉ.10.00-ఉ.11.00

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి సలహాతో కొత్త కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారాలలో మంచి మార్పులు ఉంటాయి.

**వృషభం :** జీవితాశయాన్ని ఏ విధంగానైనా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు. సోదరుల కలయిక.

**మిథునం :** చర్మ సంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి. మొండి వ్యవహారాలను కాలానికి వదిలి వేస్తారు.

**కర్కాటకం :** మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవర్తిస్తారు. ప్రయాణాలు.

**సింహం :** సంతానాన్ని సక్రమమైన పంథాలో నడిపించడానికి విశేషంగా కృషి చేస్తారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**కన్య :** చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరంగా పారిపోకుండా సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తారు.

**తుల :** అప్పు చేయక పోవటమే నిజమైన పొదుపు అని గుర్తిస్తారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**వృశ్చికం :** ఎదుటివారి సంభాషణలలోని నిజనిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు. వాహన యోగం.

**ధనుస్సు :** ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు.

**మకరం :** సంతానరీత్యా సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**కుంభం :** అమ్మకాలు కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్దతగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు.

**మీనం :** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పులుల సంరక్షణ, నిర్వహణ చర్యలపై అధ్యయనానికి ఉన్నత స్థాయి కమిటీ

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** పులుల సంరక్షణ, నిర్వహణ చర్యలపై అధ్యయనానికి ఉన్నత స్థాయి కమిటీని నియమించారు. డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో ఐదుగురు సభ్యులతో కమిటీ నియామకం చేశారు. నల్లమలలో అనుమానాస్పద స్థితిలో పులి మరణించిన ఘటనపై పవన్ చర్యలు చేపట్టారు. పులులు, వన్యప్రాణుల సంరక్షణ చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# శ్రీవారి 'లడ్డూ'కు 310 యేళ్లు!

### ప్రసాదం విశిష్టతపై త్వరలో బంగారు నాణెం

### బ్రహ్మోత్సవాల వేళ సిఎం చేతులమీదుగా ఆవిష్కరణ

### టిటిడి కీలక నిర్ణయం

**తిరుమల, ఆగస్టు 2 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతటివిశిష్టమైన లడ్డూ ప్రసాదం వైశిష్ట్యంపై తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. లడ్డూ ప్రసాదం తరహాలో బంగారునాణెం తయారు చేయాలని ఆలోచన చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశా రు. రానున్న బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు తీసుకు రానున్న సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా బంగా రునాణెం ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే తిరుమల లడ్డూ నాణ్యత, రుచిలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల నుండి విశేష ఆదరణ లభించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం 310 సంవత్సరాల క్రితం ప్రారంభించినట్లు నిర్ధారణకు వచ్చిన టిటిడి ప్రభుత్వానికి ప్రత్యేక ప్రతిపాదనలు చేసింది.



కోట్లాది మంది హిందూ భక్తులు శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. శ్రీవారి లడ్డూ ప్రసాదానికి గల చరిత్ర, ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని టిటిడి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒ బంగారు నాణెం విడుదల చేయాలన్న ప్రతిపాదనను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే సెప్టెంబర్‌లో జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో సీఎం చంద్ర బాబు చేతుల మీదుగా నాణెం విడుదల చేసేందుకు టిటిడి ఉన్నతాధికారులు కార్యాచరణ సిద్ధంచేస్తున్నారు.

15వ శతాబ్దంలో శ్రీవారి ప్రసాదంగా మొదట వడ ఇష్టే వారని అనంతరం బూంది ప్రవేశపెట్టగా కాలక్రమేణా లడ్డూలు ప్రత్యేక గుర్తింపు వచ్చినట్లు చెబుతున్నారు. 1803 లో బ్రిటీష్‌వాళ్ళు శ్రీవారి ఆలయంలో ప్రసాదాల విక్ర యాలు ప్రారంభించారు. విశిష్టత కలిగిన తిరుపతి లడ్డూకు 2009లో జిఐ (భౌగోళిక గుర్తింపు) లభించింది. పేటెంట్ హక్కులు ఉన్నాయి ఈ కారణంగానే టిటిడి అనుమతి లేకుండా ఈ లడ్డూను మరెవరూ తయారు చేయకూడదనే నిబంధనలు అమలవుతున్నాయి. ఇప్పటికే రోజుకు 4.50 లక్షల వరకు లడ్డూలు భక్తులు కొనుగోలుచేస్తున్నారు. నెలవారీగా 1.50కోట్ల లడ్డూలు విక్రయాలు జరుగు తుం డటం విశేషం. 50రూపాయలు లడ్డూలతోబాటు కల్యా ణోత్సవం లడ్డూ 200 రూపాయలుగా నిర్ణయించి విక్రయాలు చేస్తున్నారు.

## తిరుమల సమాచారం



**తిరుమల, ఆగస్టు 2 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠ తిరుమలగిరులు శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది జరుగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల కార్యాచరణను తిరుమల తిరుపతి దేవస్థానం ఖరారుచేసింది. ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు

### సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

### -తొలిరోజే పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం

నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 15నుండి 23వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 11నుండి 20వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. వాహనసేవలను ఆలయమాడవీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవల వీక్షణకు సౌకర్యాలు కల్పనపై ఇప్పటికే టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి అధ్యక్షతన ప్రాథమికసమీక్ష నిర్వహించారు. తిరుమలేశుని ఆలయంలో ఈ ఏడాది సెప్టెంబర్ 15వతేది నుండి 23వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ముహూర్తం ఖరారుచేశారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరగనున్నాయి. సెప్టెంబర్ 14వ తేదీ అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మో త్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను వైభ వంగా విజయవంతంగా నిర్వహించే ఏర్పాట్లు చేపడుతామని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశముందని, ఇందుకు అనుగుణంగా పటిష్టంగా ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేయడం జరుగుతుంది. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ కు భక్తులు అశేషసంఖ్యలో విచ్చేసే అవకాశం ఉండటంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడతారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు రద్దుచశారు. ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు మంజూరు చేస్తారు. ఇప్పటికే స్వామివారి ఆలయానికి ఉత్తరంవైపు ఉన్న పవిత్ర పుష్కరిణి మరమ్మతులకు పుష్కరిణిని మూసివేశారు.

సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తొలిరోజు సెప్టెంబర్ 15వతేదీన ధ్వజారోహణం రోజునే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 15వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 19న గరుడసేవ, 20న స్వర్ణరథం, 23న చక్రస్నానం జరుగుతాయి. పోలీసులతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రత కల్పించేలా చూడనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.



## కేంద్రం నుంచి అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటా


### రాష్ట్రాభివృద్ధికి మరింత బలం చేకూరింది

### సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ, ఆగస్టు 2, ప్రభాతవార్తప్రతినిధి:** అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన పన్నుల వాటా కేటాయింపుతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్ర మాలకు మరింత బలం చేకూరుస్తుందన్నారు.



రాష్ట్ర ప్రజల తరఫున ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అదనపు పన్నుల వాటా విడుదలతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## 2,079 కోట్లతో సచివాలయ కాంప్లెక్స్

# పనులకు టెండర్లు

**రాజంపేట, ఆగస్టు2, ప్రభాతవార్త :** రాష్ట్ర రాజధాని సచివాలయ కాంప్లెక్స్‌తో పాటు జీఏడి టవర్ల నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు 2079.39 కోట్ల రూపాయలతో అమరావతి గ్రోత్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సంస్థ ఆదివారం కీలక పనులకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2028 నాటికి సచివాలయం కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసిన నేపథ్యంలో తాజా నిర్మాణం పనుల టెండర్లు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 442.06 కోట్ల అంచనాతో అమరావతి సచివాలయం హెచ్ ఓ డి కాంప్లెక్స్ నిర్మాణానికి,727.45 కోట్లతో 3,4 టవర్లతో పాటు ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణం కీలక పనులకు, 909.88 కోట్లతో 1,2 టవర్ల నిర్మాణం పనుల్లో గ్లాస్ తో పాటు వివిధ ఫ్యాబ్రికేషన్ ఇతర ఎలివేషన్ పనులకు టెండర్ పిలిచారు. ఈ మేరకు అమరావతి గ్రోత్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సంస్థ ఎండి టెండర్ నోటిఫికేషన్ ప్రకటించారు. టెండర్ బిడ్ ఈనెల 4న ప్రారంభమై చివరి గడువు ఈనెల 26గా నిర్ణయించారు. ఇదే రోజున బిడ్ కూడా ఓపెన్ చేస్తారు.

## పార్టీలకు న్యాయవాదుల సేవలు కీలకం

### డిసిఎం పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు వస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలి

### కౌన్సిల్ విప్ పి.హరిప్రసాద్




కృష్ణా, గుంటూరు జిల్లాల హైకోర్టు న్యాయవాదుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిల్ విప్ హరిప్రసాద్

**విజయవాడ, ఆగస్టు2, ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయవాదుల సేవలు లేకుండా ఏ రాజకీయ పార్టీ కూడా సమర్థంగా ముందుకు సాగలేదని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శి, శాసన మండలి విప్ పిడుగు హరి ప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ కార్యకలాపాల నిర్వహణ లోనైనా, ప్రజా సమస్యల పరిష్కారంలోనైనా, ఎన్నికల ప్రక్రియలోనైనా లేదా చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే సందర్భంలోనైనా న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఏ సమస్య ఎదురైనా, చట్టపరమైన సలహా, సరైన మార్గదర్శకత్వం అవసరమైనప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది న్యాయవాదులేనని అన్నారు. జనసేన పార్టీ కృష్ణా, గుంటూరు జిల్లాల హైకోర్టు న్యాయవాదుల సమీక్ష సమావేశం పార్టీ కార్యాలయంలో జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయవాదుల పాత్ర, కొత్త న్యాయవాదులను లీగల్ సెల్‌లోకి ఆహ్వానించడం, కార్యకర్తలపై గత ప్రభుత్వంలో పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకునేలా చొరవ తీసుకోవడం, జనవాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై చర్చించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం సేవలందిస్తూ, పార్టీ పిలుపు మేరకు గత ప్రభుత్వ హయాంలో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు, ధర్నాలు నిర్వహించిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు పోలీసు కేసుల కారణంగా ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశంపై డిసిఎం పవన్ కల్యాణ్ కూడా రెండుసార్లు ప్రత్యేకంగా సమావేశమై, ఏ కోర్టులో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి పరిష్కారం ఎలా సాధ్యమవుతుందనే విషయంపై చర్చించారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నా కేసుల విషయమై ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారని, అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా జనసేన నాయకులు, కార్యకర్తలపై రాజకీయ కక్ష సాధింపుతో నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుతం వాటి స్టేటస్, ఏ కోర్టులో విచారణ జరుగుతోంది, ఏ సహాయం అవసరమనే అంశాలపై పూర్తి నివేదికను సిద్ధం చేసి కేంద్ర కార్యాలయానికి అందించగలిగితే కార్యకర్తలకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దీని ద్వారా కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయడమే కాకుండా, పార్టీ కోసం పోరాడిన కార్యకర్తలకు అండగా నిలిచినవారమవుతామన్నారు. కాకినాడలో పవన్‌ను దూషించిన ఘటనకు నిరసిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేసిన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలపై కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. అలాగే విశాఖ నోవాటెల్ సంఘటన స్థలంలో లేకపోయినా అనుమానాల ఆధారంగా పలువురిపై కేసులు నమోదు చేసి 18 మందిని సెంట్రల్ జైలులో పెట్టారని వివరించారు. ఈ విధంగా అనేక మంది కార్యకర్తలు న్యాయపోరాటం చేస్తూ సమయం, మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎవరైనా పార్టీ అధినాయకుడిని లేదా ముఖ్య నాయకులను చట్టవిరుద్ధంగా దూషిస్తూ, పరువు నష్టం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేసినప్పుడు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుని పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా ముందుకు వెళ్లాలని హరిప్రసాద్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్ ఛైర్మన్ ఇవన సాంబశివ ప్రతాప్, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి కొప్పెర కోటేశ్వరరావు, గుంటూరు లీగల్ సెల్ అధ్యక్షులు అమ్మినాయుడు, కృష్ణా జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు క్రిరణ్, హైకోర్టు సీనియర్ న్యాయవాది సింగలూరి శాంతిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

### సాయికృష్ణ మృతికేసులో నిందితుడు

## సురేశ్ ఆచూకీ కోసం సిట్ వేట

**విజయవాడ, ఆగస్టు2, ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ మృతికేసులో నిందితుడు సురేశ్ ఆచూకీ కోసం సిట్ గాలింపు చర్యలు చేపట్టింది. సాయికృష్ణను చిత్రహింసలు గురిచేసి చంపేశారని మృతుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించింది. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సీఐ నాగరాజును సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఈ కేసు త్వరితగతిన పూర్తి చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన సిట్ సీఐ నాగరాజును అరెస్ట్ చేసింది. దీంతో పాటు అతడికి సహకరించిన కానిస్టేబుల్స్ అశోక్, నానితో పాటు కృష్ణలంక క్రైమ్ కానిస్టేబుళ్లు బాబురావు, సాంబయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించింది. ప్రస్తుతం నిందితుడు సురేశ్ ఆచూకీ కోసం సిట్ గాలిస్తోంది. అతడి ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పత్రికా ప్రకటన విడుదల చేసింది. కేసు నమోదైన తర్వాత సురేశ్ పరారీలో ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. సురేశ్ గురించి ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిట్ తెలిపింది. నిందితుడి వివరాలు తెలిసిన వాళ్లు 100/112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పేర్కొంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కృష్ణలంక మాజీ సీఐ నాగరాజుకు సురేశ్ అత్యంత సన్నిహితుడు. ప్రైవేట్ వ్యక్తి అయినప్పటికీ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అతను పెత్తనం సాగించేవాడని సిట్ దర్యాప్తులో తేలింది. సాయికృష్ణను అదుపులోకి తీసుకోవడం నుంచి అతడు మృతి చెందడం, అనంతరం శవాన్ని మాయం చేయడం వరకు అన్ని వ్యవహారాల్లో సీఐ నాగరాజుకు సురేశ్ సహకరించినట్లు తేలింది. సురేశ్‌పై కేసు నమోదు చేయకముందే పలుమార్లు అతడిని పిలిపించి సిట్ కొంత సమాచారం సేకరించినట్లు విస్తృత ప్రచారం జరిగింది. ఈ సందర్భంలో పోలీస్ స్టేషన్ నుంచి సాయికృష్ణను ఎందుకు బయటకు తీసుకెళ్లారు? ఎవరు తీసుకెళ్లారు? ఎక్కడెక్కడ తిప్పారు? ఆతర్వాత ఎప్పుడు స్టేషన్‌కు తీసుకొచ్చారు? అనే వివరాలను అతని నుంచి రాబట్టినట్లు తెలుస్తోంది. అయితే సురేశ్‌పై కేసు నమోదు చేసి ఏ4గా పేర్కొన్న తర్వాత నుంచి కనిపించడం లేదు.



### శిశువు అక్రమ కొనుగోలు కేసులో ముగ్గురు అరెస్టు

**విజయవాడ, ఆగస్టు2, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో శిశువు అక్రమ కొనుగోలు కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణలంక రాజీవ్‌గాంధీ పార్క్ వద్ద పోలీసుల తనిఖీల్లో భాగంగా నిందితులను అరెస్టు చేశారు. దంపతులు కృష్ణారెడ్డి, శివపార్వతి, బిహార్‌కు చెందిన సయ్యద్ ఆలంలు అరెస్టు అయ్యారు. నిందితుల నుంచి 3రోజుల వయస్సు ఉన్న శిశువును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పిల్లలు కలగరని తెలిసి రూ.6.59 లక్షలు చెల్లించి దిల్లీకి చెందిన మహిళ ద్వారా దంపతులు ఆడ శిశువును కొన్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

## దగదర్తిలో 313 కిలోల గంజాయి పట్టివేత

**దగదర్తి (నెల్లూరు), ఆగస్టు 2, ప్రభాతవార్త :** మండలంలోని సున్నపుబట్టి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. సుమారు 313 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో జిల్లాలో ఈ ఘటన సంచలనంగా మారింది. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం నెల్లూరు వైపు వెళ్తున్న ఓ బొలెరో వ్యాన్ అదుపు తప్పి సున్నపుబట్టి సమీపంలోని కల్వర్టులోకి దూసుకెళ్లింది. దీనిని గమనించిన వాహనదారులు దామవరం రోడ్డు వద్ద గస్తీ నిర్వహిస్తున్న మొబైల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే దగదర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని పరిశీలించారు. ఘటనా స్థలంలో ఎవరు లేకపోవడం డ్రైవర్ కనిపించక పోవడంతో అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. ప్రమాదంతో వాహనం వెనుక భాగం దెబ్బ తినడంతో అందులో దాచిన గంజాయి బండిళ్లు బయట పడ్డాయి. కావలి రూరల్ సీఐ శివశంకర్, బిట్రగుంట ఎస్సై రామకృష్ణ, తహసీల్దార్ లాజరస్ ఆధ్వర్యంలో అధికారులు వాహనంలో నుంచి గంజాయిని పంచనామా నిర్వహించారు. తనిఖీలో 9 బండిళ్లు 313 1/2 కేజీలు ఉన్నట్లు అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమాని, డ్రైవర్ వివరాలు సేకరిస్తున్నామని, నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

## మళ్లీ కొండ కిటకిట

### -వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల, ఆగస్టు 2 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమ ల భక్తజనసంద్రంగా మారింది. వారాంతపుకావడం,శని ఆదివారాలు సెలవు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరారు. సాధారణ సర్వదర్శనం (టోకెన్ లేని భక్తులు)భక్తులు వేలాదిగా దేశం నలుమూలల నుండి తరలివస్తున్నారు.ఆదివారం సాయంత్రానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి మధ్యాహ్నానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 48వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. తిరుమలకు చేరుకునే సామాన్యభక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో గదుల కోసం నిరీక్షణ తప్పడంలేదు.

### నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి, ఆగస్టు 2 ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం)ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో బాటుసర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 8712652679, చిత్తూరు: 7993147979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 9440817449, కడప: 08562242457, కర్నూలు: 7382614308, నంద్యాల: 7382618976, అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847 నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలి.



### ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.25 లక్షల విరాళం

**తిరుమల, ఆగస్టు 2 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన దాత చెవూరి ఉషశ్రీ 25 లక్షల విరాళాన్ని అందజేశారు. తిరుమలలో టిటిడి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడును కలిసి ఆమె విరాళం చెక్కును అందించారు. దాతృత్వం చాటిన ఉషశ్రీని ఛైర్మన్ బి.ఆర్. నాయుడు అభినందించి, ఆమెకు వేంకటేశ్వర స్వామి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎపిలో 'ఇంటింటికి టిడిపి'కి అనూహ్య స్పందన

### 7 రోజుల్లో 17.61 లక్షల కుటుంబాలను కలిసిన కూటమి శ్రేణులు

### ఆదివారం సెలవు రోజైనా 3 లక్షలకు పైగా గృహాలను సందర్శించిన నేతలు

### టెక్నాలజీతో పర్యవేక్షిస్తూ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన మంత్రి లోకేశ్

**విజయవాడ, ఆగస్టు2, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికీ టీడీపీ – 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఏడు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,61,197 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు.టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు చేస్తున్నారు. ఆదివారం కూడా విశేష ఉత్సాహంతో పాల్గొనడం, ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని లోకేశ్ అన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరును వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం విరామం తీసుకోకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, గత రెండేళ్లలో ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను గణాంకాలతో సహా తెలియజేశారు.



ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

వార్త


ఎప్పుడూ ఒకరికి ఇవ్వడం నేర్చుకో అంతేకాని తీసుకోవడం కాదు. అలాగే ఒకరికి సేవ చేయడం నేర్చుకో. అంతేకాని ఒకరిపైన పెత్తనం చేయడం కాదు.

- రామకృష్ణ పరమహంస

# పటిష్టమైన చట్టమే పరిష్కారం!


బాధపడడం తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవల కాలంలో సహనం, ఓర్పు సన్నగిల్లి ఆందోళనబాటపడుతున్నారు. తమకెంతటి నష్టం జరిగినా, ఎవరు ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లికుళ్లి, మనసులోనే బాధపడి చివరకు ప్రాణత్యాగం చేయడానికి అయినా సిద్ధపడతారే తప్ప తమను దగా చేసినవారిపై కక్ష కట్టి దాడులు చేసేందుకు సాహసించకపోయేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా, వ్యవసాయానికి మూలమైన విత్తనాల్లో నకిలీ, నాసిరకంతో మోసపోయినా, దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని దగాకు గురవుతున్నా తమ కర్మకు తామే బాధపడుతూ మౌన రోదనతో ఇంటిముఖం పట్టేవారు. ఇటీవల కాలంలో అక్కడక్కడ రైతులు రోడ్లపైకి రావడం, ధర్నాలు, నిరసనలు లాంటి కార్యక్రమాలు తెలిపేందుకు స్వచ్ఛందంగా కదలి వస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించి తెచ్చిన పంటలను అమ్ముకోవడంలో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దేశవ్యాప్తంగా చూసినా అధికశాతం మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యం. కొలతల్లో మోసం. ధరలను నిర్ణయించడంలో దగా. ఒక్కటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచి ఉంటూనే ఉన్నారు. రైతులు మోసపోతూనే ఉన్నారు. విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్నిస్థాయిల్లో ఈదగా జరుగుతూనే ఉన్నది. దీనిని నిరోధించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తున్నా ఆశించినఫలితాలు కన్పించడం లేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. కానీ ఎల్‌నినో ప్రభావంతోఆశించిన మేరకు వర్షాలు పడడం లేదు. అయితే ఇటీవల నాలుగైదు రోజులుగా కృష్ణా, గోదావరి నదులకు ఎగువభాగాన భారీ వర్షాలు కురియడంతో ఆ నదులు పొంగి పొర్లుతున్నాయి. రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. పంటలకు విత్తనాలు మూలం. ఈ యేడాది కూడా నకిలీ విత్తనాలు తెలుగు రాష్ట్రాల్లో భారీఎత్తునే సరఫరా అవుతున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు చెబుతున్నాయి. ఈ సీజన్‌కు సంబంధించి హైదరాబాద్ శివారుల్లో ఆ మధ్య ముప్ఫై లక్షల విలువైన మూడువేల కిలోల నాసిరకం పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. ఆ తర్వాత కూడా తెలుగు రాష్ట్రాల్లో నకిలీ, నాసిరకం విత్తనాలు పట్టుబడుతూనే ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు పొరుగునున్న అనేక జిల్లాల్లో నాసిరకం విత్తనాలతో రైతులను మోసం చేశారు. ఇక ఎరువుల గురించి చెప్పక్కర్లేదు. గత నెలలో నల్గొండ జిల్లాలో సరఫరా చేసిన డిఎపి ఎరువుపై ఒక రైతుకు అనుమానం రావడంతో ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగప్రవేశం చేసి ఎరువులను పరిశీలించి, దర్యాప్తు ప్రారంభించడంతో మొత్తం డొంకంతా కదిలింది. ఇక హైదరాబాద్ నడిబొడ్డులో ఏకంగా ఉప్పు, రంగు కలిపి నకిలీ డిఎపిని తయారు చేస్తున్న ముఠాను పట్టుకోవడమే కాదు ఏకంగా వెయ్యి బస్తాలకుపైగా ఈ నకిలీ ఎరువులను పట్టుకున్నారు. అయితే ఈ నకిలీ ఎరువుల తయారీ ఎంతోకాలంగా జరుగుతున్నట్లుచెప్తున్నారు. కేవలం వంద, యాభై రూపాయలతో తయారు చేసిన ఈనకిలీ ఎరువులు బస్తా పదిహేనువందల రూపాయలకు పైగా అమ్ముతున్నారు. నాసిరకం విత్తనాలు సరఫరా చేసేవారిపై పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని పిడిచట్టాన్ని కూడా ప్రయోగించి కటకటలావెనక్కి పంపేందుకు వెనుకాడమని పాలకులు హెచ్చరికల మీద హెచ్చరికలు యేటా చేస్తూనే ఉన్నారు. కానీ ఈ నకిలీ విత్తన వ్యాపారులు అవి పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. యేడాది యేడాదికి ఈవ్యాపారం దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగురాష్ట్రాల్లో అంతకంతకు పెరుగుతున్నది. నాణ్యమైన విత్తనాలు అవసరం మేరకు పాలకులు సరఫరా చేయకపోవడం వల్లనే ఈ రైతులు నకిలీవ్యాపారుల వలలో చిక్కుకుంటున్నారు. రైతుల అవసరాలను, డిమాండ్‌ను ఆసరాగా తీసుకొనిఈవ్యాపారులు పావులు కదుపుతున్నారు. ఇదేదో ఇప్పటికిప్పుడు ప్రారంభమైనది కాదు. ప్రతియేడాది అధికారులు చేస్తున్న దాడుల్లో లక్షలాది కోట్ల విలువైన నకిలీ, నాసిరకం విత్తనాలు పట్టుబడుతూనే ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. దాడులు జరుగుతూనే ఉన్నాయి. అయినా ఇది ఆగడం లేదు. ప్రభుత్వ పరంగా ఎన్నిచర్యలు తీసుకుంటున్నా చట్టంలో ఉన్న లోపాలను ఆసరాగాతీసుకొని కేసుల నుంచి సులభంగా బయటపడగలుగుతున్నారు. అలా జైలుకు వెళ్లి వచ్చిన వారు కూడా మరొకపేరుతోనో, పాత పేరును స్వల్పంగా మార్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం సఫలీకృతం కావడం లేదు. పోలీసులన్నా, వ్యవసాయ అధికారులన్నా పాలకులు చేస్తున్న హెచ్చరికలన్నా ఈ వ్యాపారుల్లో భయభక్తులు లేకుండాపోయాయి. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. అందులో ముఖ్యమైంది, లోపభూయిష్టమైంది విత్తన చట్టమే. ఆచట్టం రైతుల కంటే దళారులకే ప్రయో జనకరంగా ఉంది. ఆ చట్టాన్ని మార్చాలని, దానిస్థానం లో పటిష్టమైన కొత్త చట్టం తేవాలని ఏనాటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. విదేశాల్లో నకిలీ, నాసిరకం విత్తనాలతో అన్నదాతలను మోసం చేసిన దళారులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నాయి. అలాంటి చర్యలు కారణంగా పొరుగునున్న చైనా లాంటి దేశంలో ఎక్కడా నకిలీ విత్తనాలు కన్పించవు. భారత్‌లో జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లో విత్తనాల్లోనే మోసపోయేవారి సంఖ్యతక్కువేమీ కాదు. ఇప్పటికైనాపాలకులు ఆలోచించాలి. పటిష్టమైన విత్తన చట్టానికి రూపకల్పన చేయాలి. వారికున్న ఒక్క ఉపాధిని వారి పాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన అవసరం ఉంది.

స్నేహం కోసం ప్రాణం ఇవ్వడం కష్టమేమీ కాదు. అంతటి త్యాగం చేసే స్నేహితుణ్ని పొందటమే కష్టం.



అరిస్టాటిల్

ఇతరుల నుంచి నీవు ఏమి ఆశిస్తావో దానినే నీవు ఇతరులకు చేయడం నిజమైన మానవ ధర్మం.



సోక్రటీస్

# ఉద్యోగాలు భర్తీ చేస్తేనే యువత సంక్షేమం

**ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులు ప్రజల యజమానులు కాదు. వారు ప్రజలచే ఎన్నుకోబడిన సేవకులు. అధికారం ప్రజల నుంచి వస్తుంది. అందువల్ల ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని నిర్ణయాలు తీసుకోవడం పాలకుల బాధ్యత. యువతకు ఉద్యోగాలు కల్పించడం కూడా ప్రజా సంక్షేమంలో భాగమే. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడం కూడా ప్రజా సంక్షేమంలో భాగమే. ప్రజా సేవలను వేగవంతం చేయడం కూడా ప్రజా సంక్షేమంలో భాగమే. ఒక యువకుడికి ఉద్యోగం లభిస్తే ఒక కుటుంబంనిలబడుతుంది. ఒక కుటుంబం నిలబడితే ఒక సమాజం బలపడుతుంది. ఒక సమాజం బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందుకే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను ఖర్చుగాకాకుండా దేశ భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాలి.**

తరిగోపుల నారాయణస్వామి

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించి ప్రజల చేత ప్రతినిధులను ఎన్నుకోవడం మాత్రమే కాదు, ప్రజల అవసరాలను గుర్తించడం, వారి ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, వారికి మెరుగైన జీవనాన్ని అందించడం కూడా ప్రజాస్వామ్య పాలనలో అత్యంత ముఖ్యమైన బాధ్యత. భారతదేశంలో గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. వార్డు సభ్యుడు, సర్పంచ్, శాసనసభ్యుడు, శాసనమండలి సభ్యుడు, లోక్‌సభ సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు ఇలా ప్రజా ప్రతినిధులందరికీ ఒక నిర్దిష్ట పదవీకాలం ఉంటుంది. ఆ కాలం ముగిసిన తరువాత ప్రజల తీర్పును మళ్లీ కోరుతారు. ప్రజల విశ్వాసాన్ని పొందినవారు అధికారంలో కొనసాగుతారు. విశ్వాసాన్ని కోల్పోయినవారు అధికారానికి దూరమవుతారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైన ప్రక్రియ. అయితే ఇదే సందర్భంలో మనం ఒక ముఖ్యమైన ప్రశ్నను మనసాక్షిగా మనల్ని మనం అడగాలి. ప్రజా ప్రతినిధుల పదవులకు నిర్దిష్ట కాలపరిమితి ఉన్నప్పుడు, ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను ఎందుకు సంవత్సరాల తరబడి భర్తీ చేయకుండా ఉంచాలి? ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన వ్యక్తులైతే, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రజలకు సేవలు అందించడానికి అంతే అవసరమైనవారు. ఒకరు ప్రజల తరఫున విధాన నిర్ణయాలు తీసుకుంటారు. మరొకరు ఆ విధానాలను అమలు చేస్తారు. ఒకరు ప్రజల సమస్యలను సభల్లో ప్రస్తావిస్తారు, మరొకరు ఆ సమస్యలకు సంబంధించిన సేవలను ప్రజలకు అందిస్తారు. అందువల్ల ప్రజా ప్రతినిధులు ఎంత ముఖ్యమో, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ కూడా అంతే ముఖ్యమైనది. ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగ ఖాళీలు ఏర్పడినా వాటిని సంవత్సరాల తరబడి భర్తీ చేయకుండా ఉంచడం వల్ల నష్టం కేవలం ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకే కాదు, ప్రభుత్వ సేవల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు కూడా జరుగుతుంది. ఉద్యోగం కోసం సిద్ధమయ్యే యువత సంవత్సరాల తరబడి చదువుకుంటారు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు, ఆర్థిక భారాన్ని భరిస్తారు, ఒక నోటిఫికేషన్ కోసం నెలల తరబడి ఎదురుచూస్తారు. ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు ఆలస్యమైతే వారి విలువైన సమయం వృథా అవుతుంది, వయోపరిమితి సమస్యలు ఎదురవుతాయి, కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతుంది, చివరికి యువతలో నిరాశ పెరుగుతుంది. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్యకాదు. ఒక కుటుంబ సమస్య, ఒక తరం సమస్య, ఒక సామాజిక సమస్య. అదే సమయంలో ప్రభుత్వ శాఖల్లో సిబ్బంది కొరత వల్ల ప్రజా సేవల నాణ్యత కూడా దెబ్బతింటుంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఆసుపత్రుల్లో వైద్యులు సిబ్బంది, పోలీస్ శాఖలో సిబ్బంది, రెవెన్యూ శాఖలో ఉద్యోగులు, స్థానిక సంస్థల్లో సిబ్బంది అవసరం. ఒక ప్రభుత్వ ఉద్యోగి ఖాళీగా ఉండటం అంటే కేవలం ఒక కుర్చీ ఖాళీగా ఉండటం కాదు, ఆ కుర్చీ ద్వారా ప్రజలకు అందాల్సిన ఒక సేవ కూడా ఆలస్యం కావడం. ఒక పాఠశాలలోఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంటే విద్యార్థుల విద్యప్రభావితమవుతుంది. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉంటే రోగుల సేవలు ప్రభావితమవుతాయి. రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగులు తక్కువగా ఉంటే ప్రజల పనులు ఆలస్యం అవుతాయి. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని కేవలం నియామక ప్రక్రియగా కాకుండా యువతకు భవిష్యత్తు కల్పించే చర్యగా, ప్రభుత్వ



సేవలను బలోపేతం చేసే చర్యగా చూడాలి. ప్రభుత్వాలు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను పెంచడం గురించి పదేపదే మాట్లాడటం అవసరమే. ప్రైవేట్ రంగం అభివృద్ధి చెందాలి, పరిశ్రమలు రావాలి, పెట్టుబడులు పెరగాలి, కొత్త సంస్థలు స్థాపించాలి, ఉపాధి అవకాశాలు పెరగాలి. ఇవన్నీ దేశ అభివృద్ధికి అవసరమైనవే. కానీ అదే సమయంలో ప్రభుత్వ రంగంలోని ఖాళీలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ప్రైవేట్ రంగం ఉద్యోగాలను సృష్టించాలి. ప్రభుత్వ రంగం ప్రజా సేవలను బలోపేతం చేయాలి. ఈ రెండూ పరస్పర విరుద్ధమైనవి కావు. ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం ఉద్యోగాలు కావు. అవి ప్రజా సేవా వ్యవస్థకు వెన్నెముక. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే ప్రభుత్వం, అదే ప్రజలకు సేవలు అందించడానికి అవసరమైన సిబ్బందిని నియమించాల్సిన బాధ్యత కూడా కలిగి ఉంటుంది. అందుకే ప్రతి ప్రభుత్వ శాఖలో ఖాళీ పోస్టులను క్రమం తప్పకుండా గుర్తించి, అవసరమైన పోస్టులను శాస్త్రీయంగా అంచనా వేసి, నియామక క్యాలెండర్ రూపొందించి, నిర్దిష్ట గడువులో నియామక ప్రక్రియను పూర్తి చేయాలి. యువతకు నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుంది, పరీక్ష ఎప్పుడు జరుగుతుంది, ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారు, నియామకాలు ఎప్పుడు పూర్తవుతాయనే విషయాల్లో స్పష్టత ఉండాలి. అవసరం లేని పోస్టులను సమీక్షించడం పరిపాలనా బాధ్యతే అయినప్పటికీ, ప్రజలకు అవసరమైన సేవలను అందించే పోస్టులను కేవలం ఖర్చు తగ్గింపు పేరుతో రద్దు చేయకుండా జాగ్రత్త వహించాలి. ఒక పోస్టును రద్దు చేసే ముందు ఆ పోస్టు ద్వారా ప్రజలకు అందుతున్న సేవ ఏమిటి, అది లేకపోతే ప్రజలపై ప్రభావం ఏమిటి అనే విషయాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఇది ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకమైన ఆలోచన కాదు. ఏ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఉద్దేశించిన అంశం కూడా కాదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజల అవసరాలు ప్రజా సేవల బాధ్యత కొనసాగుతూనే ఉంటాయి. ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులు ప్రజల యజమానులు కాదు. వారు ప్రజలచే ఎన్నుకోబడిన సేవకులు. అధికారం ప్రజల నుంచి వస్తుంది. అందువల్ల ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని నిర్ణయాలు తీసుకోవడం పాలకుల బాధ్యత. యువతకు ఉద్యోగాలు కల్పించడం కూడా ప్రజా సంక్షేమంలో భాగమే. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడం కూడా ప్రజా సంక్షేమంలో భాగమే. ప్రజా సేవలను వేగవంతం చేయడం కూడా ప్రజా సంక్షేమంలో భాగమే. ఒక యువకుడికి ఉద్యోగం లభిస్తే ఒక కుటుంబంనిలబడుతుంది. ఒక కుటుంబం నిలబడితే ఒక సమాజం బలపడుతుంది. ఒక సమాజం బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందుకే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను ఖర్చుగాకాకుండా దేశ భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాలి. ప్రజలు ఎన్నుకున్న పాలకులు ప్రజల కోసం పనిచేయాలి, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేలా ఉండాలి, యువత భవిష్యత్తుపై నమ్మకం కోల్పోకుండా ఉండేలా ప్రభుత్వాలు స్పష్టమైన నియామక విధానాన్ని అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను గుర్తించి, అవసరమైన పోస్టులను నిర్ధారించి, పారదర్శకమైన నియామక క్యాలెండర్ ప్రకటించి, నిర్దిష్ట గడువులో నియామకాలు పూర్తి చేసి, ప్రజా సేవలను బలోపేతం చేయడం కాలానుగుణ అవసరం. ఇది ఎవరికీ వ్యతిరేకమైన డిమాండ్ కాదు. యువత భవిష్యత్తు కోసం, ప్రజా సేవల నాణ్యత కోసం, సుపరిపాలన కోసం సమాజం ముందుకు తీసుకురావాల్సిన న్యాయమైన విజ్ఞప్తి. ప్రజల కోసం పాలకులు ఉండాలి. ప్రజలకు సేవ చేయడానికి ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ బలంగా ఉండాలి. యువతకు భవిష్యత్తు ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేసే హక్కుగా కాకుండా ప్రజల జీవితాలను మార్చే వ్యవస్థగా నిలుస్తుంది. ●

# పెరుగుతున్న పేదరికానికి కారణమెవరు?

డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ

నూటనలభై కోట్ల బిడ్డలకు జన్మనిచ్చిన భారతమాత నేడు అనేక రకాల మాఫియాల చేతిలో బంధీగా ఉంది. ఈదేశంలో వెయ్యి మంది కుటుంబాలు సగటున 50వేయిల కోట్ల ఆదాయంతో అత్యంత ధనవంతులు అని. ఇదెట్ల సాధ్యం అంటే చంద్రమండలం సహా ఈదేశంలోని నీటిని, నీటిలోని పెట్రోల్, డీజిల్, గ్యాస్,పంటలు, మనిషి తినే ఆహారాన్ని కల్తీ చేసి, భూమిని కల్తీ చేసి అడవులు లేకుండా చేసి అక్కడ జీవించే ఈ దేశవాసులను ఏమాత్రం కనికరం లేకుండా చంపేసి రాజకీయ పార్టీలకు వేలకోట్లు డబ్బులు ఇచ్చి భారతమాత బిడ్డలను చంపేస్తున్నారు. మెడికల్మాఫియా, ఎడ్యుకేషన్మాఫియా, పొలిటికల్మాఫియా, మైనింగ్మాఫియా ఇట్లా చెబుతా ఉంటే భారతమాత తనను తాను కోల్పోయి జీవచ్ఛావంగా మారింది. ఇదేంటి అని అడిగిన వాళ్లను దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే ఈ దేశం మరో సుడాన్ కాబోతుంది. ఎందుకంటే ఏ ప్రాంత ప్రజలు అక్కడ బతికే అవకాశం లేకుండా ఈ మాఫియాలు మనుషుల మెదళ్ళలో సామ్రాజ్య విషాన్ని నింపి ఒకన్ని ఒకడు, వాళ్లకు వాళ్ల నరుక్కునేలా తయారు చేశారు. దేశంలో నీళ్ల లేని గ్రామాలు ఉన్నాయి కానీ మద్యం, మతం, కులంలేని గ్రామం లేదు. మొన్న ఒక్క గ్రామం మహారాష్ట్రలో మాకు కులం, మతం, ఒద్దు అని ఆ గ్రామసర్పంచ్తో తీర్మానం చేసుకోవడం. ఓ మంచి పరిణామం. కానీ అది ఎంతకాలం ఉంటుందో చూడాలి. ప్రపంచంలోఒకప్పుడు సుఖసంతోషాలతో ఇతర దేశాలకు కూడా అన్నంపెట్టిన దేశం నేడు ఆకలిసూచికలో పాకిస్థాన్ ఆఫ్ఘనిస్థాన్, శ్రీలంకల కన్నా దిగజారిపోయింది. దీనికి కారణం మాఫియా అదే కార్పొరేట్ దోపిడీలు. ఈ కార్పొరేట్ దోపిడీదారులకు, పాలకులు, ప్రభుత్వ బ్యాంకుల్లో లక్షలకోట్ల ప్రజలు దాచుకున్న సొమ్మును ఇచ్చి ఆయా దోపిడీ కంపెనీలకు ఋణం మాఫీ చెస్తున్నాయి. ఇందులో



కేవలం రాజకీయ పార్టీ నేతలు మాత్రమే కాదు, వైట్కాలర్ అధికారులు కూడా నిజమైన దేశద్రోహులు. వీళ్ల చేస్తున్న తప్పుల వల్ల ఉత్తరభారతం నుండి దక్షిణ భారతంలోని మారుమూల పల్లెల్లో కూడా అతితక్కువ కూలి తీసుకొని బతుకుతున్నారు. ఇక్కడ బతికేవాళ్లు మరింత పేదరికంలోకి బలవంతంగా నెట్టివేయబడుతున్నారు. అందుకే త్వరలో ఈ దేశం మరో సుడాన్‌గా మారే ప్రమాదంఉంది. ఈదేశ ప్రజలు ఏప్రాంతంవాళ్లు అక్కడే బతుకే అవకాశాలు కావాలి. పరిశ్రమలు కంపెనీలు తెస్తాం అంటున్నారు. అందులో ఒక్కశాతం కూడా ఆ పరిశ్రమలు పెట్టె స్థానికులకు ఉద్యోగం ఇవ్వడం లేదు. ఈ దోపిడీ రాజకీయ పార్టీలు మాఫియాతో కలిసి ప్రజలను వారి పేదరికాన్ని ఆధారం చేసుకొని ఓట్లు యంత్రాల రూపంలో మార్చుకుని, బహిరంగసభల్లో కత్తులు తిప్పుకుంటూ సవాల్ చేస్తున్నారు. ప్రజలను భయపెడుతున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, మద్రాస్, కోల్‌కత్తా లాంటి నగరాల్లో డబ్బులు ఉన్న ప్రజలు ఓట్లవైపు ఆసక్తి చూపడం లేదు కారణం. డబ్బులు ఇచ్చి వారిపనులు చేయించుకోవచ్చు అనే ధైర్యం. కానీ ఓటు వేయకపోతే మీకు రేషన్ బియ్యం రావు, పెన్షన్ రాదు, ఇలా పేదప్రజలను భయానికి గురిచేసి దేశ సంపద దోచుకొని దాచుకుంటున్న రాజకీయ పార్టీల నేతలు పెరుగుతున్నారు. పేదరికంలోఉన్న ప్రజలు ఇంకా పేదరికంలోనే ఉన్నారు. అందరూ పేదప్రజల నాయకులు కానీ మరెందుకు ఇంకా ఈ దేశం వంద ఏండ్లు గడిచినా పేదరికం తగ్గడంలేదు. అంటే ఈదేశ ప్రజలు ఆర్థికంగా సామాజికంగా విద్య, వైద్యపరంగా ఎదగడం దోపిడీ రాజకీయ పార్టీలకు అసలు ఇష్టంలేదు. ఎందులో ఈ దేశం వెలిగిపోతుందో చెప్పండి అంటే దేవుని పేరుచూపిస్తారు. మానబంగాలు చేసినవారు, మనుషులను చంపినవారు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినవారు మాత్రం పార్లమెంట్, అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. పాలకపార్టీని ప్రశ్నించేవారు దేశద్రోహులు అవుతున్నారు. జైల్లో ఉంటున్నారు. కాబట్టి బుద్ధిజీవులు ప్రజలను చైతన్యపరచి అన్యాయంపైన పోరాటం చేయాలి అని చెప్పాలి. లేకపోతే కచ్చితంగా ఈ దేశం మరో సుడాన్‌గా మారడం ఖాయం. ●

# ఆర్థిక వ్యవస్థ కొలమానాలను మార్చాలి


డి జయరాం

కేంద్ర ప్రభుత్వం తాజాగా 2026 జూలై 20న ఇండెక్స్ ఆఫ్ కోర్ ఇండస్ట్రీస్ (ఐసిఐ)లో కీలక మార్పులుచేసింది. ప్రాతిపదిక సంవత్సరాన్ని 2011-12 నుంచి 2022-23కు మార్చడంతో పాటు, ఇనుప ఖనిజాన్ని తొమ్మిదో కోర్ పరి శ్రమగా చేర్చింది. ఉక్కు ఉత్పత్తి లెక్కింపు విధానాన్ని సవ రించింది. ద్వంద్వ గణనకు అవకాశం ఉన్న కొన్ని బొగ్గు ఉత్పత్తులను తొలగించింది. తాజా పారిశ్రామిక నిర్మాణానికి అనుగుణంగా రంగాల వెయిటేజీలను కూడా పునర్నిర్ణయిం చింది. ఇదే కొత్త శ్రేణి ఆధారంగా విడుదలైన 2026 జూన్ కోర్ ఇండస్ట్రీస్ సూచీ 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. పైకి చూస్తే ఇవన్నీ గణాంక మార్పులుగానే కనిపించవచ్చు. కానీ వాస్తవానికి ఇది భారత పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను కొలిచే విధానంలో వచ్చిన కీలక సంస్కరణ. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్నప్పుడు దానిని కొలిచే ప్రమాణా లు కూడా మారాలి. లేకపోతే విధాన నిర్ణయాలు, పెట్టుబడి అంచనాలు, ఆర్థిక విశ్లేషణలు అన్నీ పాత వాస్తవాల ఆధా రంగానే సాగుతాయి. అందుకే కోర్ ఇండస్ట్రీస్ సూచీలో చేసిన ఈ మార్పు కేవలం గణాంక సవరణ కాదు. మారిన భారత పారిశ్రామిక వాస్తవాన్ని గుర్తించిన చర్య. గత పదేళ్లలో భారత పారిశ్రామిక రంగం గణనీయంగా రూపాంతరం చెందింది. జాతీయ రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, రక్షణ తయారీ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయి. ఉత్పత్తి నిర్మాణం, పరిశ్రమల వాటా, వినియోగ విధానాలు కూడా మారాయి. అలాంటి పరిస్థితిలో 2011-12 నాటి పారిశ్రామిక నిర్మాణాన్ని ప్రాతిపదికగా తీసుకుని నేటి ఆర్థిక వ్యవస్థను కొలవడం వాస్తవ చిత్రాన్ని ప్రతిబింబించదు. అందుకే 2022-23ను కొత్త బేస్ ఇయర్‌గా ఎంచుకుని, వార్షిక పారిశ్రామిక సర్వే (ఎఎస్ఐ) 2022-23 సహా తాజా అధికారిక గణాంకాల ఆధారంగా కొత్త శ్రేణిని రూపొందించారు. ఈ సంస్కరణలో ఇనుప ఖనిజాన్ని కోర్ పరిశ్రమగా చేర్చడం మరో కీలక నిర్ణయం. ఉక్కు తయారీకి ఇనుప ఖనిజమే తొలి ముడి సరుకు. ఉక్కు మౌలిక సదుపాయాల నిర్మాణానికి వెన్నెముక. కాబట్టి ఇనుప ఖనిజ ఉత్పత్తిలో మార్పులు కనిపిస్తే, భవిష్యత్తులో నిర్మాణ రంగం, పారిశ్రామిక పెట్టుబడుల దిశ ఎలా ఉండబోతుందో ముందుగానే అంచనా వేసే అవకాశం లభిస్తుంది. అంటే సూచీఇప్పుడు ఉత్పత్తిని మాత్రమే కాకుండా పెట్టుబడి చక్రంలోని ప్రారంభ సంకేతాలను కూడాపట్టుకోగలుగుతోంది. ప్రభుత్వం బేస్ ఇయర్‌ను మాత్రమే మార్చలేదు. ఉక్కు ఉత్పత్తిని స్థూల ఉత్పత్తి ఆధారంగా లెక్కించే



విధానాన్ని అమలు చేసింది. ద్వంద్వ గణనకు అవకాశం ఉన్న వాష్డ్‌కోల్, కోల్ మిడ్లింగ్స్ వంటి ఉత్పత్తులను తొలగించింది. అలాగే రంగాల వెయిటేజీలను ప్రస్తుత పారిశ్రామిక నిర్మాణానికి అనుగుణంగా సవరించింది. ఈ మార్పులన్నీ సూచీ విశ్వసనీయతను పెంచడంతో పాటు ఇతర అధికారిక గణాంకాలతో సమన్వయాన్ని మెరుగుపరుస్తాయి. కోర్ ఇండస్ట్రీస్ సూచీ పరిధిలోని తొమ్మిది రంగాలకే పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో దాదాపు 40శాతం బరువు ఉంది. అందువల్ల ఈ సూచీలో కనిపించే మార్పులు మొత్తం పారిశ్రామిక రంగానికి ముందస్తు సంకేతాలుగా పరిగణిస్తారు. తాజా గణాంకాలు కూడా అదే సూచిస్తున్నాయి. 2026 జూన్‌లో కోర్ ఇండస్ట్రీస్ వృద్ధి 5 శాతానికి చేరుకుంది, ఇది గత ఐదు నెలల్లో అత్యధికం. అయితే అసలు కథ ఈ ఒక్క సంఖ్యలో లేదు. ఇనుప ఖనిజ ఉత్పత్తి 43.9శాతం, సిమెంట్, విద్యుత్ రంగాలు చెరో 9.8 శాతం, ఉక్కు 4.6 శాతం వృద్ధి నమోదు చేశాయి. మరోవైపు ముడి చమురు, సహజ వాయువు, చమురు శుద్ధి ఉత్పత్తులు, ఎరువుల రంగాలు క్షీణించాయి. అంటే మౌలిక సదుపాయాల నిర్మాణం ఊపం దుకుంటుండగా, ఇంధన రంగంలో బలహీనతలు కొనసాగు తున్నాయి. ఈ గణాంకాలను కేవలం నెలవారీ ఉత్పత్తి వివరాలుగా చూడడం సరిపోదు. ఇవి భారత పెట్టుబడి చక్రం ఏ దిశగా కదులుతోందో చెప్పే సూచనలు. ఇనుప ఖనిజం, సిమెంట్, ఉక్కు, విద్యుత్ రంగాల్లో ఒకేసారి వృద్ధి కనిపించడం సాధారణంగా నిర్మాణ కార్యకలాపాలు, ప్రజా మూలధన వ్యయం కొనసాగుతున్నాయనే సంకేతం. అందుకే కోర్ ఇండస్ట్రీస్ సూచీ ఇప్పుడు కేవలం ఉత్పత్తి సూచిక మాత్రమే కాదు, ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి వేగాన్నిఅంచనా వేసే ముందస్తు సూచికగా కూడా మారుతోంది. సామాన్య డికి కోర్ ఇండస్ట్రీస్ సూచీ నేరుగా కనిపించే గణాంకం కాకపోయినా, దాని ప్రభావం అతని జీవితంపై ఉంటుంది. ఈ సూచీలో వృద్ధినమోదైతే నిర్మాణ రంగం, పరిశ్రమలు చురు కుగా ఉన్నాయని, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నా యని అర్థం. అదే వరుసగా మందగమనం నమోదైతే ప్రభు త్వం, భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ)ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని విధానాల్లో మార్పులు తీసుకురావచ్చు. కాబట్టి ఇది ఉద్యోగాలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి, చివరికి ప్రజల ఆదాయంపై కూడా పరోక్ష ప్రభావం చూపే సూచిక. అయితే ఈ సంస్కరణతో పని పూర్తయిందని చెప్పలేం. నేడు భారత ఆర్థిక వ్యవస్థను ఎలక్ట్రానిక్స్ తయారీ, సెమీకండక్టర్లు, బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి కొత్త రంగాలు వేగంగా ప్రభావితం చేస్తున్నాయి. సేవల రంగం జీడీపీలో సగానికి పైగావాటా కలిగిఉంది. కాబట్టి భవిష్యత్తులోభారత గణాంక వ్యవస్థ కూడా ఈ కొత్త వాస్తవాలకు అనుగుణంగా మరింత అభి వృద్ధి చెందాల్సి ఉంటుంది. కోర్ ఇండస్ట్రీస్ సూచీలో జరిగిన తాజామార్పు ఒకస్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ఆర్థిక వ్యవస్థను మార్చడం ఎంత ముఖ్యమో, దానిని సరైనప్రమాణాలతో కొలవడం కూడా అంతేముఖ్యం. ఎందుకంటే మెరుగైన విధానాలకు, ఖచ్చితమైన నిర్ణయాలకు, స్థిరమైన అభివృద్ధికి పునాది మంచి గణాంకాలే. ●

# ప్రజావాక్కు



## అవినీతి రహిత దేశం అవసరం

**అవినీతి** సమాజానికి కలిగించే అతిపెద్ద నష్టం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడం. ప్రభుత్వవ్యవస్థల్లో అన్యాయాలు జరుగుతున్నా, బాధ్యులపై సరైనచర్యలు తీసుకోకపోతేప్రజల్లో నిరాశపెరుగుతుంది. న్యాయవ్యవస్థ, పాలనా వ్యవస్థలపై నమ్మకం తగ్గిపోతుంది. ఇదిప్రజల, ప్రభుత్వ సంస్థల మధ్య ఉన్న సంబంధాలను బలహీనపరుస్తుంది. పారదర్శకత, జవాబుదారీతనం లేకపోవడంవల్ల వ్యవస్థపై అనుమానాలు పెరిగి, ప్రజాస్వామ్యవిలువలు దెబ్బతింటాయి. అవినీతి దేశఅభివృద్ధికి కూడా పెద్ద అడ్డంకిగా మారుతుంది. ప్రజలసంక్షేమం కోసంకేటాయించిన నిధులు అవినీతికారణంగా దుర్వినియోగంఅవుతాయి. ఫలితంగావిద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు వంటి ముఖ్యమైన రంగాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందవు. అవినీతి ఆర్థిక వృద్ధిని మందగింపజేసి, సామాజిక అసమానతలను పెంచుతుంది. సాధారణ ప్రజల జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## విదేశీ టూర్లతో బిజీబిజీ

ఒక పెద్దాయన సమాజంలో అత్యంత ఉన్నత పదవిలో ఉండి విధులు నిర్వర్తిస్తూ ఉంటాడు. అతడి కింద నోరెత్తకుండా గులాముల్లాగ పడిఉండే నౌకర్లు చాలా మంది పని చేస్తుంటారు. తనలానే మంచి పొజిషన్‌లో ఉన్నవారెందరితోనో ఆయనకిపరిచయాలు స్నేహాలు ఉంటాయి. వారిని కలవటానికి ఆయన తరచు విమానాలెక్కి ప్రయాణాలు చేస్తుంటారు. వారితో ఏవో సంగతులు, ముచ్చట్లు జరిపి తిరిగొస్తుంటారు. ఈ పర్యటనలు ఎవరి కోసమో, ఎందుకోసమో అలా డబ్బులు ఖర్చు చేసి తిరగడం వల్ల ఆ కుటుంబ సభ్యులకు ఒకగూరే ప్రయోజనం ఏంటో అర్థంకావటం లేదు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాలి

**తెలంగాణా** రాష్ట్రంలోఎంపిటిసి, ఎంపిపి, జెడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించడం అవసరం. ఈఎన్నికలు నిర్వహించడంలో చాలా జాప్యం జరుగుతుంది. పదవీ కాలం పూర్తి అయి చాలాసమయంఅవుతుంది. పరిపాలన కుంటుపడుతుంది. ప్రభుత్వానికి, ప్రజలకు సమస్యల పరంగా సమన్వయం లోపిస్తుంది. ప్రజల సమస్యలుపరిష్కారం కోసం ప్రదేశిక ఎన్నికలు నిర్వహించడం అవసరం. ఈ ఎన్నికల కోసం ఇంటర్మీడియట్ విద్యార్హత ఉండడం అవసరం.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## మసకబారిన అయోధ్య ప్రతిష్ట

**అప్పుడెప్పుడో** యుపిఎ హయాంలో 2జి స్పెక్ట్రమ్, 3జి స్పెక్రటమ్, బొగ్గు కుంభకోణం ఇలా ఎన్నో కుంభకోణాలు చేసి అప్పటిమంత్రులు, ఎమ్.పిలుగా పనిచేసిన వారు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి కోట్లరూపాయలు కాజేసారని చాలా హడావిడిచేశారు. బిజెపివాళ్లు వాటి గురించి దేశ మంతా చెప్పుకునేలా అరెస్టులు విచారణలతో హోరెత్తించారు. ఈ కారణంతోనే యుపిఎ ప్రభుత్వం ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. ఎపిమాజీ ముఖ్యమంత్రి జగన్ విషయంలోనూ ఇలానే జరిగింది. ఆయనని కొంతకాలం జైల్లో ఉంచి వదిలే శారు. తరువాత ఆయనపై ఎటువంటి చర్యలు లేవు. దశాబ్దకా లం దాటిపోయినా జగన్‌పై మోపబడ్డ కేసు ఇప్పటికీ కొన సాగుతూనే ఉంది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా ఎన్నో స్కామ్‌లు జరుగుతున్నాయి. కానీ కొన్ని మాత్రమే బహిర్గతమవుతున్నాయి.

- రాశి, హైదరాబాద్

## ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రం విడిపోయినప్పుడు నవ్యాంధ్ర రాజధాని అమరావతి శంకుస్థాపన కోసం ప్రధానమంత్రి మోడీజీని ఆహ్వానిస్తే మట్టి నీళ్ల తెచ్చారు. అమరావతి నిర్మాణం నత్త నడక నడుస్తూఉన్నది. ఇప్పుడు కూడా అంతర్జాతీయ విమానా శ్రయం భోగాపురంలో శంకుస్థాపన కోసం మోడీజీ గారిని ఆహ్వానించి అమాయకులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులతో పాటు గిరిజన స్త్రీలను కూడా ఆహ్వా నించి వారిచే దింసా నృత్యం చేయించారు. ఇలాంటి వాటి వల్ల దేశానికి కలిగే ప్రయోజనం ఏమిటో అర్థం కాలేదు. భోగాపురం విమానాశ్రయంకూడా మూడు జిల్లాల్లో ఎక్కడ అందుబాటులోకి రాదు. విశాఖపట్నం వెళ్లడం సులువు కానీ భోగాపురం చేరుకోవడం మూడు జిల్లాల ప్రజలకు కష్టం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## చడీ చప్పుడు లేకుండా హాజరు కావాలి

**అవినీతి**, నేరారోపణలు ఎదుర్కొంటున్న కొందరు రాజకీయ నాయకులు ఇటీవల కాలంలో కోర్టుకు హాజరు అయ్యే రోజున చేస్తున్న హంగామా ఇంతా అంతా కాదు. వారి పార్టీ నాయకులు, అభిమానులు వందల సంఖ్యలో కోర్టు ప్రాంగణంలో గుంపులు గుంపులుగా చేరటం ఇంకా భారీ కాన్వాయ్‌తో రచ్చ రచ్చ చేస్తున్నారు. వీరి వ్యవహారం చూస్తుంటే కోర్టుకు హాజరవుతున్నారా లేక రాజకీయ సభ నిర్వహిస్తున్నారా అన్నట్లు ఉంటోంది. నిరాడంబరంగా, చడీ చప్పుడు లేకుండా కోర్టుకు వచ్చి హాజరు ముగించుకోవాలి.

-కప్పగంతు వెంకట రమణమూర్తి,, సికింద్రాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# డ్రగ్స్‌రహిత భారత్ యువత లక్ష్యం

## నశాముక్త్, వికసిత్ భారత్ సంకల్పం నెరవేరుతోంది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే వికసిత భారత్ సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. మై భారత్ వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం




కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో కాశీ డిక్లరేషన్‌ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోడీ వివరించారు. యువతను దేశానికి అమృత తరంగా అభివర్ణించిన ప్రధాని రాబోయే 2025 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## నా కుమార్తెను క్షమించి మోడీ జీవన్‌దాన్ చేశారు

### కృతజ్ఞతలు చెప్పిన తల్లి

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** జంతర్‌మంతర్ నిరసనల్లో తనపై అనుచిత వ్యాఖ్యలు చేసి వైరల్ అయిన బాలికను మోడీ క్షమించడంపై ఆమె తల్లి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోడీతన కుమార్తెకు ఒక కొత్త జీవితాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. ప్రతీకార చర్యకు బదులుగా క్షమాగుణాన్ని ప్రదర్శించినందుకు చేతులు జోడించి ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆమె పేర్కొన్నారు. తీవ్ర అస భ్యకరమైన పదాలు వాడిన నా బిడ్డను క్షమించి మోడీ తన గొప్ప మనసును చాటుకున్నారు. ఈ రోజు తన పుట్టినరోజు. ఈ సందర్భంగా నా బిడ్డకు మోడీ జీవనదానం అనే గొప్ప బహుమతి ఇచ్చారు. ఈ రోజు నుంచి ఈ అమ్మాయికి ఇది పునర్జన్మని ఆమె తెలిపారు. నీట్ యూజీ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో ఓ బాలిక ప్రధానిపై తీవ్రమైన వ్యాఖ్య లు చేస్తున్న వీడియో వైరల్ అయింది. దీనిపై ప్రధాని మోడీ శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు. తనపై దూషణలకు పాల్పడిన వారిని మార్గం తప్పిన వారుగా అభివర్ణించారు. ఆగ్రహం లేదా ప్రతీకారంతో దీనికి సమాధానం ఇవ్వలేమని స్పష్టం చేశారు. ప్రధాని స్పందన తర్వాత, ఆ బాలిక క్షమాపణ చెబుతున్న వీడియో కూడా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది.

తన వయసు 15 ఏళ్లని, తాను చేసిన తప్పు తీవ్రతను గ్రహించ చానని అందులో పేర్కొంది. 'నేను చేసిన పని క్షమించరానిది. చాలా తప్పుడు మాటలు మాట్లా డాను. నన్ను నేను చూసుకోవడానికే సిగ్గుగా ఉంది' అని పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. స్నేహితులతో కలిసి నిరసన వద్దకు వెళ్లినప్పుడు, అక్కడి వారిని చూసి ప్రభావితమై అలా మాట్లా డానని, ఇదే తన మొదటి, చివరి తప్పిదమని, దేశం మొత్తం నన్ను క్షమించాలని వేడుకుంది. ఈ ఘటనపై ఫిర్యాదు ఆధారంగా నోయిడా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దానిని న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బాలిక వ్యాఖ్యలు ప్రధాని పదవి గౌరవానికి భంగం కలిగించాయని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించవచ్చని ఫిర్యా దులో పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో తన కుమార్తె వయసును 15 ఏళ్లకు బదులుగా 25 ఏళ్లుగా తప్పుగా నమోదు చేశారని ఆమె తల్లి ఆరో పించారు. ఈ సంద ర్భంగా, 20 ఏళ్ల లోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లను నిషేధించాలని, మైనర్లను నిరసనలకు దూరంగా ఉంచాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.



### భారత్ సైనిక అధికారులకు పాక్ రేంజర్ సెల్యూట్

**జలంధర్,ఆగస్టు 2:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రతరం అయ్యాయి. ఈ నేపథ్యంలో అట్టారీ వాఘా సరిహద్దు వద్ద ఇండియన్ ఆర్మీ అధికారికి పాకిస్థాన్ జవాన్ సెల్యూట్ కొట్టిన దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. పరేడ్ కార్యక్రమాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో మాత్రం తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఓ వైపు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు, జవాన్లు ఉన్నారు. మరోవైపు భారత ఆర్మీ అధికారులు, జవాన్లు ఉన్నారు. అయితే ఇదే సమయంలో పాకిస్థానీ రేంజర్స్ భారత ఆర్మీ అధికారులకు సెల్యూట్ చేస్తూ కనిపించారు. ఇరు దేశాల ఆర్మీ అధికారుల మధ్య ఉన్న గౌరవం, మర్యాద, ప్రొఫెషనలిజం తదితర అంశాల ఆధారంగా ఇలా ఇరు దేశాల సైన్యం గౌరవించుకుందని నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయ పడుతున్నారు. లైన్ ఆఫ్ కంట్రోల్ లోని అట్టారీ వాఘా సరిహద్దు వద్ద భారత్ పాకిస్థానీ అధికారులు ఒకర్నొకరు చేతులను కలుపుతూ అఫీషియల్ ఫ్లాగ్ హోస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే మిలిటరీ ప్రోటోకాల్ లో హై ర్యాంకింగ్ అధికారులకు దేశాలతో సంబంధం లేకుండా సెల్యూట్ చేయాలని ఉంటుంది. ఈ క్రమంలోనే తాజాగా వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. చాలామంది పాకిస్థాన్ జవాన్ సెల్యూట్‌ను ప్రశంసిస్తున్నారు. మిలిటరీ ప్రొటోకాల్‌లో భాగం అని మాట్లాడుకుంటున్నారు. ఇది క్రమశిక్షణ యూనిఫామ్ అండ్ ర్యాంక్ ఉన్న అధికారులకు సెల్యూట్ ఉంటుందనినెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## కర్ణాటకకు ఇప్పుడే రాకండి

### తమిళ సిఎం విజయ్‌ని కోరిన కన్నడ సిఎం శివకుమార్

### ముదిరిన కావేరీ జలాల వివాదం

**బెంగళూరు,ఆగస్టు 2:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ త్వరలో చేపట్టబోయే బెంగళూరు పర్యటన నేపథ్యంలో కర్ణాటక రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కావేరి నదీ జలాల పంపకాల వివాదంపై చర్చించేందుకు ఆయన బెంగళూరు రానున్నారు. దీన్ని వాయిదా వేసుకోవాలంటూ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బహిరంగంగానే విజ్ఞప్తి ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇక్కడికి రావడం వల్ల చిక్కుముళ్లు మరింత బిగుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాల మధ్య బీజేపీ కర్ణాటక రాష్ట్రశాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెరమీదికి వచ్చారు. విజయ్‌కు ఓ లేఖ రాశారు. కావేరీ వివాదంపై ప్రతిపాదించిన చర్చల్లో తమ రాష్ట్ర రైతులు, ప్రజల ఇబ్బందుల పట్ల సానుభూతితో,



స్నేహపూర్వక వైఖరితో వ్యవహరించాలని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య చారిత్రక, సాంస్కృతిక బంధాలను గౌరవిస్తూ, సుహృద్భావ వాతావరణంలో ఈ చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు. కావేరి బేసిన్ పరిధిలోని కోట్లాది మంది ప్రజలు, ముఖ్యంగా బెంగళూరు నగర తాగునీటి అవసరాలకు ఈ నది ఎంత కీలకమో విజయేంద్ర తన లేఖలో ప్రస్తావించారు. రుతుపవనాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల ఇప్పటికే రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ తాజా పరిస్థితులను తమిళనాడు ప్రభుత్వం సానుకూల దృక్పథంతో, మానవీయ కోణంలో అర్థం చేసుకోవాలని విజయేంద్ర కోరారు. రెండు రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మేకేదాటు ప్రాజెక్టు అంశాన్ని విజయేంద్ర తన లేఖలో ప్రధానంగా లేవనెత్తారు.

బెంగళూరు తాగునీటి అవసరాలను శాశ్వతంగా తీర్చడం కోసం ఉద్దేశించిన మేకేదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించాలని అభ్యర్థించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమిళనాడుకు దక్కాల్సిన న్యాయబద్ధమైన నీటి వాటాకు ఎలాంటి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య తలెత్తిన సంక్లిష్ట సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకున్న తీరును విజయేంద్ర గుర్తు చేశారు. బెంగళూరులో తిరువళ్లువర్ విగ్రహ ప్రతిష్టాపనకు సంబంధించిన సమస్యను అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం కరుణానిధి ఎంతో పరిణతితో, పరస్పర గౌరవంతో పరిష్కరించారని గుర్తుచేశారు.



### ఇరాన్‌పై భారీ పేలుళ్లకు బ్రేక్

### ట్రూత్ సోషల్‌లో ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,ఆగస్టు 2:** ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య ప్రకటన చేశారు. ఇరాన్‌పై వారాంతంలో జరపాల్సిన దాడులను రద్దు చేసుకున్నట్టు ఆదివారం వెల్లడించారు. ఇరాన్‌తో పాటు ఇతర పశ్చిమాసియా దేశాలు చేసిన విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఓ ఒప్పందానికి సం బంధించిన పరిమితులపై అంగీకారం కుదిరిందని ఆయన తెలిపారు. అయితే, ఈ ఒప్పందం వేగంగా ఖరారైతేనే దాడుల విరమణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఈ వివరాలు పంచు కున్నారు. త్వరలో కుదరబోయే ఒప్పందం ప్రకారం హార్మూజ్ జలసంధిని తక్షణమే, సంపూర్ణంగా తెరవడంతో పాటు, ఇరాన్ అణు ముప్పునకు ముగింపు పలకాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఒప్పందం పరిమితులపై అంగీకారం కుదిరినందున, ఎటువంటి దాడికి పాల్పడవద్దని ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాలు మమ్మల్ని కోరాయి. ఈ విజ్ఞప్తి ఆధారంగా, ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా దాడిని రద్దు చేసేందుకు అంగీకరించానని ట్రంప్ తన పోస్టులో రాశారు.

## భూమిపై పడుతున్న అంతరిక్ష ప్రయోగాల చెత్త



**న్యూయార్కు,ఆగస్టు 2:** అంతరిక్ష రంగంలో ప్రయోగాలు వేగవంతం అవుతున్న కొద్దీ, భూమికి కొత్త ముప్పు పొంచి ఉంది. ప్రతి వారం సుమారు ఒక మెట్రిక్ టన్ను బరువున్న అంతరిక్ష శకలాల వర్షం భూమిపై కురుస్తోందని తాజా నివేదికల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. పెరిగిపోతున్న రాకెట్ ప్రయోగాలు, వేల సంఖ్యలో కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఉపగ్రహాల కారణంగా ఈ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పోలెండ్ అంతరిక్ష సంస్థకు చెందిన నిపుణుడు మారియస్ స్లోనినా వెల్లడించిన వివరాల ప్రకారం, దాదాపు ప్రతిరోజూ అంతరిక్షం నుంచి ఏదో ఒక వస్తువు భూ వాతావరణంలోకి ప్రవేశిస్తోంది. ఇలా వారానికి సగటున ఒక టన్ను శకలాల చొప్పున భూమిని చేరుతున్నాయి. అమెరికా స్పేస్ ఫోర్స్ గణాంకాలు ఈ పెరుగుదలను స్పష్టంగా చూపుతున్నాయి. దశాబ్దం క్రితం ఏడాదికి సుమారు 110 వస్తువుల పునఃప్రవేశంపై హెచ్చరికలు జారీ చేస్తే, 2025 నాటికి ఆ సంఖ్య 820కి పెరిగింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 300కి పైగా రాకెట్ ప్రయోగాలు జరగడమే ఇందుకు నిదర్శనం. సాధారణంగా అంతరిక్ష శిథిలాల్లో అధిక భాగం భూ వాతావరణంలోకి ప్రవేశించగానే ఘర్షణకు గురై మండిపోతాయి. మిగిలినవి సముద్రాల్లో పడిపోతాయి. కొన్నిసార్లు పెద్ద పరిమాణంలో ఉండే భాగాలు పూర్తిగా కాలిపోకుండా భూమిపై పడుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కెన్యాలోని ముకుకు గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్రంలో 16 ఏళ్ల క్రితం ప్రయోగించిన రాకెట్‌కు చెందిన భారీ లోహపు రింగ్ ఒకటి కూలిపోయింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి విడివడిన ఒక శిథిలం అమెరికాలోని ఫ్లోరిడాలో ఒక ఇంటిపై పడింది. పోలెండ్‌లో స్పేస్ఎక్స్ రాకెట్‌కు చెందిన భాగాలు, స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో చైనాకు చెందిన పాత ఉపగ్రహ శకలాలు, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్‌లోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. అంతరిక్ష శిథిలాల వల్ల ఒక వ్యక్తి గాయపడే అవకాశం, పిడుగు పడే సంభావ్యత కంటే చాలా తక్కువ అని నిపుణులు చెబుతున్నప్పటికీ, ఈ ప్రమాదం క్రమంగా పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు. 2035 నాటికి కేవలం స్పేస్ఎక్స్ ఉపగ్రహాల శిథిలాల వల్ల ప్రతి రెండేళ్లకు ఒకరు గాయపడటం లేదా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధ్యయనం అంచనా వేసింది. ఈ ముప్పును నియంత్రించడానికి స్పష్టమైన అంతర్జాతీయ నిబంధనలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో రూపొందించిన ఐక్యరాజ్యసమితి ఒప్పందాలు నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. 2007లో జారీ చేసిన మార్గదర్శకాలకు చట్టబద్ధత లేదు. అనియంత్రిత శిథిలాలు ఎక్కడ పడతాయో కచ్చితంగా అంచనా వేయడం కూడా చాలా కష్టం. కేవలం ఒక్క నిమిషం అంచనా తప్పినా, శిథిలాలు పడే ప్రదేశం దాదాపు 300 మైళ్ల వరకు మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో, శిథిలాలు పూర్తిగా కాలిపోయేలా వస్తువులను రూపొందించాలని నిపుణులు సూచిస్తున్నా, దానిని తప్పనిసరి చేసే చట్టాలు లేవు. సాంకేతికత వేగంగా ముందుకు వెళ్తున్నా, దానివల్ల తలెత్తే పర్యవసానాలను ఎదుర్కోవడానికి అవసరమైన నియంత్రణ వ్యవస్థలు వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

## రాష్ట్రాలకు రూ.1.09 లక్షలకోట్లు విడుదల చేసిన కేంద్రం

### 10న మళ్లీ యథావిధిగా పన్నుల్లో వాటా కేటాయింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ఊహించని గిఫ్ట్ ఇచ్చింది. అభివృద్ధి పనుల వేగాన్ని పెంచడమే లక్ష్యంగా భారీ ఆర్థిక సాయన్ని అందించింది. మామూలుగా ప్రతినెల ఇచ్చే పన్నుల వాటాతో సంబంధం లేకుండా, ఈనెల 1వ తేదీనే ఒకేసారి ఏకంగా రూ. 1,09,019కోట్లను అడ్వాన్స్ వాయిదా రూపంలో రాష్ట్రాల ఖజానాలోకి జమ చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. సాధారణంగా ప్రతినెలా 10వ తేదీన కేంద్ర పన్నుల వాటా నిధులు రాష్ట్రాలకు అందుతాయి. ఈసారి ఆగస్టు 10న ఇచ్చే రెగ్యులర్ నిధులకు అదనంగా, పది రోజుల ముందే ఈ భారీ అడ్వాన్స్‌ను కేంద్రం రిలీజ్ చేసింది. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ప్రాజెక్టులు వంటి మూలధన వ్యయం పనులను వేగవంతం చేయడానికే ఈ ముందస్తు పంపిణీ చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం అత్యధిక లబ్ధి పొందిన రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ నిలిచింది. యూపీకి అత్యధికంగా రూ.19,208 కోట్లు దక్కాయి. ఆ తర్వాత స్థానాల్లో బీహార్‌కు రూ.10,845 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.8,010 కోట్లు కేటాయించారు. పశ్చిమబెంగాల్‌కు రూ.7,866 కోట్లు, మహారాష్ట్రకు రూ.7,022కోట్లు లభించాయి. దక్షిణాదిరాష్ట్రాలకు కూడా కేంద్ర నిధుల కేటాయింపు భారీగానే జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.4,597 కోట్లు, కర్ణాటకకు రూ.4,504 కోట్లు, తమిళనాడుకు రూ.4,466 కోట్లు అందాయి. రాజస్థాన్ ఖాతాలో రూ.6,460కోట్లు, ఒడిశాకు రూ. 4,819 కోట్లు జమయ్యాయి. చిన్న రాష్ట్రాల విషయానికొస్తే సిక్కింకు రూ.365 కోట్లు, గోవాకు రూ.398 కోట్లు, నాగాలాండ్‌కు రూ.524 కోట్లు కేటాయించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం సేకరించే వివిధ రకాల పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో ఒక నిర్దిష్ట శాతాన్ని రాష్ట్రాలకు పంచాల్సి ఉంటుంది. దీనినే ఆర్థిక భాషలో ట్యాక్స్ డెవల్యూషన్ అంటారు. ఫైనాన్స్ కమీషన్ నిర్దేశించిన ఫార్ములా ఆధారంగా ఏ రాష్ట్రానికి ఎంత ఇవ్వాలో లెక్కిస్తారు.



## భారీ ఉగ్ర కుట్ర భగ్నం

### సిఎం సువేందు లక్ష్యంగా స్కెచ్..

**కోల్‌కత్తా,ఆగస్టు 2:** పశ్చిమ బెంగాల్‌లో సంచలనం సృష్టించిన భారీ ఉగ్రవాద కుట్రను స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు భగ్నం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారిని లక్ష్యంగా చేసుకోవడంతో పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో అలజడి సృష్టించేందుకు పథకం పన్నిన ఉగ్రవాదిని అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న హమీమ్ మండల్‌ను రెండు రోజుల క్రితం పూర్వ బర్ధమాన్ జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌టీఎఫ్ వెల్లడించింది. ఈ కేసు విచారణలో భాగంగా హమీమ్ ప్రియురాలు అర్పితా సర్కార్‌ను కూడా జార్ఖండ్‌లో అరెస్ట్ చేశారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలోకి పోలీసు యూనిఫాంలో చొరబడి, గందరగోళం సృష్టించాలని హమీమ్ మండల్‌కు పాకిస్థాన్‌లోని అతని హ్యాండ్లర్ల నుంచి ఆదేశాలు అందాయని ఎస్‌టీఎఫ్ ఐజీ గౌరవ్ శర్మ మీడియా సమావేశంలో తెలిపారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి సువేందు అధికారి కదలికలపై నిఘా పెట్టాలని, ఆయనకు భద్రత తక్కువగా ఉండే ప్రదేశాల సమాచారాన్ని సేకరించాలని కూడా అతనికి సూచించినట్లు ఐజీ వివరించారు. ముఖ్యమంత్రి వారి లక్ష్యాల్లో ఒకరు. ఆయనపై దాడి చేసేందుకు అనువైన సమయం కోసం చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కుట్రలో హమీమ్ ప్రియురాలు అర్పితా సర్కార్ పాత్ర కూడా కీలకమని అధికారులు గుర్తించారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులను అర్పిత హనీట్రాప్ చేసి, వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టి హమీమ్‌కు చేరవేసేదని తేలింది. వీరిద్దరూ కలిసి రాష్ట్ర మంత్రి ఉమేష్ రే కుమారుడిని కిడ్నాప్ చేసి, డబ్బు డిమాండ్ చేయాలని కూడా పథకం పన్నినట్లు విచారణలో బయటపడింది. పాకిస్థాన్‌కు చెందిన షాజాద్ భట్టి గ్యాంగ్‌తో సంబంధమున్న హ్యాండ్లర్ల ఆదేశాల మేరకే వీరు పనిచేస్తున్నారని అధికారులు నిర్ధారించారు.

అర్పిత వాట్సాప్ చాట్‌లలో పాకిస్థాన్‌తో ఉన్న సంబంధాలు బయటపడ్డాయి. హమీమ్, అర్పిత నుంచి యూకే, మెక్సికో దేశాలకు చెందిన అంతర్జాతీయ సిమ్ కార్డులను ఎస్‌టీఎఫ్ స్వాధీనం చేసుకుంది. ఈ సిమ్‌లను ఉపయోగించి తమ పాకిస్థానీ హ్యాండ్లర్లు, స్లీపర్ సెల్స్‌తో ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో సంభాషణలు జరిపినట్లు అనుమానిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారానే హమీమ్ ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై, పాక్ ఆపరేటివ్‌ల కోసం పనిచేయడం ప్రారంభించాడని దర్యాప్తులో తేలింది.

## అభిజిత్ దీప్కే ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేయాలి

### ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదు

**ముంబయి,ఆగస్టు 2:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే, ఆయన కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సూరత్‌కు చెందిన ఓ ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదు చేశారు. ఆ పార్టీకి సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ప్రకటించిన రూ.కోటి విరాళం చట్టబద్ధతపైనా ఆయన పలు అనుమానాలు లేవనెత్తారు. అభిజీత్ దీప్కే తండ్రి భగవాన్‌రావు దీప్కే ఆర్థిక స్థితిపై దర్యాప్తు చేయాలని ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ కోరారు. మహారాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసి రిటైర్ అయిన భగవాన్‌రావు, తన కుమారుడిని విదేశాల్లో ఎలా చదివించగలిగారని ఆయన ప్రశ్నించారు. ఒక మాజీ ప్రభుత్వ ఉద్యోగికి అంత ఆర్థిక స్తోమత ఎలా వచ్చిందో పరిశీలించాలని తివారీ డిమాండ్ చేశారు.

మరోవైపు, నీట్ పేపర్ లీక్ వివాదంపై ఆందోళనలు చేసి అరెస్టయిన సీజేపీ కార్యకర్తలకు న్యాయ సహాయం అం దించేందుకు కపిల్ సిబల్ రూ. కోటి లీగల్ డిఫెన్స్ ఫండ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిధుల సేకరణపై తివారీ ఎన్నికల సంఘా నికి, పన్నుల శాఖకు ఫిర్యాదు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ అనేది రిజిస్టర్ కాని సంస్థ అని, అయినప్పటికీ రాజకీయ పార్టీ పేరుతో కార్యకలా పాలు ఎలా నిర్వహిస్తుందని ప్రశ్నించారు.

## సంక్షిప్త వార్తలు

### పడవలో మంటలు..ఐదుగురు మృత్యువాత



**జకార్తా, ఆగస్టు 2:** ఇండోనేసియాని మదురా ద్వీపంలో ఆదివారం తీవ్ర విషాం నెలకొంది. 271 మందితో వెళ్తున్న పడవలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో ఈప్రమాదంలో ఐదుగురు ప్రాణాలుకోల్పోయారు. మరో 41మంది గల్లంతయ్యారు. ఈనేపథ్యంలో మృతుల సంఖ్యమరింతగా పెరిగే అవకాముమన్నట్లు అధికారులు అంచనా వేస్తు న్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నారు.

### ఎడారిలో ఘోర విమాన ప్రమాదం: 13 మంది దుర్మరణం



**లిమా, ఆగస్టు 2:** దక్షిణ అమెరికా ఖండంలోని ప్రముఖ పర్యాటక దేశం పెరూలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిన చారిత్రక నజ్కా లైన్స్ సైట్ సీయింగ్ కోసం పర్యాటకులను తీసుకెళ్తున్న ఒక చిన్నవిమానం ఉన్నట్టుండి నేలకూలింది. ఈ సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న 13మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువ మంది విదేశీ పర్యాటకులే ఉన్నట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. దక్షిణ పెరూలోని ఇకా ప్రాంతానికి చెందిన పిస్కో విమానాశ్రయం నుంచి ఈ పర్యాటక విమానం గాల్లోకి లేచింది. అయితే ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే సాంకేతిక లోపం లేదా ఇతర కారణాల వల్లలో కిందపడిపోయింది.

### వాషింగ్టన్‌ను చుట్టుముట్టిన కార్చిచ్చు



**వాషింగ్టన్, ఆగస్టు 2:** అమెరికా పశ్చిమ తీరంలోని వాషింగ్టన్ ప్రకృతి ప్రకోపానికి గురైంది. శివార్లలోని స్పోకేన్ సిటీ, దాని పరిసర ప్రాంతాలను దావానలం వణికించి వేస్తోంది, ఈ నగర చరిత్ర లోనే ఊహించని రీతిలో సంభించిన ఈ కార్చిచ్చు ప్రకోపానికి అనేక గృహాలు కాలి బూడిద అయ్యాయి. అగ్నికీలలు నివాసప్రాంతాలను వేగంగా చుట్టుముట్టడంతో వందలాది కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశాయి. దట్టమైన నల్లటి పొగ కొన్ని కిలోమీటర్ల దూరం వరకు వ్యాపించడంతో ఈ ప్రాంతం నరకప్రాయంగా మారింది.

### రెస్టారెంట్‌లో బాంబు పేలుడు: ముగ్గురు మృతి

**మాస్కో,ఆగస్టు 2:** రష్యా రాజధాని మాస్కోలో శనివారం సాయంత్రం జరిగిన బాంబు పేలుడులో ముగ్గురు మరణించగా, కనీసం 21మంది గాయపడ్డారు. స్వయంగా తయారు చేసిన బాంబును తీసుకువచ్చిన గుర్తుతెలియని మహిళతో పాటు మరో ఇద్దరు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. మాస్కో నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన కుద్రిన్‌స్కయా స్క్వేర్‌లోని ఓ చారిత్రక భవనంలో ఉన్న బాల్జి రోస్సీ అనే ఇటాలియన్ రెస్టారెంట్ వెలుపల స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల సమయంలో ఈ పేలుడు సంభవించింది.

### ఇదాహోలో కాల్పులు..ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు



**వాషింగ్టన్,ఆగస్టు 2:** అమెరికా వాయవ్య రాష్ట్రమైన ఇదాహోలో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ట్విన్ ఫాల్స్ నగరంలోని ప్రముఖ ఇన్ఎన్ అవుట్ రెస్టారెంట్ ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం, మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో రెస్టారెంట్ లోపల కాల్పులు ప్రారంభమైనట్లు అధికారు లు తెలిపారు. ఈ ఘటనపై ట్విన్ ఫాల్స్ పోలీస్ చీఫ్ మాథ్యూ హిక్స్ రాత్రి మీడియా సమావే శంలో వివరాలు వెల్లడించారు. ఈ కాల్పుల్లో మరణాలు సంభవించాయని ధ్రువీకరించిన ఆయన, గాయపడిన పలువురిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాల్పులకు తెగబడిన అనుమానిత దుండగుడు కూడా మరణించినట్లు హిక్స్ ప్రకటించారు.

### ఉత్తర ఐలాండ్ తూర్పుతీరంలో భూకంపం

**వెల్లింగ్టన్,ఆగస్టు 2:** ప్రకృతి వైపరీత్యాలకు, భూకంపాలకు నెలవుగా మారిన పసిఫిక్ మహాసముద్ర పరివాహక ప్రాంతంలో మరోసారి భూమి విపరీతంగా కంపించింది. ఆదివారం ఉదయం న్యూజిలాండ్‌కు చెందిన నార్త్ ఐలాండ్ తూర్పు తీరంలో ఒక్కసారిగా శక్తివంతమైన భూకంపం సంభవించడంతో తీర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదైనట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ వెల్లడించింది.



యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

## తక్షణం పిఆర్‌సి ప్రకటించండి

### రాష్ట్ర యుటిఎఫ్ నాయకులు డిమాండ్

**పెనుమూరు(చిత్తూరుజిల్లా), ఆగస్టు 2 (ప్రభాతవార్త):** రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, నవకోటేశ్వరరావు, జివి రమణలు డిమాండ్ చేశారు. స్థానిక ముత్యాలమ్మ కళ్యాణ మండపంలో చిత్తూరు జిల్లా యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, నవకోటేశ్వరరావు, జివి రమణలు మాట్లాడుతూ సత్వరం 12వ పిఆర్‌సి ఏర్పాటు చేయాలని, ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాల సిబ్బంది విభజన జరగాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 2023 సంవత్సరం జులై 1 నుండి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి ఏర్పాటు చేసి, మధ్యంతర భృతి, ఐఆర్ ప్రకటించాలన్నారు. అలాగే ఐదు విడతల కరువు భత్యం విడుదల చేయాలని, 2022 నుండి సరెండర్ లీవ్ ఎన్‌కాష్‌మెంట్ విడుదల చేయాలని, పెండింగ్‌లో వున్న సిపిఎస్ ఉద్యోగుల 90 శాతం డిఎ ఆరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు చేయాలని, ఇతర శాఖల తరహాలో విద్యాశాఖలో సైతం సత్వరం పదో న్నతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డప్పనాయుడు, మణిగండన్‌లు, జిల్లా గౌరవ అధ్యక్షులు కె సదాశివరెడ్డి, సహాధ్యక్షురాలు రెహానాబేగం, డి.ఏకాంబరంలు, రాష్ట్ర కౌన్సిలర్లు సోమశేఖరనాయుడు, రఘుపతిరెడ్డి, ఎస్పీ భాషా, జిల్లా కార్యదర్శులు గాలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

### అర్ధరాత్రి తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?

### కక్షసాధింపు చర్యలు మానుకోండి

### మాజీ సిఎం జగన్ ధ్వజం



**విజయవాడ, ఆగస్టు 2, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, నారాసుర పాలనలో అరాచకం పరాకాష్టకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యా యత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా ఆక్షేపించారు. ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? అని జగన్ నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ 2025 ఆర్ట్ మాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. రాజకీయ కక్ష సాధింపు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు.

గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు.

**ఎన్ని కేసులు పెట్టినా వైసిపి వెనక్కి తగ్గదు**

**కర్నూలు, ఆగస్టు 2, ప్రభాతవార్త :** అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడితే వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని మాజీ సిఎం జగన్ విమర్శించారు. విరూపాక్షి అరెస్టు సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆయన ఎక్స్ వేదికగా ఇచ్చిన ట్వీట్‌లో ... నారాసుర పాలనలో పరాకాష్టకు అరాచకం అంటూ ధ్వజమెత్తారు. చంద్రబాబు, బాధితులకు అండగా నిలబడితే ప్రజాప్రతినిధులపైనా కేసులు ! ప్రశ్నిస్తే అరెస్టులు ! నిలదీస్తే అర్ధరాత్రి తలుపులు బద్దలుకొట్టడం! ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా న్యాయం? ఇదేనా చట్టం? అని మండిపడ్డారు. చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుని ఇంటిపై దాడి జరిగిన నేపథ్యంలో, ప్రాణభయంతో సహాయం కోరిన పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు ఎమ్మెల్యే విరూపాక్షి వెళ్లారని జగన్ పేర్కొన్నారు. బాధితులకు మద్దతు ఇవ్వడం నేరం కాదని, అయితే దాడికి గురైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేయడం అన్యాయమని అన్నారు. ఎన్ని కేసులు నమోదు చేసినా, ఎన్ని అరెస్టులు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని, బాధితులకు అండగా నిలుస్తూ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని జగన్ స్పష్టం చేశారు.

## ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వ రాయస్వామి వార్షిక ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా ఆదివారం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 5 భరణి, 6న ఆడికృత్తిక నిర్వహించనున్నారు. ఆలయంలోని వల్లిదేవసేన సమేత చెంగల్వ రాయస్వామి ఆలయం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను ప్రతిష్ఠించి ఆలయ వేదపండితులు, ప్రధానార్చకులు, అర్చకుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా సాగాయి. శ్రీవల్లి దేవసేన సమేత శ్రీచెంగల్వ రాయస్వామి ఉత్సవమూర్తికి దివ్యాలంకరణ చేసి కొలువుదీర్చారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ సారథ్యంలో పూజా కార్యక్రమాలను ఆలయ సంప్రదాయం మేరకునిర్వహించారు. హోమాలు, కలశస్థాపన పూజలను నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణలతో చెంగల్వరాయస్వామి ఎదురుగా ధ్వజపతాక ముగ్గును తీర్చిదిద్ది ధ్వజారోహణ పూజలను వేదమంత్రోచ్ఛారణలతో శా స్త్రో క్తంగా నిర్వహించారు. చెంగల్వరాయస్వామి వార్షిక ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, ప్రధానార్చకులు, అర్చకుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు కన్నుల పండువగాసాగాయి. శ్రీవల్లి దేవసేన సమేత శ్రీచెంగల్వరాయస్వామి ఉత్సవమూర్తికి దివ్యాలంకరణ చేసి కొలువుదీర్చారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ సారథ్యంలో పూజా కార్యక్రమాలను ఆలయ సంప్రదాయం మేరకునిర్వహించారు. హోమాలు, కలశస్థాపన పూజలను నిర్వహించారు. అనంతరం వేదమంత్రో చ్ఛారణలతో చెంగల్వరాయస్వామి ఎదురుగా ధ్వజపతాక ముగ్గును తీర్చిదిద్ది ధ్వజారోహణ పూజలను వేదమంత్రోచ్ఛారణలతో శా స్త్రోక్తంగా నిర్వహించారు. . సూపరింటెండెంట్‌లు. ఎఇఒ, ఆలయ ఇన్స్పెక్టర్లు పిఆర్ఓ తదితరులు పాల్గొన్నారు. ఆడికృత్తిక మహోత్సవాల్ని కూడా గతంలో నిర్వహించని రీతిలో నిర్వహించాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారని ఈ మేరకు అధికారులకు ఏర్పాట్ల గురించి వివరించామన్నారు. ఈ నెల 5 భరణి, 6 ఆడికృత్తిక, 7 తెప్పోత్సవం, 8 కళ్యాణోత్సవం నిర్వహించబడుతుందని ఇఓ బికె వెంకటేశులు వివరించారు. వచ్చిన ప్రతి భక్తుడు సుదర్శనం తో పాటు సత్వర దర్శనం ఏర్పాటు చేసామని వివరించారు.



## దుర్గమ్మకు ఘనంగా ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనం భక్తిశ్రద్ధలతో దుర్గమ్మవారికి సమర్పించారు. శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్రకీలాద్రికి 20వ రోజు ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు 79 సారె బృందాలకు చెందిన 29,567 మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. దసరా రోజులను గుర్తు తెచ్చేలా జన ప్రవాహం కొనసాగింది. వివిధ ప్రాంతాల నుండి మహిళలు మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలతో ఇంద్రకీలాద్రికి విచ్చేసారు. వారు దుర్గమ్మవారి దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు.

**బంగారు బొట్టు నత్తు బొల్లాకి**

దుర్గమ్మవారికి 19 గ్రాముల 500 మిల్లీగ్రాముల బరువైన సుమారు విలువ ఎంత మూడు లక్షలు మూడు లక్షలు విలువైన బంగారు బొట్టు నత్తు బొల్లాకిని విజయనగరంకు చెందిన కే సత్యనారాయణ, అప్పాయమ్మ దంపతులు ఆదివారంకానుకగా అందించారు.

**ఇన్‌స్టారీల్‌పై ఫిర్యాదు**

దుర్గమ్మవారి దేవస్థానంలో ఆక్షేపణీయమైన ఇన్‌స్టాగ్రామ్ రీల్ వివాదంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారి దేవస్థానం ఆచారాలు, సాంప్రదాయాలకు భంగం కలిగించేలా ఆలయంలోని మహామండపం 7వ అంతస్తు రాజగోపురం వద్ద ఒక అపరిచిత యువతి డ్యాన్స్ చేస్తూ చిత్రీకరించిన ఇన్‌స్టాగ్రామ్ రీల్ సోషల్ మీడియాలో మరియు వివిధ న్యూస్ ఛానళ్లలో వైరల్ అవుతుండగా దీనిపై ఇఓ విజయవాడ వన్ టౌన్ పోలీస్ లకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. సదరు యువతి గుంటూరు భవానీ మేఘాపటేల్ అనే ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా జూలై 30న మధ్యాహ్నం 01:45 నుండి 01:47 గంటల సమయంలో (సుమారు 2 నిమిషాలు) ఈ వీడియో చిత్రీకరించినట్లు గుర్తించామని, ఈ రీల్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, వీడియోలోని యువతిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ వారిని దేవస్థానం నుండి కోరియున్నామని, మహా శక్తివంతమైన అమ్మవారి క్షేత్రంను విశిష్టత దెబ్బతీసేలా కొంతమంది ప్రవర్తన తో చాలా మంది భక్తులు మనస్తాపం చెందుతున్నారని, ఆలయ పవిత్రతను, సాంప్రదాయాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించే వారిపై తగు చర్యలు తీసుకొని, దేవస్థానం పవిత్రత కాపాడేందుకు దేవస్థాన యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ తెలియజేసారు.

## కీచక టీచర్‌పై కొరడా

### పూర్వ విద్యార్థినికి అసభ్య సందేశాలతో వేధింపులు

### సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన డిఇవో

**తిరుపతి , ఆగస్టు 2, ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా నారాయణవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ (తమిళ్) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె. మునివేలుపై వచ్చిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ కఠిన చర్యలు చేపట్టింది. పూర్వ విద్యార్థినికి మొబైల్ ఫోన్ ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు, అనంతరం ఆ విద్యార్థిని మరణించిన ఘటన తీవ్ర ప్రాధాన్యం సంతరించుకోవడంతో సంబంధిత ఉపాధ్యాయుడిని తక్షణ ప్రభావంతో విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తిరుపతి జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి (డీఈవో) కేవీఎన్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అందించిన మౌఖిక నివేదికతో పాటు నారాయణవనం మండల విద్యాశాఖాధికారి ఆగస్టు 2న సమర్పించిన ప్రాథమిక విచారణ నివేదికను సమగ్రంగా పరిశీలించిన అనంతరం క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో కె వి ఎన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై ఇలాంటి ఆరోపణలు రావడం అత్యంత తీవ్రంగా పరిగణించిన విద్యాశాఖ, ఎలాంటి జాప్యం లేకుండా శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, గౌరవం, వారి హక్కుల పరిరక్షణ విషయంలో విద్యాశాఖ రాజీపడదు. విద్యార్థులపై వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ ఉద్యోగి అయినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు ఎదుర్కోవాల్సిందే అని డీఈవో కేవీఎన్ కుమార్ స్పష్టం చేశారు. పోలీసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో శాఖాపరమైన విచారణను కూడా వేగవంతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విచారణలో వెలుగులోకి వచ్చే వాస్తవాల, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు భద్రమైన, నమ్మకమైన వాతావరణం కల్పించడం విద్యాశాఖ ప్రధాన బాధ్యత అని, ఆ బాధ్యతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఈవో కేవీఎన్ కుమార్ స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమానికి విఘాతం కలిగించే ఘటనలపై ప్రభుత్వం, విద్యాశాఖ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోందని, ఇటువంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచ బోమని డీఈవో కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు.



## నెల్లూరు పార్కులకు కొత్త శోభ

### 40 ఉద్యానవనాల అభివృద్ధి పూర్తి : మంత్రి నారాయణ

**నెల్లూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త :** నెల్లూరులోని 47 పార్కుల అభివృద్ధికి శ్రీకారం ఇప్పటికే 40 పార్కులు మంత్రి నారాయణ ప్రారంభించామన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పార్కుల జాతర ఘనంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా 39 లక్షలతో ఆధునీకరించిన బంగ్లాతోట పార్క్, ఏసీ కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేసి, పిల్లలతో ఆడుకుంటూ సరదాగా గడిపిన మంత్రికి స్థానికులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలకగా, ఆయన పర్యటనలో ప్రోటోకాల్ పక్కనపెట్టి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడమే కాకుండా, సామాన్యుడిలా తోపుడు బండి వద్ద ఆగి టిఫిన్ చేసి, టీ తాగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు పార్కులను నిర్వీర్యం చేస్తే, తమ ప్రభుత్వంలో సిటీలో 47 పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టి ఇప్పటికే 40 పార్కులను ప్రారంభించామని, తక్కువ ఖర్చుతో పిల్లల పుట్టినరోజు వేడుకలు చేసుకునేందుకు ఏసీ కమ్యూనిటీ హాల్స్ ఉపయోగపడతాయని, అభివృద్ధి సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వేగవంతం చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై స్పందిస్తూ 1,000 లోపు ఆస్తిపన్ను కట్టేవారికి ఉచితంగా, 1,000 నుండి 2,000 లోపు ఉన్నవారికి 50 శాతం రాయితీతో డ్రైనేజీ కనెక్షన్లు ఇస్తామని, 2,000 మించితే పూర్తి నగదు చెల్లించాలని, ప్రతి ఒక్కరూ కనెక్షన్ తీసుకొని దోమలు లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, డివిజన్ నాయకులు కువ్వారపు బాలాజీ, పాకాల పెంచలయ్య, గోవర్ధన్, శ్రీధర్ రావు, బాబూరావు, సురేష్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, చంద్రమౌళి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.




## బ్యాంకు ఉద్యోగాలు పుష్కలం

### దరఖాస్తు చేసుకోవడమే తరువాయి!

**విజయవాడ, ఆగస్టు2, ప్రభాతవార్తప్రతిపిధి:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్ భారీ శుభవార్త చెప్పింది. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 2027- 28 సంవత్సరానికి సంబంధించి కస్టమర్ సర్వీస్ అసోసియేట్ (క్లర్క్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను సీఆర్‌పీఏ - 16 ఐబిపిఎస్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 11,403 కస్టమర్ సర్వీస్ అసోసియేట్ (క్లర్క్) పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం పోస్టుల్లో ఆంధ్రప్రదేశ్‌లో 186 పోస్టులు, తెలంగాణలో 191 పోస్టులు వరకు ఉన్నాయి. మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియామకాలు చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పోస్టుల సంఖ్య186, తెలంగాణలో పోస్టుల సంఖ్య191, కర్ణాటకలో పోస్టుల సంఖ్య ,414. ఉత్తరప్రదేశ్‌లో పోస్టుల సంఖ్య 1,731, మహారాష్ట్రలో పోస్టుల సంఖ్య1,051 ,పశ్చిమ బెంగాల్‌లో పోస్టుల సంఖ్య 946. తమిళనాడులో పోస్టుల సంఖ్య: 675 గుజరాత్‌లో పోస్టుల సంఖ్య: 698 మధ్యప్రదేశ్‌లో పోస్టుల సంఖ్య: 570, ఢిల్లీలో పోస్టుల సంఖ్య: 415, గోవాలో పోస్టుల సంఖ్య:61, కేరళలో పోస్టుల సంఖ్య: 108 భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా విభాగంలో డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అయితే ఆగస్టు 21, 2026 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. దరఖాస్తు చేస్తున్న రాష్ట్రానికి సంబంధించిన స్థానిక భాషను చదవడం, రాయడం, మాట్లాడడం, అర్థం చేసుకునే సామర్థం ఉండాలి. 10వ తరగతి లేదా అంతకంటే పై స్థాయిలో స్థానిక భాష చదివిన వారికి లిలిశిగి నుంచి మినహాయింపు ఉంటుంది. అభ్యర్థుల వయోపరిమితి ఆగస్టు 1, 2026వ తేదీ నాటికి 20 ఏళ్ల నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు, మాజీ సైనికులు తదితర రిజర్వేషన్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో ఆగస్ట్ 21, 2026వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ.850, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఈఎస్ఎం/ డీఈఎస్ఎం అభ్యర్థులు రూ.175 చొప్పున చెల్లించవల్సి ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు రూ.24,050 నుంచి రూ.64,480 వరకు జీతంగా చెల్లిస్తారు. దీనితో పాటు బ్యాంకు నిబంధనల ప్రకారం ఇతర అలవెన్సులు లభిస్తాయి. ప్రిలిమినరీ, మెయిన్ ఆన్‌లైన్ పరీక్షలు, లోకల్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ , డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

## డ్రోన్ కెమెరాలతో తిరుపతిలో నిఘా

**తిరుపతి, ఆగస్టు 2, ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం, పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి జిల్లావ్యాప్తంగా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు తిరుపతి జిల్లా పోలీసులు సమగ్ర కార్యాచరణ చేపట్టారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలపైనా ఉపేక్ష లేకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. ఈ చర్యల్లో భాగంగా డ్రోన్ కెమెరాల ద్వారా అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలు, గంజాయి సాగుకు అవకాశం ఉన్న ప్రాంతాలు, ఇతర అనుమానాస్పద ప్రదేశాలపై ప్రత్యేక వైమానిక నిఘా నిర్వహిస్తున్నారు. భూమిపై పోలీసు బృందాల తనిఖీలతో పాటు డ్రోన్ పర్యవేక్షణను సమన్వయం చేయడం ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలను ప్రారంభ దశలోనే గుర్తించి వెంటనే అడ్డుకునే చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా గంజాయి సాగు, గంజాయి రవాణా, అక్రమ మద్యం తయారీ, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిలో పాల్గొనే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా ఉపేక్షి ంచబోమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. "శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, మీ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు ,చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్112 కుగానీ సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

## మిద్దెతోటలతో మెరుగైన ఆరోగ్యం

**విజయవాడ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మిద్దెతోటల పెంపకం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అభిప్రాయపడ్డారు. విజయవాడ సిటీటెర్రస్ గార్డెన్స్(సీటీజి) 5వ వార్షికోత్సవం ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మిద్దెతోటల పెంపకం వల్ల శారీరక శ్రమ కలగటంతోపాటు, పచ్చదనం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో సిటీజి సభ్యులు బలిజెపల్లి వేణుగోపాలరావు, వరలక్ష్మీ దంపతులు, పగడాల సుభాష్‌బాబు ముత్యాల ఈశ్వరి దంపతులు, అబ్బూరి వెంకటేశ్వరావు, విజయలక్ష్మీ దంపతులు, యువగార్డెనర్ కె.శ్రీనివాస్ తదితరులను సత్కరించారు. పివిడి.నాగేశ్వరావు, షేక్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంకు పోటెత్తిన భక్తులు

**కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిది ్ధ వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి

## కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం

**కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో బుధవారం సంకటహర చతుర్థి వ్రతంను ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు దఫాలుగా అర్చకులు నిర్వహించారు. ఈమేరకు ఉదయం 9,11 గంటలకు, సాయంత్రం, 3,5 గంటలకు వ్రతాన్ని నాలుగు దఫాలుగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## వెండి అంబారిలో సుబ్బారాయుడు

**శ్రీకాళహస్తి, ఆగస్తు 2, ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆడి కృత్తిక మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. శనివారం రాత్రి ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయం ఎదురుగా అంకుర్పారణ గావించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో చెంగల్వరాయస్వామి ధ్వజారోహణ కార్యక్రమాలను ఆలయ ఇఓ బికె వవెంకటేశులు పర్యవేక్షణలో ఆలయ చైర్మెన్ కొట్యేటసాయి ప్రసాద్ సారథ్యంలో ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి, ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్ ల సారథ్యంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో శాస్త్రోక్తంగా సంప్రదాయ బద్ధంగా హోమాలు, కలశస్థాపన జరిపిన ధ్వజారోహణం జరిపారు. ఆదివారం ఆలయానికి అతిధుల తాకిడి కనబడింది.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా, స్థానిక ఆచార వ్యవహారాలతో పూజలునిర్వహించి ధ్వజారోహణం జరిపారు. తరువాత వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా అలంకారమండపంలో రాజేష్‌గురుకుల్ ముస్తాబు చేసారు. వవెండి అంబారిలో ప్రతిష్టించిన తరువాత స్వామి అమ్మవార్లను గ్రామోత్సవానికి తరలించారు. స్వామి అమ్మవార్ల పల్లకిని బోయిలు శివయ్య, రాజగోపురం గుండా పట్టణంలోని తేరువీధి, నెహ్రూవీధి, సినిమావీధి, బాబూ అగ్రహారం, నగరివీధి, బజారు వీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, సుబ్రమణ్యం స్వామి ఆలయ చైర్మెన్ నెమళ్ళూరు బుజ్జి సభ్యులు వెంటరాగా గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. టెంపులు ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్‌కు మద్దతు ఇచ్చేవారు దేశద్రోహులే

### తమిళనాడు రాజకీయ ప్రాతినిధ్యాన్ని హరించేందుకు కేంద్రం కుట్ర: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. భారతీయ జనతా పార్టీ తమిళనాడు రాజకీయ ప్రభావాన్ని తగ్గించి, అక్కడి ప్రజల రాజకీయ ప్రాతినిధ్యాన్ని హరించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ప్రాంతీయ, జాతీయ రాజకీయ పార్టీలన్నీ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించి, పార్లమెంట్‌లో ఓడించాలని పిలుపు నిచ్చారు. బీజేపీ డిలిమిటేషన్‌ను అమలు చేయాలని ప్రయత్నిస్తోంది. ఈ ప్రక్రియ ద్వారా తమిళనాడు ప్రజల రాజకీయ హక్కులను హరించి, వారి రాజకీయ శక్తిని తగ్గించాలనే కుట్ర జరుగుతోంది. ఇది బీజేపీ పన్నిన కుట్ర. డిలిమిటేషన్‌కు మద్దతు ఇచ్చే ఎవరైనా తమిళనాడును, దాని భవిష్యత్తును ద్రోహం చేసినట్టే. అలాంటి వారు ఆర్ఎస్ఎస్, బీజేపీలకు తమిళ ప్రజలపై దాడి చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్టేనని రాహుల్ గాంధీ అన్నారు. తమిళ చరిత్రలో ద్రోహానికి ప్రతీకగా భావించే ఎట్టప్పన్ పేరును కూడా ఆయన ప్రస్తావించారు. డిలిమిటేషన్‌కు మద్దతు ఇచ్చే వారిని 21వ శతాబ్దపు ఎట్టప్పన్‌లుగా అభివర్ణించారు. ఏ తమిళుడూ డిలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వకూడదు. ప్రతి తమిళుడు దీనిని వ్యతిరేకించాలి. తమిళనాడుకు చెందిన అన్ని రాజకీయ పార్టీలు, అలాగే జాతీయ పార్టీలు కూడా పార్లమెంట్‌లో ఈ ప్రతిపాదనను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును మరోసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ బిల్లు ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్యను గరిష్ఠంగా 850కు పెంచడంతో పాటు, నారీ శక్తి వందన్ అధినియమ్-2023 అమలుకు వీలు కల్పించనుంది. ఈ చట్టం ప్రకారం శాసనసభలు, లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్‌లో నిర్వహించిన లోక్‌సభ ప్రత్యేక సమావేశంలో ఈ బిల్లును ముందుకు తీసుకెళ్లే ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది. తర్వాత ప్రతిపక్ష పార్టీలకు చెందిన నలుగు పార్టీల 37 మంది ఎంపీలు అధికార పక్షంలో చేరడం విశేషంగా మారింది. 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షం నుంచి అధికార పక్షానికి జరిగిన అతిపెద్ద మార్పుగా దీనిని భావిస్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభలో మూడు స్థానాలు ఖాళీగా ఉండటంతో మొత్తం సభ్యుల సంఖ్య 540గా ఉంది. వీరిలో ఇద్దరు ఎంపీలు జైలులో ఉన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ, ప్రస్తుతం 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ఏప్రిల్‌లో జరిగిన ఓటింగ్‌లో 528 మంది ఎంపీలు పాల్గొనగా, ఆ సందర్భంలో అవసరమైన మూడింట రెండొంతుల సంఖ్య 352గా నిలిచింది. ఆ ఓటింగ్‌లో ప్రభుత్వానికి 298 ఓట్లు, ప్రతిపక్షానికి 230 ఓట్లు లభించాయి. ఆ సమయంలో ఎన్డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీలు ఉండగా, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ)లో జరిగిన చీలికల అనంతరం ఆ సంఖ్య 319కు పెరిగింది.. ఇక ఎన్‌సీపీ (ఎస్‌పీ) కూడా బిల్లుకు మద్దతు ఇస్తే ఎన్డీఏ బలం 327కు చేరుతుంది.





## ఊపిరితిత్తుల తరలింపునకు గ్రీన్‌ఛానల్

**శంషాబాద్ ఆగస్టు 2, ప్రభాతవార్త :** విశాఖపట్నం నుంచి ఇండిగో విమా నంలో హైదరాబాద్‌కు చేరిన అవయవ మార్పిడి కోసం తీసుకొచ్చిన ఊపిరితిత్తులను వేగంగా తరలించేందుకు ఆర్ జిఐఎ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమా నాశ్రయం నుంచి సికిందరాబాద్ మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆసుపత్రి వరకు అంబులెన్స్ (టిజి 09యూ 0642)కు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆస్పత్రికి తరలించారు.

## పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 2:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తల్లి రుక్కమ్మ దశధినకర్మకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం పట్నం నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కటీఆర్ వెంట మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, పలువురు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు.

## దాదర్ రైల్వేస్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ తెగువ

**ముంబయి, ఆగస్టు 2:** ముంబైలోని దాదర్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళా కానిస్టేబుల్ అప్రమత్తంగా వ్యవహరించి పెను ప్రమాదాన్ని నివారించారు. ఆత్మహత్య చేసుకునేందుకు కదులుతున్న లోకల్ ట్రైన్ కిందకు వెళ్లబోయిన ఓ వ్యక్తిని ఆమె క్షణాల్లో కాపాడారు. గురువారం రాత్రి 10:54 గంటల సమయంలో జరిగిన ఈ నాటకీయ ఘటన స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. ప్లాట్‌ఫామ్ నుంచి లోకల్ ట్రైన్ నెమ్మదిగా కదులుతుండగా, 28 ఏళ్ల యువకుడు రైలు కిందకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధుల్లో ఉన్న ఏ. నర్వాడే అనే మహిళా కానిస్టేబుల్ వెంటనే స్పందించారు. వేగంగా పరుగెత్తుకెళ్లి, ఆ వ్యక్తి కాళ్లు పట్టుకుని వెనక్కి లాగేశారు. దీంతో అతడు ప్రాణాలతో బయటపడ్డాడు. అతనికి ఎలాంటి పెద్ద గాయాలు కాలేదని, పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అధికారులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి, పునరావాస కేంద్రానికి తరలించనున్నట్లు సమాచారం. ఈ రెస్క్యూకు సంబంధించిన వీడియో ఎక్స్‌లో షేర్ చేయగా, ఆ మహిళా అధికారిణి సాహసంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఆ మహిళా అధికారిణి అద్భుతంగా పనిచేశారు", "ఒక ప్రాణాన్ని కాపాడిన అధికారిణికి సెల్యూట్" అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# నషా ముక్త్ భారత్‌తోనే వికసిత్ భారత్‌కు బాటలు

## యువత, విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 2:** నషా ముక్త్ భారత్‌తోనే వికసిత్ భారత్‌కు బలమైన పునాది అని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా పేర్కొన్నారు. దేశాన్ని నషా ముక్త్ భారత్‌గా తీర్చిదిద్దడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. గ్రామాలు, రాష్ట్రాలు వ్యస నాల నుంచి విముక్తి పొందితేనే దేశం నిజమైన నషాముక్త్ భారత్‌గా ఆవిర్భవిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్య క్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించి మాట్లా డారు. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటో రియంలో యువత, విద్యార్థులతో కలిసి డిజిటల్ స్క్రీన్ పై వీక్షించారు. 10 కోట్ల డ్రగ్‌ఫ్రీ ప్రతిజ్ఞ ఉద్యమం (10క్రోర్ డ్రగ్-ఫ్రీ ప్లెడ్జ్ క్యాంపెయిన్)ను రాష్ట్రంలో ప్రారంభించి యువత, విద్యార్థులతో మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యాంటి డ్రగ్ ప్రతిజ్ఞ (యాంటీ-డ్రగ్ ప్లెడ్జ్)ను గవర్నర్ చేయించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్‌శుక్లా యువత, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలుగన్న వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కీలకమైన ప్రజా ఉద్యమమని గవర్నర్ పేర్కొన్నారు. దేశ బలం యువతేనని, ఆరోగ్య వంతమైన, క్రమశిక్షణ కలిగిన, చైతన్యవంతమైన యువతతోనే ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణం సాధ్యమవు తుందన్నారు. దేశ జనాభాలో దాదాపు 65 శాతం యువతే ఉన్నారని, వారిని వ్యసనాల బారిన పడకుండా కాపాడటం అత్యంత ముఖ్యమని అన్నారు. మాదక ద్రవ్యాలు వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబ సంతో షాన్ని, సామాజిక సామరస్యాన్ని, దేశ ప్రగతిని దెబ్బ తీస్తాయని పేర్కొన్నారు. యువత ఆధ్యాత్మిక విలువలు, యోగా, క్రీడలు, నైతిక జీవన విధానాన్ని అలవర చుకోవాలని సూచించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ ధ్యానం ద్వారా శాంతి, సానుకూల ఆలోచన, నైతిక విలువలను సమాజంలో విస్తరించడంలో విశిష్ట సేవలు అందిస్తోందని గవర్నర్ కొనియాడారు. మహిళా సాధికారత, యువత అభివృద్ధి, విలువల ఆధారిత విద్య, పర్యావరణ పరిరక్షణ, వ్యసన నిర్మూలన, సామాజిక సేవలో సంస్థ చేస్తున్న కృషినీ గవర్నర్ అభినందించారు. మై భారత్ వేదిక ద్వారా యువతకు ఈ ఉద్యమ నాయకత్వాన్ని అప్పగించడం దూరదృష్టితో కూడిన నిర్ణయమని పేర్కొన్నారు. వచ్చే 100 వారాలపాటు వాక్ థాన్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, వీధి నాటకాలు, ఈప్రతిజ్ఞల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్న ఈ ఉద్య మాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, స్వామి వివేకానంద సందేశమైన లేచి నిలబడండి, లక్ష్యం సాధించే వరకు ఆగవద్దు అనే స్ఫూర్తితో యువత ముందుకు సాగా లని, తాము వ్యసనాలకు దూరంగా ఉండటమే కాకుండా కుటుంబం, మిత్రులు, సమాజాన్ని కూడా వ్యసన రహితంగా తీర్చిదిద్దాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ 10 కోట్ల డ్రగ్ డీఅడిక్షన్ ప్లెడ్జ్ పోస్టర్‌ను ఆవి ష్కరించారు. వ్యసన నిర్మూలన సందేశాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లనున్న బ్రహ్మకుమారీస్ సభ్యులకు జెండాలను అందజేశారు. 10 కోట్ల డ్రగ్‌ఫ్రీ ప్రతిజ్ఞ ఉద్యమం నషా ముక్త్ భారత్ ప్రచారం కోసం బ్రహ్మ కుమారీలు ప్రత్యేకంగా సిద్ధం చేసిన మొబైల్ వాహనాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్, బ్రహ్మకుమారీస్ హైదరా బాద్ డైరెక్టర్ రాజయోగిని బీకే కుల్దీప్ దిదీ, మైభారత్ తెలంగాణ డైరెక్టర్ అన్వేష్, భారత నౌకాదళానికి చెందిన కెప్టెన్ (ఐఎన్) శివ్ సింగ్, డీపీఎస్ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ ఎం. కోమరయ్య, బ్రహ్మకుమారీస్ సంస్థ సీనియర్ ప్రతినిధులు, మైభారత్ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, రక్తదాతలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆదివారం గవర్నర్ శివప్రతాప్‌శుక్లా గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నషా ముక్త్ భారత్ ప్రచారం కోసం బ్రహ్మ కుమారీలు ప్రత్యేకంగా సిద్ధం చేసిన మొబైల్ వాహనాన్ని ప్రారంభించిన దృశ్యం

# ఊరటనివ్వని వానలు!

## ఏ పంట వేయాలో దిక్కుతోచని రైతు

## వేసిన పంటలు చేతికొచ్చే వరకు అనుమానమే

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ తెలంగాణ రైతాంగానికి, ప్రజలకు ఆశించిన స్థాయిలో ఊరట లభించడం లేదు. భౌగోళిక మార్పులు, వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా ఈ సంవత్సరం వర్షపాతం అత్యంత స్వల్పంగా, అస్తవ్యస్తంగా నమోదవుతోంది. ఫలితంగా రాష్ట్రంలో టర్మినల్ డ్రాట్‌కు అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. నిర్ణీత సమయంలో వర్షాలు కురవకపోవడంతో రాష్ట్రంలోని అనేక వ్యవసాయ ఆధారిత ప్రాంతాలలో టర్మినల్ డ్రాట్ ముప్పు పొంచి ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా, ప్రస్తుతం 12 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పంటల సాగు చేపట్టాల్సిన జూన్ 1 నుండి జూలై 25 వరకూ రాష్ట్రంలో 27 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులతో లోటు వర్షపాతం నెలకొంది. అయితే గత వారం రోజులుగా వర్షాలు కొన్ని జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం కురియడంతో వర్షపాతం లోటు ఉన్న జిల్లాలు 12కు, 242 మండలాలకు తగ్గాయి. మిగిలిన జిల్లాల్లోని 3 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, మిగిలిన జిల్లాల్లో స్వల్ప లోటు ఉన్నా సాధారణ వర్షపాతం రికార్డయింది. తీంతో ఖరీఫ్ పంటలు గత వారం రోజులుగా ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 62 శాతం మేర 82,65,736 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 31 శాతం మేర 20,46,184 ఎకరాల్లో సాగు కాగా, పత్తి 98 శాతం చొప్పున 46,33,634 ఎకరాల్లో వేశారు. అయితే వాతావరణంలో చోటుచేసుకుంటున్న తీవ్రమైన మార్పులు, అస్తవ్యస్తమైన రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగా స్వరూపం వేగంగా మారుతోంది. సరైన సమయంలో వర్షాలు కురవకపోవడం, ఎప్పుడైనా కురిసినా ఒకేసారి కుండపోతగా లేదా కొన్ని చోట్ల తీవ్ర వర్షాభావం నెలకొనడం వల్ల రైతులు సంప్రదాయ పంటల సాగులో భారీ నష్టాలను చవిచూస్తున్నారు.

ఈ ప్రతికూల పరిస్థితులను ఎలా అధిగమించాలనే దానిపై రాష్ట్ర రైతాంగం దృష్టిని సారిస్తోంది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో సమానంగా విస్తరించి పంటలకు అను కూలమైన వర్ష పాతాన్ని అందిస్తా యి. కానీ, ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో అకుండపోత వర్షాలు కురిసి వరదలు రాగా, మెజారిటీ ప్రాంతాల్లో చుక్క నీరు లేక పొలాలు ఎండిపోతున్నాయి. వర్షపాతంలో నెల కొన్న ఈ తీవ్ర అసమానత వల్ల రైతులు ఏ సమ యంలో విత్తనాలు వేయాలో తెలియక తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. రైతులు పం టలు వేసినప్పటికీ పంట ఎదుగుదలకు లేదా గింజ గట్టే కీలక సమయంలో వర్షాలు ముఖం చాటేయ డానిన టర్మినల్ డ్రాట్ అంటారు. వర్షపాతం మందగించడం వల్ల రాష్ట్రంలోని ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, జొన్న, పప్పు ధాన్యాల సాగు తీవ్రంగా దెబ్బతిం టోంది. ప్రాజెక్టులలో, భూగర్భంలో నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడం వల్ల వచ్చే రోజుల్లో బోర్ల ద్వారా నీరు అంతంత మాత్రంగా వచ్చే ముప్పు ఉంది. మరోపక్క రాష్ట్రంలో ఏరువాక సాగిపోవాల్సిన సమయంలో వర్షాలు పడకపోవడం, ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల విత్తనాలు మొలకెత్తక ముందే ఎండిపోతున్నాయి. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర నష్టాల బారిన పడుతున్నారు. మరోవైపు వాతావరణ శాఖ అంచనాలు కూడా తరచూ మారిపోతుండటంతో రాబోయే రోజుల్లో సాధారణ వర్షాలు కురుస్తాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్

# కొలీజియంలో కొరవడుతున్న పారదర్శకత



**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** న్యాయమూర్తుల నియామకాలు, బదిలీలు చేసే కొలీజియం వ్యవస్థలో మళ్లీ పారదర్శకత తగ్గుతోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నియామకాలకు సంబంధించిన సిఫార్సుల్లో సరైన కారణాలను వెల్లడించకపోవడం ప్రతిభావంతులైన న్యాయమూర్తులకు అన్యాయం చేయడమే కాకుండా, అనర్హులు, రాజ్యాంగ విరుద్ధ వ్యాఖ్యలు చేసే వ్యక్తులు వ్యవస్థలోకి ప్రవేశించడానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. న్యూఢిల్లీలో విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీకి చెందిన జల్ది కార్యక్రమం ఆధ్వర్యంలో రూపొందించిన జ్యుడీషియల్ ట్రాన్స్‌పరెన్సీ ఇండెక్స్ నివేదిక ఆవిష్కరణ సభలో జస్టిస్ భుయాన్ ప్రసంగించారు. ఇటీవల వెలువడిన చివరి మూడు కొలీజియం తీర్మానాల్లో న్యాయమూర్తుల పదోన్నతులకు ఎలాంటి కారణాలూ పేర్కొనలేదని ఆయన గుర్తుచేశారు. గతంలో కొన్నిసార్లు మొక్కుబడిగా ఉన్నప్పటికీ, కనీసం కొన్ని కారణాలనైనా చెప్పేవారు. కానీ ఇప్పుడు ఆ పద్ధతి కూడా లేకపోవడం పారదర్శకతా సూత్రానికి తిరోగమనమేనా అని ఆయన ప్రశ్నించారు.

కారణాలు వెల్లడించకపోవడం వల్ల అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన న్యాయమూర్తుల సేవలను గుర్తించడంలో విఫలమవుతున్నామని జస్టిస్ భుయాన్ అన్నారు. ఇదే సమయంలో, వ్యవస్థలోకి కొందరు అనర్హులు ప్రవేశించడానికి ఆస్కారం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ హైకోర్టు మాజీ న్యాయమూర్తి విశ్వహిందూ పరిషత్ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలను ఆయన ఉదాహరణగా చూపారు. ఆ వ్యాఖ్యలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, అలాంటి వ్యక్తులు వ్యవస్థలోకి రాకుండా ఉండాలంటే నియామకాలపై బహిరంగ చర్చ జరగాలని, కారణాలు వెల్లడించాలని స్పష్టం చేశారు. సీనియర్ అడ్వకేట్ సౌరభ్ కిర్పాల్ నియామకంపై గతంలో కొలీజియం ఇచ్చిన వివరణాత్మక తీర్మానాన్ని ఆయన ప్రశంసించారు. అయితే, ఆ నియామకం ఇంకా కార్యరూపం దాల్చలేదన్న విషయాన్ని గుర్తుచేస్తూ, అది వేరే చర్చ అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ అడ్వకేట్లు సౌరభ్ కిర్పాల్, ఆదిత్య సంధి కూడా పారదర్శకతకు మద్దతు తెలిపారు. నిష్పక్షపాత కారణాలను వెల్లడించడం ద్వారా ఏకపక్ష నిర్ణయాలను నిరోధించవచ్చని కిర్పాల్ అన్నారు. కొలీజియం సిఫార్సులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచే ప్రభుత్వం కూడా పారదర్శకంగా ఉండాలని సంధి అభిప్రాయపడ్డారు.

న్యాయవ్యవస్థ స్వాతంత్రం, జవాబుదారీతనం మధ్య సమతుల్యతపై ఎప్పటినుంచో జరుగుతున్న చర్చ నేపథ్యంలో జస్టిస్ భుయాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

తమకు న్యాయమూర్తులుగా ఎవరు వస్తున్నారో తెలుసుకునే హక్కు పౌరులకు ఉందని జస్టిస్ భుయాన్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే పారదర్శకత అత్యంత ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.



# మంత్రి పొన్నం ప్రభాకర్ బోనాల విందు

## పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు2:** సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార నివాసంలో ఆదివారం సంప్రదాయ బద్ధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాటు చేసిన బోనాల విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో మంత్రి పొన్నం ప్రభాకర్ అతిథులను ఆప్యాయంగా ఆహ్వానించి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అతిథులతో స్నేహపూర్వకంగా ముచ్చ టిస్తూ వారికి స్వయంగా ఆతిథ్యం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి మల్లమ్మ, సతీ మణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్, వారి సోదరులు వారి కుటుంబ సభ్యులు, బంధువులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటూ కుటుంబ సభ్యులను పలకరించారు. ఈ సందర్భంగా యశోద ఆసుపత్రులకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ దశరథ రామారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిశారు. బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బోనాల ఉత్స వాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీకగా నిలవడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఆత్మీయ సమావేశంగా నిలిచింది.

# పోలీసు శాఖలో తరుగుతున్న విశ్వసనీయత!

## అత్యాచారాలు, లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులుగా మారుతున్న అధికారులు

## కొరవడిన ఉన్నతాధికారుల అజమాయిషీ

## కానరాని థర్డ్ పార్టీ తనిఖీలు

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో శాంతి భద్రతల విభాగంలో ఎస్ఐలు, సిఐలుగా వుంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు అత్యాచారాలు, లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులుగా బోనులో నిలబడాల్సి రావడం సమాజంలో పోలీసు విభాగం వి శ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఇటీవల వారం రోజుల వ్యవధిలో ఒక ఇన్స్పెక్టర్, మరో ఎస్ఐపై అత్యాచార ఆరోపణల కింద కేసులు నమోదు కాగా ఇందులో ఇన్స్పెక్టర్ సస్పెండ్ కాగా ఎస్ఐ అరెస్టయి జైలు పాలయ్యాడు. ఈ రెండు ఘటనలు పోలీసు శాఖలో ఉన్నతాధికారుల అజమాయిషీ లేమిని ఎత్తిచూపగా పోలీసుల పనితీరును అంతర్గతంగా గుర్తించేందుకు ఏర్పాటైన థర్డ్ పార్టీ తనిఖీలు కూడా తూచ్.. అన్నట్లుగా వుంది.తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే అనేక అంశాలలో నంబర్ వన్ వుండడం తెలిసిందే. శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నివా రణ, నేర గాళ్ల పట్టివేత, సైబర్ నేరాలను అదుపు చేయడంలో మంచి ఫలి తాలు సాధించడం వంటి అంశాలు టి. పోలీ సును అగ్రభాగంలో నిలిపాయి. అ యితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. రెండవ వైపు క్షేత్రస్థాయిలో కీలకంగా ముఖ్యంగా శాంతి భద్రతల విభాగంలో ఎస్ఐలు, సిఐలుగా వున్న అధికారులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అజమాయిషీ పూర్తిగా కొరవడిందని ఇటీవల వెలుగుచూసిన కొన్ని ఘటనలు తేటతెల్లం చేస్తు న్నాయి. ప్రభుత్వం కొలువుతీరిన హైదరాబాద్‌లోనే పోలీసు పలువురు అధికారులు నేరాలకు పాల్పడి జైలు పాలవడం, లేదా సస్పెండ్ అవడం, విఆర్‌లో వెళ్లడం తరచూ జరుగుతున్నాయి. ఇందులో సస్పెండ్ లేదా విఆర్‌లో వెళ్లడం ఎలావున్నా ఇన్స్పెక్టర్ స్థాయి అధికారిపై లైంగిక దాడి ఆరోపణలు రావడం నగరంలో తరచూ వెలుగు చూస్తున్నాయి. జూబ్లీహిల్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి తన సహాయం కోరి వచ్చిన మహిళ పై లైంగిక దాడికి పాల్పడడంతో పాటు ఆమె నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి, చంపుతానని బెదిరించిన కేసులో సస్పెండ్ అయ్యా డు. దీని తరువాత వరంగల్‌లో శ్రీకాంత్ అనే ఎస్ఐ సోషల్ మీడియాలో పరిచయం అయిన మహిళపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో అరెస్టయి జైలు పాలయ్యాడు. గతంలోనూ ఇటువంటి ఘటనలు జరిగిన ఉదంతాలున్నాయి. లాలాగూడ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన ఓ అధికారి మహిళా కానిస్టేబుల్‌తో రాత్రి డ్యూటీ సమయంలో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన నాలుగేళ్ల క్రితం వెలుగు చూడగా సదరు అధికారి ని డిస్మిస్ చేశారు. అంతకు ముందు మారెడ్‌పల్లి ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన మరో అధికారి తనకు పరిచయం వున్న మహిళపై లైంగిక దాడికి పా ల్పడేందుకు ఆమెను కిడ్నాప్ చేయడం, సర్వీస్ రివాల్వర్‌తో బెదిరించిన ఘటనలో అరెస్టయ్యాడు. ఇతన్ని కూడా డిస్మిస్ చేశారు. దీని తరువాత వరంగల్‌లో ఓ మహిళా ఎస్ఐపై మరో పురుష ఎస్ఐ రాత్రి వేళలో గస్తీ కోసం జీపులో తీసుకువెళ్లి అత్యాచారం చేసేందుకు యత్నించడం సంచలనం రేపింది. ఈ ఘటనలో సదరు పురుష ఎస్ఐపై వేటు వేశారు. దీని తరువాత మల్కాజిగిరి సిసిఎస్‌లో ఎస్ఐ ధరావత్ విజయ్ కు మార్ మిర్యాలగూడలో ఓ యువతిని వివాహం పేరిట పదేళ్లుగా సహజీవనం చేసి, మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ యువతిని మోసం చేసిన ఎస్ఐ విజయ్ కుమార్ తనకు రెండవ భార్యగా వుండాలని కోరడంతో పాటు ఆమె మరొకరితో వివాహం చేసుకోకుండా అడ్డుపడసాగాడు. దీంతో సదరు ఎస్ఐపై బాధితురాలు పోలీసులకు పిర్యాదు చేయగా అతనిపై వేటు వేశారు. మరో ఘటనలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రె బ్బన పోలీసు స్టేషన్‌లో పనిచేసిన ఓ ఎస్ఐ కానిస్టేబుల్ ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఓ నిరుపేద యువతిపై కన్నేసి ఆమెపట్ల అసభ్యంగా ప్రవ ర్తించగా అతన్ని సస్పెండ్ చేశారు. ఇక తాజాగా ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం దేశ వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే.

### కొరవడిన ఉన్నతాధికారుల అజమాయిషీ..

### కానరాని థర్డ్ పార్టీ తనిఖీలు

ఇదిలా వుండగా పోలీసు శాఖలో క్షేత్రస్థాయిలో కీలకంగా వుండే ఎస్ఐలు, సిఐలు ఏకంగా అత్యాచారాలు, లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులుగా మారుతున్న తీరు ఉన్నతాధికారుల అజమాయిషీలేమిని ఎత్తి చూపుతోంది. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు ముఖ్యంగా ఎస్ఐలు, సిఐలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అజమాయిషీ నిరంతరం వుండాల్సి వుంది. కానీ అనేక కారణాల వల్ల ఇది సరిగ్గా వుండడం లేదు. దీనివల్ల కొందరు దారితప్పి అపర కీచకులుగా మారుతున్నారు. ఇక ఇదే సమయంలో పోలీసుల పనితీరును నిరంతరం పరిశీలించేందుకు ఏర్పాటైన థర్డ్ పార్టీ తనిఖీల వ్యవహారం కూడా సవ్యంగా సాగడం లేదని వరుస ఉదంతాలు చెబుతున్నాయి.

# ఒక్కనెలలోనే రూ.57 లక్షల కోట్లకుపైగా మస్క్ సంపద ఆవిరి!

**న్యూయార్కు, ఆగస్టు 2:** గ్లోబల్ బిలియనీర్ టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపద కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారీగా పడిపోయింది. ఆయన నికర విలువలో సుమారు 600 బిలియన్ డాలర్లకు అంటే సుమారు రూ.57 లక్షల కోట్లకు పైగా కోత పడింది. స్పేస్ఎక్స్, టెస్లా కంపెనీల షేర్లు మార్కెట్లో తీవ్ర ఒత్తిడికి గురవడమే ఈ నష్టానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. అయినప్పటికీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అటానమస్ డ్రైవింగ్, రోబోటిక్స్ వంటి భవిష్యత్ టెక్నాలజీలపై తన పెట్టుబడుల ప్రణాళికలో జూన్ 16న మస్క్ నికర విలువ సుమారు 1.33 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో స్పేస్ఎక్స్ షేర్ల దూకుడుతో ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు.



నెల రోజులు గడిచేసరికి ఆయన సంపద 684 బిలియన్ డాలర్లకు పడిపోయింది. కేవలం మస్క్ సంపదలో వచ్చిన ఈ తగ్గుదల, ప్రపంచంలోని ఇతర బిలియనీర్ల మొత్తం సంపద కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ నష్టానికి స్పేస్ఎక్స్ షేర్ల పతనమే కీలక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా 75 బిలియన్ డాలర్లను సమీకరించిన స్పేస్ఎక్స్, 135 డాలర్ల ఐపీఓ ధరకు బదులుగా 150 డాలర్ల వద్ద లిస్ట్ అయింది. ఆరంభంలో ఇన్వెస్టర్ల ఉత్సాహంతో మూడు ట్రేడింగ్ సెషన్లలోనే షేరు విలువ 50 శాతానికి పైగా పెరిగి, గతనెల 16న 202 డాలర్ల రికార్డు స్థాయికి చేరింది. కానీ ఈ జోరు ఎక్కువ కాలం నిలవలేదు. అప్పటి నుంచి షేరు విలువ సుమారు 46 శాతం పతనమై 108.37 డాలర్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. దీంతో మస్క్ సంపదలో వందల బిలియన్ డాలర్లు ఆవిరయ్యాయి. టెస్లా షేర్ల బలహీనత కూడా మస్క్ సంపదపై మరింత ఒత్తిడి పెంచింది.

గతనెల 22న రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన తర్వాత కంపెనీ షేర్లు 17 శాతం మేర పడిపోయాయి. రెండేళ్లలో తొలిసారిగా టెస్లా లాభాల అంచనాలను అందుకోలేకపోయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌పై ఖర్చులను పెంచడం వల్ల కంపెనీ నగదు నిల్వలు కూడా ప్రతికూలంగా మారాయి. వాహన డెలివరీలు పెరిగినప్పటికీ, ఏఐ పెట్టుబడుల వల్ల నిర్వహణ ఖర్చులు పెరగడం, కార్ల సగటు అమ్మకం ధరలు తగ్గడం వంటివి లాభాలపై ప్రభావం చూపాయని కంపెనీ వివరించింది.

అయితే, స్వల్పకాలికంగా ఆర్థిక ఒత్తిళ్లు ఎదురైనా, మస్క్ మాత్రం తన దూకుడు పెట్టుబడుల వ్యూహాన్ని మార్చుకోవడం లేదు. ఏఐ ఆధారిత సెల్ఫ్ డ్రైవింగ్ టెక్నాలజీ, రోబోట్యాక్సీలు, హ్యూమనాయిడ్ రోబోల సామ ర్థ్యాన్ని పెంచేందుకు ఈ ఏడాది 25 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేయాలని టెస్లా యోచిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇది గతేడాది పెట్టిన పెట్టు బడులతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు అధికం.

# పిఒకెలో ఉద్రిక్త పరిస్థితులు

## 12 శరణార్థి స్థానాలకు పోలింగ్

**ముజఫరాబాద్,ఆగస్టు 2:** పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూకాశ్మీర్ (పీవోకే)లో భద్రతా పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా కొనసాగుతున్నాయి. గత కొన్ని వారాలుగా ఆందోళనలు కొనసాగుతుండగా, నిరసనకారులను చెదరగొట్టేందుకు పాకిస్థాన్ భద్రతా బలగాలు షెల్లింగ్, ప్రత్యక్ష కాల్పులకు పాల్పడ్డాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. తీవ్ర రాజకీయ ఉద్రిక్తతలు, హింసాత్మక ఘటనలకు కేంద్రంగా మారిన 12 శరణార్థి అసెంబ్లీ స్థానాలకు ఆదివారం రెండో దశ ఎన్నికల పోలింగ్ నిర్వహించింది. మొత్తం 21 నియోజకవర్గాల్లో సుమారు 12 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన తొమ్మిది నియోజకవర్గాలు ముజఫరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్నాయి.ఎన్నికల ప్రక్రియకు ముందు అనేక వారాలుగా కొనసాగిన ఆందోళనలు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో పోలింగ్ జరిగింది. స్థానిక ప్రజల గొంతును అణచివేస్తూ, ఎన్నికల ప్రక్రియతో పాటు శరణార్థి నియోజకవర్గాల ప్రాతినిధ్యంపై వస్తున్న డిమాండ్లను అణిచివేసేందుకు పాకిస్థాన్ బలగాలు తీవ్ర బలప్రయోగానికి దిగాయని జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆరోపించింది.

# టీమిండియాకు బిగ్ ఛాలెంజ్

## డబ్ల్యూటిసి ఫైనల్స్‌కు శ్రీలంక మ్యాచ్ కీలకం



**న్యూఢిల్లీ:** సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా రెడ్ బాల్ క్రికెట్ ఆడేందుకు సిద్ధమైంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) లో భాగంగా రెండు టెస్టుల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. డబ్ల్యూటిసి ఫైనల్స్‌కు వెళ్లేందుకు ఈ శ్రీలంక మ్యాచ్ కీలకం కానున్న నేపథ్యంలో భారత్‌కు ఇది బిగ్ ఛాలెంజ్‌గా నిలిచింది. ఆగస్ట్ 15 నుంచి ఈ రెండు టెస్టులసిరీస్ ప్రారంభం కానుంది. తొలి టెస్ట్ గాలె వేదికగా ఆగస్ట్ 19 వరకు జరగనుండగా, రెండో టెస్ట్ కొలంబో వేదికగా ఆగస్ట్ 23 నుంచి 27 వరకు జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఈ రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా గెలవడం చాలా కీలకం. ఎందుకంటే డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలోఉంది. డబ్ల్యూటిసి 2025-27 ఎడిషన్‌లో ఇప్పటి వరకు భారత్ 9 మ్యాచ్‌ల్లో 4 గెలిచి, 4 ఓడి, ఒకటి డ్రా చేసుకొని 48.15 విన్నింగ్ పర్సంటేజీతో ఐదో స్థానంలో నిలిచింది. 8 మ్యాచ్‌ల్లో 7 విజయాలు, 87.50 విన్నింగ్ పర్సంటేజీతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, 4 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, 75 విన్నింగ్ పర్సంటేజీతో సౌతాఫ్రికా రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 72.22 విన్నింగ్ పర్సెంటేజీతో మూడో స్థానంలోను, 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 58.33 విజయాల శాతంతో బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. డబ్ల్యూటిసి సైకిల్ ముగిసే సరికి టాప్2లో నిలిచిన జట్లు ఫైనల్ ఆడుతాయి.

భారత్ ఫైనల్ చేరాలంటే టాప్2లో నిలవాలి. ఈ పరిస్థితుల్లో 9 మ్యాచ్‌ల్లో భారత్ 7 గెలవాల్సి ఉంటుంది. శ్రీలంకతో 2, న్యూజిలాండ్ 2 ఆవే సిరీస్‌లు ఆడనున్న భారత్, ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ 9 మ్యాచ్‌ల్లో భారత్ కనీసం 7 మ్యాచ్ గెలిస్తే డబ్ల్యూటిసి టాప్ 2 ప్లేస్ దక్కుతుంది. భారత్ ఆడే తదుపరి సిరీస్‌ల్లో శ్రీలంకనే సులువైన ప్రత్యర్థి. కాబట్టి ఈ రెండు టెస్టుల సిరీస్ గెలిస్తే భారత్ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఆ తర్వాత ఏడు మ్యాచ్‌ల్లో ఐదు గెలిస్తే సరిపోతుంది. అయితే టెస్ట్‌ల్లో భారత్ ఘోర పరాజయాలను చవిచూస్తోంది. ఎన్నడూ లేని విధంగా సొంతగడ్డపై సిరీస్‌ల్లో క్లీన్ స్వీప్ అయ్యింది. డబ్ల్యూటిసి భాగంగా గతేడాది నవంబర్‌లో సొంగడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను సౌతాఫ్రికా 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఈ వైఫల్యాలకు భారత్ చెక్ పెడుతుందా? లేక కొనసాగిస్తుందా? అనేది చూడాలి.

## తైపే ఓపెన్.. ఛాంపియన్‌గా తన్వి శర్మ



**న్యూఢిల్లీ:** పదిహేడేళ్ల భారత షట్లర్ తన్వి శర్మ తన తొలి బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 300 టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. తద్వారా తైపే ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న అత్యంత పిన్న వయస్కురాలైన క్రీడాకారిణిగా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో వియత్నాంకు చెందిన ఆరో సీడ్ గుయెన్ థుయ్ లిన్‌ను 21-16, 21-16 తేడాతో ఓడించిన తన్వి, ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను గెలుచుకున్న సైనా నెహ్వాల్ (2008) తర్వాత రెండవ భారత మహిళల సింగిల్స్ క్రీడాకారిణిగా నిలిచింది.

తన్వి ఫైనల్‌ను దూకుడుగా ప్రారంభించి, తొలి గేమ్‌లో 102 ఆధిక్యాన్ని సంపాదించింది. గుయెన్ పోరాడి ఆధిక్యాన్ని 108కి తగ్గించినప్పటికీ, ఈ భారత యువ క్రీడాకారిణి తన పట్టును నిలుపుకొని గేమ్‌ను 21-16 తేడాతో కైవసం చేసుకుంది. రెండవ గేమ్‌లో గుయెన్ ఆరంభంలోనే 3-0 ఆధిక్యం సాధించినప్పటికీ, తన్వి త్వరగా పుంజుకుంది. దాడి చేసే విధానం, పదునైన క్రాస్‌కోర్ట్ షాట్లు మరియు కచ్చితమైన ప్లేస్‌మెంట్‌లను ఉపయోగించి, ఆమె బలమైన ఆధిక్యాన్ని సంపాదించి, కేవలం 36 నిమిషాల్లోనే ఒక నిర్ణయాత్మక క్రాస్‌కోర్ట్ డ్రాప్ షాట్‌తో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో తైపే ఓపెన్ టైటిల్ కోసం భారతదేశం 17 ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరీక్షణ ముగిసింది.

## టి 20 సిరీస్ శ్రీలంక కైవసం

### చిత్తుగా ఓడిన పాకిస్థాన్



**న్యూఢిల్లీ:** శ్రీలంక పర్యటనలో పాకిస్థాన్ మహిళల క్రికెట్ జట్టుకు వరుస పరాభవాలు ఎదురవుతున్నాయి. తొలుత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 1-2 తేడాతో కోల్పోయిన పాక్‌జట్టు, తాజాగా మూడు మ్యాచ్‌ల టి20ని మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో 0-2 తేడాతో ఓటమి పాలై సిరీస్‌ను కోల్పోయింది. డంబుల్లా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆతిధ్య జట్టు పాక్‌పై 6 వికెట్ల తేడాతో శ్రీలంక ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 175 పరుగులు చేసింది. శ్రీలంక మరో 14 బంతులు (17.4 ఓవర్లు) మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ చమారి ఆటపట్టు (40), సంజనా కవిండి (46) మెరుపు ఇన్నింగ్స్ ఆడి లంక విజయంలో కీలకపాత్ర పోషించారు. విష్మి గుణరత్నే (31), హర్షిత సమరవిక్రమ (37 నాటౌట) కూడా ఉపయోగకరమైన ఇన్నింగ్స్ ఆడారు. ఆఖర్లో కవిష దిల్హారి (14 నాటౌట్) కూడా బ్యాట్ ఝుళిపించింది. పాక్ బౌలర్లలో హనీ 2, వహీదా, అయేషా జాఫర్ తలో వికెట్ తీశారు. అంతకు ముందు పాక్ తరపున ఓపెనర్లు మునీబా అలీ (45), షవాల్ జుల్ఫికర్ (48) రాణించారు. ఆఖర్లో ఫాతిమా (30 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. మిగిలిన ప్యేరనట ఎమాన్ నసీర్ 21, అయేషా జాఫర్ 8, సైరా జబీన్ 16, హనీ 2 (నాటౌట్) పరుగులు చేశారు. లంక బౌలర్లలో ప్రబోధ 2, సుగంధక కుమారి, చమారీ ఆటపట్టు, కవిష దిల్హారి తలో వికెట్ తీశారు. ఇక ఈ సిరీస్ చివరి నామమాత్రపు మూడో టి20 ఈ నెల 4న జరగనుంది.

## డబ్ల్యూఎసిటి బ్రాంజ్ మీట్‌లో జ్యోతి విజయం

### అవినేష్ రికార్డ్







**న్యూఢిల్లీ:** గాయం నుండి కోలుకుని ప్రోత్సాహకరంగా పునరాగమనం చేసిన భారత క్రీడాకారిణి జ్యోతి యర్రాజి డబ్ల్యూఎసిటి బ్రాంజ్ ఇఎ-ఐఎఫ్ఎఎం అవుట్‌డోర్ మీట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.85 సెకన్ల సమయం నమోదు చేసి విజయం సాధించింది. ఎసిఎల్ గాయం నుండి కోలుకున్న తర్వాత బెల్జియంలోని ఓర్డెగెమ్‌లో జరిగిన తన మొదటి విదేశీ పోటీలో పాల్గొంటూ జాతీయ రికార్డు హోల్డర్ మూడేళ్లలో తన అత్యంత వేగవంతమైన సమయాన్ని నమోదు చేసి, తన 12.78 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయానికి మరో అడుగు దగ్గరైంది. యేడాదికి పైగా ఆటకు దూరంగా ఉన్న తర్వాత, జూన్‌లో జరిగిన జాతీయ అంతరాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 12.99 సెకన్లలో స్వర్ణం గెలుచుకుని విజయవంతంగా పునరాగమనం చేసిన ఆమె ప్రదర్శన తర్వాత ఈ ప్రదర్శన వచ్చింది. అలాగే పురుషుల 100 మీటర్ల పరుగులో 23 యేళ్ల అనిమేష్ నాలుగో స్థానంలో నిలిచాడు. పురుషుల 100 మీటర్ల పరుగులో, 200 మీటర్ల జాతీయ రికార్డు హోల్డర్ అయిన అనిమేష్ కుజుర్ 10.30 సెకన్ల సమయంతో నాలుగో స్థానంలోనిలిచాడు. భారతస్ప్రింటర్ కుజుర్ యూరోపియన్ టోర్నమెంట్‌లో ఫలవంతమైన ప్రదర్శన తర్వాత ఈ ఫలితం వచ్చింది. ఈనెల ప్రారంభంలో, జర్మనీలోని వెట్జ్లార్‌లో కుజుర్ 10.14 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదుచేశాడు. ఇది విదేశీగడ్డపై ఒక భారతీయుడు పరుగెత్తిన అత్యంతవేగవంతమైన 100 మీటర్ల పరుగుగా రికార్డు సృష్టించాడు.

## మహిళల ఆసియా కప్.. భారత్ జట్టు ఖరారు

### చోటు దక్కని శ్రేయాంక



**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్-2026 కోసం భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) టీమిండియాను ఖరారు చేసింది. ఈ జట్టులో 15 మంది సభ్యులు ఉన్నారు. కెప్టెన్సీ పై ఇటీవల చర్చ జరిగినప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్‌నే కెప్టెన్‌గా కొనసాగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక స్మృతి మంధానను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. జట్టులో స్మృతితో పాటు, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ వంటి కీలక ప్లేయర్లకు చోటు దక్కింది. అయితే టి20 ప్రపంచ కప్ జట్టులో ఉన్న శ్రేయాంక పాటిల్‌కు ఆసియా కప్ టీమిండియాలో చోటు దక్కలేదు. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ఆమె కుడి చీలమండకు గాయం అయింది. శ్రేయాంక స్థానంలో టి20 ప్రపంచ కప్ జట్టులోకి వచ్చిన ప్రేమా రావత్ ఆసియా కప్ జట్టులోనూ కొనసాగింది. ఇదే జట్టులో జరిగిన ప్రధాన మార్పు. భారత మహిళల ఆసియా కప్-2026 జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి పుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి కమిలిని, అరుంధతిరెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్; శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి ఉన్నారు. కాగా ఈ ఆసియా కప్ సెప్టెంబరు 17న ప్రారంభమై 22వ తేదీ వరకూ జరుగనుంది.

## గడువులోపు ఐటిఆర్ చేయకుంటే భారీ జరిమానా




**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** అసెస్మెంట్ ఇయర్ 2026-27కు సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే ప్రక్రియలో ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం గడువు తేదీలను ఖరారు చేసింది. జులై 31తో వేతన జీవుల సాధారణ గడువు ముగిసినప్పటికీ ఇతర వర్గాల పన్ను చెల్లింపుదారుల వ్యాపారం, ఆడిట్ స్వభావం ఆధారంగా వేరు వేరు గడువు తేదీలు అందుబాటులో ఉన్నాయి. ఫైనాన్స్ యాక్ట్ ప్రకారం ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 139 కింద ఈ సవరించిన క్యాలెండర్ అమలులోకి వచ్చింది. కేవలం జీతం, పెన్షన్, వడ్డీ ఆదాయం లేదా క్యాపిటల్ గెయిన్స్ ఉండి ఎలాంటి ఆడిట్ అవసరం లేని నిరుద్యోగులు ఐటీఆర్1 ఐటీఆర్2 ఫైల్ చేసేందుకు జులై 31 వరకు మాత్రమే గడువు ఉంటుంది. ఈ ఏడాదికి సంబంధించి ఈ గడువు ముగిసింది. ఒక వేళ మిస్ అయితే ఆలస్య రుసుముతో బిలేటెడ్ రిటర్న్ వేయవచ్చు. ఫ్రీలాన్సర్లు, నిపుణులు, చిన్నతరహా వ్యాపారులు సెక్షన్ 44ఎడి, 44ఎడిఎ, 44ఏఈ కింద ప్రిజంప్టివ్ టాక్సేషన్ ఎంచుకున్నవారు ఐటీఆర్ 3 లేదా ఐటీఆర్ 4ఫైల్ చేసేవారు ట్యాక్స్ ఆడిట్ పరిధిలోకి రాకపోతే వారికి అదనపు గడువు లభిస్తుంది. ఆదాయ పన్ను చట్టం కింద కచ్చితంగా తమ ఖాతాలను ఆడిట్ చేయించాల్సిన వ్యాపార సంస్థలు, కంపెనీలు, వ్యక్తులకు అక్టోబర్ 31వ తేదీ వరకు గడువు ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఆడిట్ నివేదికను సెప్టెంబర్ 30 నాటికే దాఖలు చేయాల్సి ఉంటుంది.

అంతర్జాతీయ లావాదేవీలు లేదా నిర్దేశిత స్వదేశీ లావాదేవీలు కలిగి ఉండి సెక్షన్ 92ఈ ప్రకారం నివేదిక ఇచ్చే సంస్థలు, వ్యక్తులు నవంబర్ 30వ తేదీ వరకు ఐటీఆర్ ఫైల్ చేయవచ్చు. మీ కేటగిరీకి వర్తించే ఆఖరు తేదీ దాటితే డిసెంబర్ 31, 2026 వరకు సెక్షన్ 234 ఎఫ్‌కింద జరిమానా రూ.1000నుంచి రూ.5000 వరకు చెల్లించి రిటర్నులు ఫైల్ చేయవచ్చు. దాఖలు చేసిన ఐటీఆర్‌లో తప్పులు సరిదిద్దుకోవడానికి అయితే మార్చి31, 2027 వరకు సమయం ఉంటుంది. ఇక అదనపు పన్ను చెల్లించి రిటర్న్ ఐటీఆర్ యూ దాఖలు చేసే గడువును 48 నెలల వరకు పొడిగించారు.

## సిప్ ఫండ్స్‌తో పదేళ్లకే కరోడ్‌పతిలు

**ముంబయి,ఆగస్టు 2:** పెట్టుబడుల పరంగా క్రమం తప్పకుండా చిన్న మొత్తం ఇన్వెస్ట్ చేసినా సరైన ఫండ్లను ఎంచుకుంటే 10 యేళ్ల వ్యవధిలో కోటీశ్వరులు కావడం అసాధ్యమేమీ కాదని ఈ ఫండ్ల తీరును నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఫండ్స్ రంగ నిపుణుల అంచనాలప్రకారం పదేళ్ల కాలంలో 20 శాతం కంటే ఎక్కువ రాబడి ఇచ్చిన ఫండ్లలో ప్రధానంగా స్మాల్ క్యాప్ , కొన్ని మిడ్ క్యాప్ ఈక్విటీ పండ్లు అగ్రస్థానంలో నిలిచాయి. నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ అత్యధికంగా దాదాపు 22.21 శాతం పైగా వార్షిక ఎస్ఐపీ రాబడిని ఇచ్చి అగ్రస్థానంలో నిలిచింది. రూ.10 వేలు నెల నెలా పొదుపు చేసినట్లయితే రూ.38.80 లక్షలు అందించింది. ఇన్వెస్కో ఇండియా మిడ్ క్యాప్ ఫండ్ 21.97 శాతం వార్షిక రాబడితో రెండో స్థానంలో ఉంది. 10 సంవత్సరాల వార్షిక పద్దతిలో సిప్ ద్వారా హైరిటర్న్లు రూ.10 వేల పొదుపుతో రూ.38.30 లక్షలు అందించింది. ఎడెల్వీస్ మిడ్ క్యాప్ ఫండ్ గత 10 సంవత్సరాల కాలంలో సగటున వార్షిక రాబడి 21.52 శాతం మేర అందించింది. రూ.10

### ఫండ్ సంస్థల అంచనాలు

వేల పొదుపుతో రూ.37.40 లక్షలు అందించింది. ఎస్‌బిఐ ఫండ్స్‌నుంచి మరో కొత్త స్కీమ్ రూ.5000 ఉంటే చాలు.. ఆగస్టు 5వ తేదీ వరకే ఛాన్స్ ఇచ్చింది. 4. నిప్పాన్ ఇండియా గ్రోత్ మిడ్ క్యాప్ ఫండ్ పదేళ్లలో 20.95 శాతం సిప్ రాబడి అందించింది. రూ.10 వేల సిప్ పెట్టుబడిని 10 యేళ్లలోనే రూ.36.20 లక్షలు అందించింది. యాక్సిస్ స్మాల్ క్యాప్ ఫండ్ గత పది సంవత్సరాల కాలంలో సగటున 20.66 శాతం చొప్పున రాబడి అందించింది. రూ.10 వేల పొదుపుతో రూ.35.70 లక్షలు అందించింది. యూనియన్ స్మాల్ క్యాప్ ఫండ్ గత పదేళ్లలో సగటున వార్షిక రాబడి 20.28 శాతం అందించింది. రూ.10 వేల పొదుపుతో రూ.35 లక్షల వరకు అందించింది. హెచ్‌డీఎఫ్‌సీ మిడ్ క్యాం గత పది సంతవ్సరాల కాలంలో వార్షిక రాబడి 20.21 శాతం చొప్పున రాబడి అందించింది. రూ.10 వేల సిప్ పొదుపుతో రూ.34 లక్షలకు పైగా అందించింది.

## ఒక్కనెలలో రూ.20,200 కోట్ల విదేశీ పెట్టుబడులు




**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** వరుసగా నాలుగు నెలల పాటు భారత ఈక్విటీ మార్కెట్లలో భారీగా పెట్టుబడులను విత్‌డ్రాచేసిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు జూలై నెలలో మళ్లీ కొనుగోళ్ల బాట పట్టారు. ఆకర్షణీయమైన షేర్ల విలువలు, కార్పొరేట్ కంపెనీల లాభాల మెరుగుదల, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అనుకూల మార్పులు కలిసి రావడంతో జూలైలో భారత ఈక్విటీల్లో రూ.20,200 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ గణాంకాల ప్రకారం, ముందు వరుసగా నాలుగు నెలలు విదేశీ పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కి తీసుకున్నారు. జూన్‌లో రూ.49,340 కోట్లు, మేలో రూ.32,963 కోట్లు, ఏప్రిల్‌లో రూ.60,847 కోట్లు, మార్చిలో ఏకంగా రూ.1.17 లక్షల కోట్లు ఉపసంహరించుకున్నారు. ఈ విక్రయాల పరంపరకు ముందు ఫిబ్రవరిలో మాత్రం వారు భారత ఈక్విటీ మార్కెట్లలో రూ.22,615 కోట్ల పెట్టుబడులు పెట్టారు. తిరిగి జూలైలో తిరిగి పెట్టుబడులు వచ్చినప్పటికీ, 2026 యేడాది ప్రారంభంనుంచి ఇప్పటివరకు విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల నుంచి నికరంగా రూ.2.54 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఇది 2025 మొత్తం సంవత్సరంలో నమోదైన రూ.1.66 లక్షల కోట్ల ఉపసంహారణ కంటే చాలా ఎక్కువ.మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, దేశీయ మార్కెట్లు స్థిరంగా ఉండటం, లార్జ్‌క్యాప్ షేర్లు సముచిత విలువలవద్ద లభించడం, కంపెనీల ఆర్థిక ఫలితాలు మెరుగుపడే అవకాశాలు కనిపించడం, అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా మారడం వంటి అంశాలు విదేశీ పెట్టుబడిదారులను మళ్లీ భారత మార్కెట్ వైపు ఆకర్షించాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వికె విజయకుమార్ మాట్లాడుతూ, దక్షిణ కొరియా, తైవాన్ వంటి మార్కెట్లలో అధిక అస్థిరత నెలకొనడం, సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడుల కేంద్రీకరణవల్ల ఏర్పడుతున్న రిస్క్‌కారణంగా ఎఫ్‌పిఐలు భారత్‌లాంటి సుస్థిర మార్కెట్లను ఎంచుకుంటున్నారన్నారు. రూపాయి మారకం విలువ స్థిరంగా ఉండటం, లార్జ్‌క్యాప్ షేర్ల విలువలు ఆకర్షణీయంగా ఉండటం కూడా విదేశీ పెట్టుబడులకు అనుకూలంగా మారిందన్నారు.ఇక విదేశీ ఇన్వెస్టర్ల ఆసక్తి కేవలం ఈక్విటీలకే పరిమితం కాలేదు. డెట్ మార్కెట్‌లో కూడా జూలై నెలలో గణనీయమైన పెట్టుబడులు నమోదయ్యాయి. జనరల్‌రూటులో రూ.29,212 కోట్లు, పూర్తిగా అందుబాటులో ఉన్న మార్గం ద్వారా మరో రూ.3,033 కోట్లు పెట్టుబడులు పెట్టారు. బజాజ్ బ్రోకింగ్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (రిసెర్చ్) పబిత్రో ముఖర్జీ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ముడి చమురు ధరల కదలికలు, అమెరికా-ఇరాన్ భౌగోళిక ఉద్రిక్తతలు విదేశీ పెట్టుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దేశీయంగా తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్, అలాగే ఆగస్టు 5న జరిగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన సమీక్షపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకృతమై ఉంటుందని పేర్కొన్నారు.



## ఎఫ్‌డిలపై బ్యాంకులకు ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు

### అక్టోబరు 1వ తేదీనుంచే అమలులోకి

**ముంబయి,ఆగస్టు 2:** బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్లపై లభించే వడ్డీ రేట్ల ప్రకటన, నిర్ణయంలో మరింత పారదర్శకతను పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను సవరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లపై వడ్డీ రేట్లు సవరణ ఆదేశాలు 2026 జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. అక్టోబర్ 1 నుంచి వచ్చే కొత్త నిబంధనలు వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు,ప్రాంతీయగ్రామీణబ్యాంకులు, పేమెంట్ బ్యాంకుల, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులకు ఈ నూతన మార్గదర్శకాలు వర్తిస్తాయని ఆంబిఐ స్పష్టం చేసింది. ఇకపై ఒకే బ్యాంకుకు చెందిన విభిన్న శాఖాల్లో ఒకే మొత్తానికి, ఒకే రోజు ఓపెన్ చేసే డిపాజిట్లకు వేరు వేరు వడ్డీ రేట్లు ఇవ్వడానికి వీలు లేదు. అన్ని బ్రాంచులలోనూ ఒకే రోజు ఆమోదించిన సమాన డిపాజిట్లకు సమాన వడ్డీ రేటు వర్తింపజేయాల్సి ఉంటుంది. బ్యాంకులు తమ డిపాజిట్ వడ్డీ రేట్ల వివరాలను ముందుగానే వెబ్‌సైట్లో ప్రచురించాల్సి ఉంటుంది.

## ఆర్బీఐ రెపోరేట్, ఎఫ్ఐఐల కొనుగోళ్లే కీలకం

### ఈ వారం మార్కెట్ తీరుపై నిపుణుల అంచనాలు

**ముంబయి, ఆగస్టు 2:** స్టాక్ మార్కెట్లలో ఈ వారం ఇన్వెస్టర్లు కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోలు, అమ్మకాల ధోరణిని నిశితంగా పరిశీలించనున్నారు. ఇవే మార్కెట్ తదుపరి దిశను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ పరిశోధన విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ, ఆగస్టు 3 నుంచి 5 వరకు జరిగే భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన కమిటీ సమావేశం ఈ వారంలో దేశీయ మార్కెట్లకు అత్యంత కీలక అంశంగా నిలవనుందని చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాల సీజన్ కొనసాగుతుండటంతో పలు లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ కంపెనీలు తమ ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయని తెలిపారు.అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ ఘర్షణకు సంబంధించిన పరిణామాలు, కీలక సముద్ర మార్గాల ద్వారా ముడి చమురు సరఫరా స్థిరత్వం మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా కొనసాగనున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.నాలుగు నెలల వరుస విక్రయాల అనంతరం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు జూలై నెలలో భారతీయ ఈక్విటీ మార్కెట్‌లో తిరిగి నికర కొనుగోలుదారులుగా మారారు. ఆకర్షణీయమైన విలువలు, కార్పొరేట్ లాభాల మెరుగుదల, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల సడలింపు కారణంగా వారు సుమారు రూ.20,200 కోట్లు భారతీయ షేర్లలో పెట్టుబడి పెట్టారు.ఎన్‌రిచ్ మనీ సిఇఒ పొన్‌ముడి ఆర్ మాట్లాడుతూ, ఈ వారం పశ్చిమ ఆసియాలో భౌగోళికరాజకీయ పరిణామాల పైనే మదుపరుల దృష్టి కేంద్రీకృతమై ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా అమెరికా-ఇరాన్ ఘర్షణ మరింత తీవ్రరూపం దాల్చితే ముడి చమురు ధరలతో పాటు ప్రపంచ మార్కెట్లలో రిస్క్ సెంటిమెంట్‌పై తక్షణ ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ వారం తమ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్న ప్రధాన కంపెనీల్లో డిఎల్ఎఫ్, ఎయిర్‌టెల్, ఒఎన్‌జిసి, హీరోమోటోకార్ప్, ఎల్‌ఐసి, ఎస్‌బిఐలు ఉన్నాయి.మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధన అధిపతి సిద్ధార్థ ఖేమ్కా మాట్లాడుతూ, దేశీయ ఆర్థిక సూచీలు బలంగా ఉండటం, తొలి త్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు ఆశాజనకంగా రావడం వల్ల భారతీయ ఈక్విటీ మార్కెట్లు సానుకూల ధోరణితో కొనసాగే అవకాశం ఉందన్నారు. ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయం, భారత తయారీ మరియు సేవల కొనుగోలు పిఎంఐ సూచీ గణాంకాలు, ముడి చమురు ధరల కదలికలు, పశ్చిమ ఆసియాలో భౌగోళిక ఉద్రిక్తతలపై మార్కెట్ దృష్టి నిలవనుందని తెలిపారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# జాతీయ రహదారి డ్రైనేజీలో మురుగుతున్న మురికి నీరు

**పట్టించుకోని హైవే అధికారులు.. రోగాల బారిన పడుతున్న ప్రజలు**

**శంఖవరం , ఆగస్టు 2 ప్రభాతవార్త** జాతీయ రహదారి క్రింద నిర్మించిన డ్రైనేజీలో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంఖవరం మండలం కత్తిపూడి లో 839 /5 కల్వర్టు స్టోన్ వద్ద ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు నాలుగు వార్డుల్లో వాడిన మురికి నీరు వెళ్ళేందుకు జాతీయ రహదారి నిర్మాణంలో హైవే అధికారులు రోడ్డు కింద డ్రైనేజీ ని ఏర్పాటు చేశారు. ఎగువప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు ఈ డ్రైనేజీ ద్వారా తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో గల గాబు వారి చెరువులోకి వెళ్లి తద్వారా రైతులకు పంటలకు నీటిని వినియోగించేందుకునూ హైవే అధికారులు ఏర్పాటు చేశారు. డ్రైనేజీని ఏర్పాటు చేశారు ప్రస్తుతం డ్రైనేజీలో నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు అధికంగా పెరిగి ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి డ్రైనేజీ నీరు సరిగా బయటకు వెళ్లకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. భారీ వర్షాలు కురిసిన సందర్భంలో వర్షం నీరు గృహాల్లోకి చేరి విలువైన వస్తువులు పాడైన సందర్భాలు కూడా నెలకొన్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రహదారిపై ప్రయాణించే వాహనదారులు, స్థానిక వ్యాపారులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన కారణంగా సమీపంలో నివసించే ప్రజలు ఇళ్లలో కూడా ఉండలేని పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. ఈ డ్రైనేజీ సమీప గృహాల్లో పలువురు డెంగ్యూ



బారిన పడిన సందర్భాలు అనేకం నెలకొన్నాయి. అధికారులు రోడ్డు పైనుండి వచ్చిన నీరు కిందికి వెళ్లేందుకు భారీ తోరణం తో డ్రైనేజీ ఏర్పాటు చేశారు గానీ ఒక్కసారి కూడా వాటిలో నెలకొన్న మట్టిని బయటికి తీసిన సందర్భాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీని వెంటనే శుభ్రపరచి మురుగునీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. హైవే అధికారులు, సంబంధిత శాఖలు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య నిర్లక్ష్యం చేస్తే అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | సోమవారం 03 ఆగస్టు 2026 | I


# వాడపల్లి క్షేత్రంలో భక్తులు సందడి.

**నిత్యాన్న పథకానికి రూ.50,116/-విరాళం...**







**ఆత్రేయపురం, ఆగస్టు,02,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం కావడంతో భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి వేకువజామున మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, అష్టోత్తర శత నామావళి, నిత్య కళ్యాణం , గోపూజ,బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ లలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వాడపల్లి చెందిన ఏపుగంటి పెద్దకాపు, వెంకటలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 50,116/- వేలు విరాళంగా అందించారు.స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ,వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

# ప్రజా సేవకోసమే మూలారెడ్డి కుటుంబం పుట్టింది...

**మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి**







**బిక్కవోలు 2 ఆగస్టు ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం ఎమ్మెస్సార్ ఫంక్షన్ హాల్ ల్లో స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, సంస్కార ఫౌండేషన్ ఢ ఇండియా టర్న్ పింక్ ఎన్జీవో ఆధ్వర్యంలో బ్రెస్ట్ స్క్రీనింగ్ సేవా కార్యక్రమమును,ఫ్రీ మెడికల్ టెస్ట్ క్యాంపును ప్రారంభించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,బిజెపి నాయకులు నల్లారి కిరణ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఆధ్యాత్మికవేత్త భారతీయం సత్యవాణి, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ గుడిమెట్ల రామచంద్రారెడ్డి,సంస్కార్ ఫౌండేషన్ ప్రతినిధులు జ్యోత్స్న పాల్గొన్నారు వారు ముందుగా నల్లమిల్లి మూలారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రాజకీయం చేయడం అంటే చాలా కష్టమైన పనిగా మారిందని ప్రజలు కూడా అభివృద్ధిని పని చేసిన నాయకుడిని మర్చిపోయి ఓట్లు వేస్తున్నారని ఇటువంటి పరిస్థితుల్లో కూడా మూలారెడ్డి కుటుంబం 6 సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే చిన్న విషయం కాదని మూలారెడ్డి కుటుంబం ప్రజా సేవ కోసమే పుట్టిందని ఆయన కొనియాడారు. అంతేకాకుండా నమ్ముకున్న పార్టీని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విడిచి బిజెపి పార్టీలోకి రావడానికి ఇష్టపడలేదని అతి కష్టం మీద బిజెపి తరఫున పోటీ చేయించవలసి వచ్చిందని ప్రజలు కూడా అతన్ని ఆదరించారని ఆయన అన్నారు. గ్రామస్థాయి నాయకులు కూడా నాయకత్వానికి అనుగుణంగా పనిచేసే ఎమ్మెల్యేకి మంచి పేరు తీసుకురావాలని ఆయన తెలిపారు. ఓటర్లు కూడా అభివృద్ధి చూసి ఓటు వెయ్యాలి కానీ వాళ్ళు ఇచ్చే డబ్బులు చూసి ఓటు వేయకూడదని ఆయన హితవు పలికారు అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించినసంస్కార్ ఫౌండేషన్ మరియు ఇండియా పింక్ అనే ఒక నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ రెండు కలిసి బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ సేవ అనే కార్యక్రమాన్ని,ఒక ఫ్రీ మెడికల్ క్యాంప్,దాంతో పాటుగా మరి జనరల్ మెడిసిన్ గాని మిగిలిన మూడు, నాలుగు స్పెషాలిటీస్ కి సంబంధించి ఏదైతే ఉన్నాయో అవి రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అనపర్తి వారు, అదేవిధంగా ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో మిగిలిన టెస్టు కార్యక్రమాన్ని అందించడం జరిగిందని వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.అదేవిధంగా మూలారెడ్డి పేరు మీదుగా స్మారక పురస్కారాలు భారతీయ సనాతన సంస్కృతిని కాపాడడం కోసం కృషి చేస్తున్న భారతీయం సత్యవాణికి, అదేవిధంగా తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ గుడిమెట్ల రామచంద్రరెడ్డి చేసిన పరిశోధనలు గాని,వారు రాసిన వ్యాసాలు గాని ఇతర దేశాల్లో కూడా కంటి వైద్యానికి సంబంధించి పెద్ద ఎత్తున అక్కడ ప్రభుత్వాలు అక్కడ వాటిని అవలంబిస్తున్న నేపథ్యంలో అటువంటి మహోన్నత వ్యక్తులను సత్కరించి,ఈ పురస్కారాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు కిరణ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రధానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ ఓటమి నాయకులు కార్యకర్తలు మూలారెడ్డి అభిమానులు పాల్గొన్నారు

# సత్యదేవుని అన్నదానం ట్రస్టుకి విరాళం..



**అన్నవరం జూలై 2 (ప్రభాతవార్త),** హైదరాబాద్ వాస్తవ్యులు దాసరి మోహన్ రెడ్డి తమ కుమారుడు దాసరి లోక్ ఆర్యనాద్ పేరుమీద శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,101లను విరాళంగా అంద జేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం కార్యనిర్వ హణాధికారి నల్లం సూర్య చక్రధరరావుకు అందించారు. అక్టోబర్ 29వ తేదీన స్వామి వారి సన్నిధిలో భక్తులకు అన్నదానం నిర్వహించాలని దాతలు తమ కోరికను ఈఓకు తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఈఓ నల్లం సూర్యచక్రధరరావు శాలువాతో సత్కరించి, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దేవస్థానం అధికారులు కూడా దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా
## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**కాకినాడ రూరల్, ఆగస్ట్ 2 (ప్రభాతవార్త):** అనారోగ్యంతో కోలుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం భరోసాగా నిలుస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. ఆదివారం గోడారిగుంట ఎమ్మెల్యే స్వగృహం వద్ద కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 16 చెక్కులు,1 ఎల్వోసీతో కలిపి అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంతం నానాజీ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకురూ 21,22,047 విలువైన చెక్కులను అందజేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రాష్ట్రంలోముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన చేస్తున్నారన్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం 136 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కరెడ్ల గోవింద్, తాటికాయల వీరబాబు, మాదారపు తాతాజీ, దొడ్డిపట్ల అప్పారావు, గొల్లపల్లి బాబీ, గొల్లపల్లి నాగేశ్వరరావు, తోటకూర సతీష్, సంతోష్, విరమళ్ళ బాబీ, అడపా కృష్ణ, ముమ్మిడి బుజ్జి, నున్న గణేష్ నాయుడుతదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించిన జెసి

**చింతూరు ఐ.టి.డి. ఏ.పి.ఓ.**







**చింతూరు అగస్టు 2 ప్రభాత వార్త.** పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొఖ్వాల్ ఆదివారం వి.ఆర్. పురం,కూనవరం మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి సహాయక చర్యల పర్యవేక్షించారు. చింతూరు రోడ్డు మార్గంలో కూనవరం మండలం పంద్రాజుపల్లి వరకు చేరుకున్నారు.అక్కడ రహదారి నీట మునిగి ఉండటంతో అక్కడ చౌక దుకాణంలో నిత్యావసరాల పంపిణీ పరిశీలించారు. వరదల నేపథ్యంలో ఆగస్టు,సెప్టెంబర్ లకు చెందిన రేషన్ బియ్యం కూడా ముందుగానే అందజేస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం అధికారులు నాటు పడవలో ధర్మళ్ళగూడెం గ్రామానికి చేరుకుని అక్కడి వరద పరిస్థితులను పరిశీలించారు.అక్కడ నుండి వి.ఆర్.పురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించిన అధికారులు, వడ్డిగూడెం మరియు వడ్డిగూడెం కాలనీ గ్రామాల నుండి తరలించిన వరద బాధితులకు కల్పిస్తున్న వసతి, తాగునీరు, పారిశుధ్యం, వండిన ఆహారం నాణ్యతను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పునరావాస కేంద్రంలోని గదులను పరిశీలించడంతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి మందుల లభ్యతను తనిఖీ చేశారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వడ్డిగూడెం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరదల అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించే ఉద్దేశంతో జాయింట్ ప్రశాంత్ కుమార్ , మరియు ప్రాజెక్టు అధికారి శుభం నోఖ్వాల్, వరద ప్రభావిత కుటుంబాలకు దోమతెరలను పంపిణీ చేశారు. దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం వరద బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. వరద నీరు పూర్తిగా తగ్గిన వెంటనే వడ్డిగూడెం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, బ్లీచింగ్, ఫాగింగ్, తాగునీటి వనరుల శుద్ధి వంటి కార్యక్రమాలను వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామస్థులు గత సంవత్సరం కంట్రీ బోటు చార్జీల బకాయిలు, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ గృహ నిర్మాణాలు, ఫేజ్--1బి పునరావాస పథకాలలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల సమస్యలు, గత సంవత్సరం వరద ఆర్థిక సహాయం మరియు వరద బాధిత కుటుంబాలకు 25 కిలోల అదనపు బియ్యం పంపిణీ అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ శ గత సంవత్సరం కంట్రీ బోటు చార్జీల బకాయిలలో సగం మొత్తాన్ని సోమవారం మధ్యాహ్నంలోపు వి.ఆర్.పురం తహసీల్దార్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ గృహ నిర్మాణాల ఆలస్యానికి గల కారణాలను సంబంధిత లబ్ధిదారులకు తెలియజేసి, సమస్య పరిష్కారానికి త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులు ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి, వరదల సమయంలో మరియు వరదలు తగ్గిన అనంతరం చేపట్టాల్సిన సహాయక చర్యలు, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి భద్రత, ఆరోగ్య సేవలు, దోమల నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రత్యేక వరద అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వి.ఆర్.పురం యూనిట్--1, వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కూనవరం యూనిట్--2, ఆంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సరస్వతి, తహసీల్దార్, వి.ఆర్.పురం మండలం, ఇమ్మాన్యుయేల్, ఎంపీడీవో, వి.ఆర్.పురం, రామకృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వి.ఆర్.పురం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారిక జి.ఓ.విడుదల పై అగ్నికుల క్షత్రియుల హర్షం.



**తాళ్ళరేవు, ఆగస్టు 2 (ప్రభాతవార్త);** విద్యాదాత, అగ్నికుల క్షత్రియుల కు గుర్తింపు తెచ్చిన పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల అగ్నికుల క్షత్రియ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన అగ్నికుల క్షత్రియ సంఘాల ప్రతినిధులు ఆదివారం సమావేశమై ప్రభుత్వం నిర్ణయం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావు చిత్రపటాలకు పాలతో అభిషేకం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘాల ప్రతినిధులు బొడ్డు సత్యనారాయణ, పెసింగి ఈశ్వరరావు, పట్టా ఆదినారాయణ వర్మ, వైదాడి నూకరాజు, బర్రె లక్ష్మీనరసింహారాజు, మల్లాడి రాధాకృష్ణ, ఓలేటి బంగారరాజు, పెసింగి నాగబాబు, గాడిమొగ, లక్ష్మీపతిపురం, చిన్న వలసల చిన్న బొడ్డు వెంకటాయపాలెం, పెదబొడ్డు వెంకటయ్య పాలెం, కోరంగి గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా గిరిజనులకు తప్పని రహదారి కష్టాలు..



**రాజవొమ్మంగి, అగస్టు 02, ప్రభాతవార్త** ప్రభుత్వాలు మారినా గిరిజనులకు రహదారి కష్టాలు తీరడం లేదు. వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుందని గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు. రాత్రి వేళల్లో వైద్యసేవలకు రావాలంటే ప్రాణాలకు భరోసాలేని పరిస్థితి ఉంది. గత నెల 25 తేదీన చికిలింత పంచాయతీ వెంకనగరం గ్రామానికి గిరిజన విద్యార్థినికాకూరి అంజలీదేవి (11)సం. ప్రాణాపాయ పరిస్థితిలో జడ్డంగి ఆసుపత్రికి తీసుకొని వచ్చేసరికి చనిపోయింది. రహదారి సమస్య కారణమని గిరిజనులు ఆరోపిస్తున్నారు. జడ్డంగి గ్రామం నుండి వనకరాయి మీదుగా వెంకటనగరం, కరుదేవపాలెం వరకూ రహదారి అత్యవసరం. అమీనాబాద్, చికిలింత, వంచంగి, మారేడుబాక పంచాయితీలకు చెందిన 20 గ్రామాల వారు జడ్డంగి జాతీయ రహదారికి రావడానికి తక్కువ సమయంలో చేరుకోవచ్చు. జడ్డంగి ఆర్ అండ్ బి రహదారి నుండి వనకరాయి గ్రామం వరకూ గత ప్రభుత్వంలో పంచాయితీరాజ్ ప్రాజెక్ట్ విభాగం ద్వారా రోడ్డు పనులను ప్రారంబించి ఆగిపోవడం జరిగింది. ఈ ప్రభుత్వంలో కరుదేవపాలెం నుండి లోతావారివీధి వరకూ ప్రధాన మంత్రి జన్మన్ గ్రామసడక్ యోజన పథకంలో 1,750కి. మీ రహదారి పనులు జరుగుతున్నాయి. పంచాయితీరాజ్ ప్రాజెక్ట్ విభాగం ద్వారా రూ. 1.39 కోట్లు నిధులతో 840 మీటర్లు సీసీ రోడ్డు, 910 మీటర్లు తారురోడ్డు ( బి. టి ) రోడ్డు చేయాల్సి ఉంది. సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. జడ్డంగి నుండి లోతావారి వీధి వరకూ రోడ్డు వేయాల్సి ఉంది. ఈ రహదారి ఆదారంగా గిరిజన గ్రామాలతో బాటు పి. వి. టి. జి. గ్రామాలు కూడా ఉన్నాయి. రహదారి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిలను కోరుతున్నారు.

# గోదావరి ఉగ్రరూపం..

- ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు
- 14.90 అడుగులకు నీటిమట్టం
- 14.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం
- కోనసీమలో లంక గ్రామాలకు తెగిన రాకపోకలు



**రాజమహేంద్రవరంఅర్బన్,ఆగస్టు 2 (ప్రభాతవార్త)** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం నుంచి ధవళేశ్వరం వరకు వరద ఉద్ధృతి కొనసాగుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా, ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 14.90 అడుగులకు చేరుకుంది. బ్యారేజీ నుంచి 14.52 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశాలు ఉండటంతో తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముంపు ముప్పు ఉన్న గ్రామాల్లో ప్రత్యేక బృందాలను మోహరించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను దశలవారీగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలను అధికారులు కల్పిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ, గోదావరి గట్టులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. ఎవరూ గోదావరిలో స్నానాలు చేయవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని, వరద నీటిని చూసేందుకు నది ఒడ్డుకు చేరుకోవద్దని హెచ్చరిస్తున్నారు. చిన్నారులను నీటి సమీపానికి వెళ్లనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**కోనసీమలో తీవ్ర ప్రభావం**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి నదీ పాయలైన గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ట, వైనతేయ నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. దీంతో పలు లంక గ్రామాలు వరద నీటితో చుట్టుముట్టబడ్డాయి. ముక్తేశ్వరం సమీపంలోని తొగరుపాయ--ఎదురుబిడియం కాజ్‌వే పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చాకలిపాలెం సమీపంలోని కనకాయలంక కాజ్‌వే కూడా వరద ప్రవాహంలో మునిగిపోవడంతో రవాణా పూర్తిగా స్తంభించింది. బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడుముడి లంక, జి.పెదపూడి లంక, ఆనగాల లంక, పెదమల లంక, అయోధ్య లంక, మర్రిమూల గ్రామాలకు రోడ్డు మార్గం ద్వారా వెళ్లే అవకాశం లేకుండా పోయింది.

**పడవలే ఆధారం**

లంక గ్రామాల ప్రజలు ప్రస్తుతం అత్యవసర అవసరాల కోసం పడవల ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని వైద్యశాలలకు తరలించేందుకు కూడా అధికారులు ప్రత్యేక పడవలను వినియోగిస్తున్నారు.

**అధికారుల అప్రమత్తత**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. పరిస్థితిని గంట గంటకూ సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజలకు సూచనలు**

వరద నీటిలోకి వెళ్లకూడదని, కాజ్‌వేలు, వంతెనలు దాటేందుకు ప్రయత్నించవద్దని, విద్యుత్ తీగలు, చెట్లు, నీట మునిగిన రహదారులకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక రెవెన్యూ, పోలీసు లేదా విపత్తు నిర్వహణ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గోదావరి వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో పరిస్థితిని బట్టి మరిన్ని సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

# ఇఇ రామకృష్ణారెడ్డి కి ఘనంగా వీడ్కోలు.




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు2,ప్రభాతవార్త.** పంచాయతీ రాజ్ డివిజన్ ఆఫీస్ ఆవరణలో ఇటీవల ఎస్ఈ గా పదోన్నతి పై కాకినాడ వెళ్లిన కార్య నిర్వాహక ఇంజనీర్ పులి రామకృష్ణ రెడ్డి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్ లు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారిని స్థానిక పిఆర్ గెస్ట్ హౌస్ నుండి సతీ సమేతంగా పూర్ణ కుంభ స్వాగతం పలికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం కు పూలమాల వేసి సభాప్రాంగణం కు జిల్లా ఆఫీసర్స్ తోడ్కొని వచ్చారు.రామకృష్ణ రెడ్డి కోనసీమ ప్రజలు మా రాయలసీమ నుండి వచ్చిన తనని ఆప్యాయత గా చూసుకో వడం జీవితం లో మధుర గట్టం గా పేర్కొన్నారు డిఆర్వో మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే కన్స్టిట్యూన్సీ కి ఎస్ఇ గా వెళ్లడం ఆయన పని నిబద్ధత కు కొలమానం అన్నారు.డిఎస్పీ శ్రీనివాస్ తమ నూతన భవనం సుందరం గా తీర్చి దిద్దారు అని తెలిపారు. ఆర్డీవో,కలెక్టర్ మన్న నలు పొందిన ఆఫీసర్ అని కొనియాడారు.డిప్యూటీ ఇఇ అన్యం రాంబాబు మాట్లాడుతూ కాయిర్ టెక్నాలజీ తో కోనసీమ రోడ్స్ కు కలెక్టర్ సూచనలతో కోనసీమ అభివృద్ధి కి మూలం అన్నారు.. ఈ కార్యక్రమం లో నూతన ఇఇ సీతం నాయుడు, కాకినాడ ఇఇ లు రఘురామ రెడ్డి, సీతయ్య కాంట్రాక్టర్ అల్లాడి రమణ,శ్రీనివాస్, డియిఇ లు ఇంజనీరింగ్ నాన్ ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్ లు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి సంక్షేమం కుటమితోనే సాధ్యం
# సొసైటీ చైర్మన్ కృష్ణమూర్తి



**శంఖవరం ఆగస్టు 2 ప్రభాతవార్త** ప్రతి కుటుంబానికి అభివృద్ధి సంక్షేమం అందిస్తూ, ప్రజలతో ప్రత్యక్షంగా కూటమి ప్రభుత్వంమే మమేకమవుతుందని కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి పేర్కొన్నారు .కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ ఆదేశాల మేరకు రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ ఆధ్వర్యంలో మండలంలోని కత్తిపూడి 15, 16వ వార్డులో పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ నిర్ణయాలను స్థానిక ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లగా పాలన అందిస్తుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని, ప్రభుత్వం ప్రజల మధ్య మరింత విశ్వాసాన్ని పెంపొందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి, సంక్షేమం చేరేలా చంద్రబాబు నాయకత్వంలో పాలన అందించడం జరుగుతుందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఎమ్మెల్యే సత్య ప్రభ ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కత్తిపూడి టిడిపి టౌన్ అధ్యక్షులు కేలంగి జనార్ధన్, మండల యూత్ ప్రెసిడెంట్ గాబు శివ ,టిడిపి నేత కంద గోవిందు తదితరులు పాల్గొన్నారు.


ప్రభాత వార్త

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను**

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెటవర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గల వారికి న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది."

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్, డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు**

రాజానగరం, రంగంపేట, రాయవరం, మండపేట, కోరుకొండ, కొవ్వూరు, నిడదవోలు, తాళ్ళపూడి, ఉండ్రాజవరం, నల్లజర్ల, రాజమహేంద్రవరం

ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.

'వార్త' యూనిట్ కేంద్రం, రాజమహేంద్రవరం

వివరములకు: 9666685998, 8096661682 నెంబర్లను సంప్రదించగలరు

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బండారు



రావులపాలెం, ఆగస్ట్ 02 (ప్రభాతవార్త): పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండల పరిధిలోని పొదలాడ, ..., లక్ష్మీపోలవరం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన 'రెండేళ్ల అభివృద్ధి..సమ్మతం..సంక్షేమం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. సామాజిక భద్రతా పింఛన్ల పెంపు, తల్లికి వందనం, దీపం 2, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా వివిధ వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. పేదల కోసం అన్న క్యాంటీన్లను విస్తరిస్తున్నామని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఎల్నినో ప్రభావం దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) చేయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ విషయంలో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని సూచించారు.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అమరావతి ఛాంపియన్ నియోజకవర్గ స్థాయి ఎంపికలు

అడ్డతీగల,ఆగస్టు 02, ప్రభాతవార్త అడ్డతీగల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, గిరిజన సంక్షేమ, గురుకుల,కస్తూర్బా, మోడల్ స్కూల్తో పాటు అన్ని విద్యాసంస్థలకు చెందిన అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడ్డతీగల మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బి. మల్లేశ్వరావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'అమరావతి ఛాంపియన్' కార్యక్రమం యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. అండర్-17,అండర్-23 విభాగాలకు చెందిన బాలురు, బాలికలు నిర్వాహకులు అందించిన క్యూఆర్ కోడ్ ద్వారా తప్పనిసరిగా ముందస్తు నమోదు చేసుకుని, ఈ నెల 4వ తేదీన రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులకు తదుపరి దశల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.క్రీడలపై ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ప్రతిభను నిరూపించుకోవాలని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ప్రోత్సహించి పెద్ద సంఖ్యలో ఎంపికలకు పంపించాలని బి. మల్లేశ్వరావు విజ్ఞప్తి చేశారు.

## అధికారులతో సమీక్షించి ముందస్తు చర్యలకు ఆదేశాలు..

**జిల్లా జాయింట్ కలెక్టర్ వైభోమ్ నైదయా దేవి.**



మామిడికుదురు.ఆగస్టు 02(ప్రభాతవార్త) జిల్లాలో వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైభోమ్ నైదయా దేవి అధికారులను ఆదేశించారు. మామిడికుదురు మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని వరద ముంపు పరిస్థితులు, నీటి ప్రవాహం,లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు సూచించారు. నీటి మట్టం పెరుగుతున్న తీరు, వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి విషమిస్తే ప్రజలను అప్రమత్తం చేసి, అవసరమైన సమయంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వరదల సమయంలో ప్రజలకు తాగునీరు, విద్యుత్, వైద్యం, పారిశుద్ధ్యం, రవాణా వంటి మౌలిక సదుపాయాలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట మామిడి కుదురు తహసీల్దార్ సి ఎస్ రాజు,ఎంపీడీవో జి.భవాని జిల్లా అధికారులు, మండల అధికారులు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## గోదావరి ఉధృతి.. అప్పనపల్లి ప్రధాన రహదారిజలమయం-రాకపోకలు బంద్



మామిడికుదురు. ఆగస్టు02 (ప్రభాతవార్త) గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరద నీరు పోటెత్తింది. పాశర్లపూడి కరకట్ట దిగువ భాగంలో ఉన్న అప్పనపల్లి కాజ్వే వద్ద ప్రధాన రహదారి పూర్తిగా జలమయమైంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ దారిలో వాహనాల రాకపోకలపై అధికారులు పూర్తిగా నిషేధం విధించారు.దీని ప్రభావంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక వంటి గ్రామాలకు భారీ వాహనాల రవాణా నిలిచిపోయింది. అప్పనపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను కూడా రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు మాత్రమే ప్రత్యామ్నాయ మార్గాల్లో ... కొంతమంది ... పడవలపై ... వస్తున్నారు. ఈ వరద పరిస్థితిని ... అధికారులు ... ముందస్తు ... అప్పనపల్లిలోని శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు తీవ్ర అవస్థలు పడుతూ ... పోలీసులు ... ... ... లంక గ్రామాల్లో ... పరిస్థితిని సమీక్షించారు.

**లిస్నేహితుల దినోత్సవం రోజున మొక్కలు నాటి వినూత్నంగా వేడుకలు జరుపుకున్న మిత్రులు.**



గండేపల్లి. ఆగస్టు 2. ప్రభాతవార్త మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో ది. 02-8-2026 మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని ... ఆదిత్య విద్యాసంస్థల ఎస్టేట్ మేనేజర్ ... ... ... ... స్నేహితుల దినోత్సవ ... మొక్కలు నాటి ... ... ... ... ... పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా అనుమతులు ఇవ్వండి



యానాం, ఆగస్టు 02: (ప్రభాతవార్త) ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు ... లో భాగంగా ... సంస్థ వారు గోపాల్‌నగర్ ప్రాంతంలో గ్యాస్ పైప్‌లైన్ గతంలో వేసివున్నారు. దానికి సంబంధిత అనుమతుల కోసం సంస్థ ప్రతినిధులు యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయానికి విచ్చేశారు. ... ఈ సందర్భంగా మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ, 2006లో జరిగిన ఒప్పందం ప్రకారం యానాంలో రెసిడెంటిల్, కమర్షియల్ ,మరియు ఇతర వినియోగదారులకు పరిసర ప్రాంతాల కంటే రాయితీ ధరలతో గ్యాస్ అందించే విధంగా అగ్రిమెంట్ ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని భారత ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్లామని, యానాం ప్రజలకు సాధ్యమైనంత వరకు గ్యాస్ ధరను తగ్గించి అందించాలని కోరినట్లు చెప్పారు. పక్క ప్రాంతాల్లో ఏ ధరకు ఇస్తున్నామో అదే ధరకు యానాంలో కూడా ఇస్తాం అనే ప్రతిపాదనను అంగీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే గ్యాస్ కనెక్షన్ కోసం రూ.10,000 డిపాజిట్ చెల్లించాలని సంస్థ అధికారులు పేర్కొనగా, యానాం ప్రజలకు డిపాజిట్ లేకుండానే కనెక్షన్ ఇవ్వడంతో పాటు, గ్యాస్ ధరను కూడా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గారు సూచించారు. ... సంస్థ అధికారులు తమ ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తెలియజేస్తామని చెప్పారు. ... ప్రాంతీయ పరిపాలనాధికారికి సూచించారు. యానాం ప్రజలకు డిపాజిట్ భారం లేకుండా, తక్కువ ధరలో గ్యాస్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రజాప్రతినిధిగా తాను కృషి చేస్తున్నట్లు మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు.

## మై భారత్, కాకినాడ జ ఆధ్వర్యంలో "నషా ముక్త్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" ఘనంగా నిర్వహణ ,



గండేపల్లి. ఆగస్టు 2. ప్రభాతవార్త మై భారత్, కాకినాడ ఆధ్వర్యంలో "నషా ముక్త్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమం ఆదిత్య యూనివర్సిటీ సూరంపాలెం కాకినాడ లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువతను ఉద్దేశించి వర్చువల్ విధానంలో ప్రసంగించారు. మాదక ద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రతి యువకుడు "నషా ముక్త్ భారత్ -- వికసిత్ భారత్" నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ గారు అపూర్వ భరత్ గారు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి యువకుడు తన వంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబాలు, స్నేహితులు మరియు సమాజంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించే దూతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా. ఎన్ . సతీష్ రెడ్డి గారు పాల్గొని, యువత తమ శక్తి, ప్రతిభను దేశాభివృద్ధికి వినియోగిస్తూ మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలను ప్రతిబింబించే నుక్కడ్ నాటక్ ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింపజేశారు. అనంతరం ప్రధాన మంత్రి సందేశాన్ని వీక్షించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజంలో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు సంకల్పం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా డీజ?బులిట్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, కాకినాడ ఈగల్ టీమ్ సి ఐ.జి. వేంకటేశ్వరరావు, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం .శ్రీనివాస్ రెడ్డి,డీన్ స్టూడెంట్ ఆక్టివిటీస్ డా. డి .కిషోర్ పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని మై భారత్ జిల్లా యువజన అధికారి శ్రీ తిర్రి గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ మై భారత్ సిబ్బంది, ఎం ప్రకాష్, జి భవాని మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మోదీ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తాటిపాక మధు**



పిఠాపురం, ఆగస్టు 2 (ప్రభాతవార్త) దేశంలో 12 ఏళ్ల కాలంలో ప్రశాంత పాలన పోయి సుశాంత్ పాలన సాగుతుందని," మోదీ పాలన పోవాలి మార్పు" రావాలని సెప్టెంబర్ ఒకటో తేదీన సిపిఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం పిఠాపురం పట్టణ కార్యదర్శి సాకా రామకృష్ణ మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో గోడపత్రిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తాటిపాక మధు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కర్షకులు, కార్మికులు,మధ్యతరగతి ప్రజల జీవనం ఇబ్బందిగా మారిందని మోడీ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువులు, పెట్రోల్, విద్యుత్ చార్జీలు అదుపు లేకుండా పెంచేసారని ఆయన ధ్వజమెత్తారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారా దత్తం చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. నీట్ పేపర్ లీక్ ఉద్యమంలో పోలీసులను అడ్డం పెట్టుకుని విద్యార్థులపై బాష్ప వాయువు ప్రయోగించడం,గన్ ఫైర్ చేయడం,కర్రలకు మేకులు కొట్టి విద్యార్థులపై దాడి చేయడం, సరికాదన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనివాసరావు ఏడిద నల్లబ్బాయి మేడు ఏసుబాబు ఎం నాగేశ్వరరావు ఎం లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## పిడి యువరాజారెడ్డికి పుత్రవియోగం




పెదపూడి,ఆగస్టు 02 , ప్రభాతవార్త: పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారంపూడి యువరాజారెడ్డి ముద్దుల కుమారుడు ద్వారంపూడి కృష్ణారెడ్డి(కిట్టు) (17)ఆకస్మికంగా మృతిచెందారు. అందరి తలతోనాలుకలా మెలిగే కిట్టు ఆకస్మిక మరణంతో గొల్లలమామిడాడ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కిట్టు ఆకస్మిక మృతి పట్ల మాజి జడ్పిటిసి సత్తి భగవాన్ రెడ్డి, మేడపాటి సాయిబాబారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి(చింతపండు), కర్రి రామకృష్ణారెడ్డి, ద్వారంపూడి బంగార్రెడ్డి,ద్వారంపూడి వీర్రాఘవరెడ్డి(ఐస్ బుజ్జి), నల్లమిల్లి భూలోక రెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి,వ్యాయామ ఉపాధ్యాయ, ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేశారు

## పండ్లతో పల్లాలమ్మ తల్లికి విశేషాలంకరణ



కొత్తపేట, ఆగస్టు02 (ప్రభాతవార్త) ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సంతాన ప్రదాయని శ్రీ పల్లాలమ్మ తల్లిని వివిద రకాల పండ్లతో విశేషంగా అలంకరించారు దేవస్థానం చైర్మన్ మద్దింశెట్టి ఆదినారాయణ ఆలయ కార్యనిర్వాహణాధికారి సలాది సత్య మహేంద్ర ఆధ్వర్యంలో అమ్మవారిని మార్కెట్లో లభించే అనాస పండ్లు అరటి పండ్లు బత్తాయి పండ్లు నారింజ పండ్లు దానిమ్మ పండ్లు యాపిల్ పండ్లు జామ పండ్లు ద్రాక్ష పండ్లు తదితర పండ్లు తో నునైనానందకరంగా అలంకరించారు ఆషాడ మాసం ఆదివారం కావడంతో వానపల్లి పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలు అత్యధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని చూసి తరించారు తీర్ధ ప్రసాదములు స్వీకరించారు

## నేడు పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్



పిఠాపురం, ఆగస్టు 2 ( ప్రభాతవార్త ) పిఠాపురం పాత బస్టాండ్ దగ్గర గల పాడా కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం వేదిక ( పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్టు పాడా పీడి, ఎన్.వి శివరామ ప్రసాద్ తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ మండల స్థాయి అధికారులంతా నిర్ణీత సమయానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి...

**నిత్యాన్న పథకానికి రూ ,20.232/విరాళం..**



ఆత్రేయపురం, ఆగస్టు, 02 (ప్రభాత వార్త) అతి పురాతన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి,గోపాల స్వామి వారి ఆలయం ఆదివారం భక్తుల తాకిడికి ఆలయ పరిసరాలు సందడిగా మారింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్ చెందిన కలిదిండి వినయ్ బాలరామరాజు, రమ్యలహరి దంపతులు శ్రీ స్వామివారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ10,116/- వేలు, తిరుపతి చెందిన జి.వి. సదాశివుడు దంపతులు శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ10,116/- వేలు విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తులు శ్రీ స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.8 లక్షల విరాళం



యానాం, ఆగస్టు 02: (ప్రభాతవార్త) యానం: శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు, వ్యాపారవేత్తలు ఉదారంగా విరాళాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా యానంలోని ఎస్ఎల్ఎస్ వైన్స్ యజమానులు దవులూరి సోమశేఖర్ రావు, దవులూరి వెంకన్నబాబు, నరహరిశెట్టి వీరబాబు, దంగుడుబియ్యం శివ, దంగుడుబియ్యం వాసు సంయుక్తంగా ఆలయ పునర్నిర్మాణం కోసం రూ. 5 లక్షల చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.అదేవిధంగా టచ్ హైవే బార్ యజమానులు కూడా సంయుక్తంగా రూ. 3 లక్షల విరాళాన్ని ఆలయ పునర్నిర్మాణ నిధికి అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి మరిన్ని దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




గండేపల్లి. ఆగస్టు 2. ప్రభాతవార్త 21 ఏళ్ల తర్వాత వాళ్లంతా కలుసుకున్నారు.కష్ట సుఖాలు తెలుసుకుని,ఒకరి యోగ క్షేమాలు మరొకరు తెలుసుకుని, కన్నీటి పర్యంతమయ్యారు. అలనాటి మధురస్మృతుల జ్ఞాపకం చేసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చెప్పిన పాఠాలు నీతి బోధనలు మరొక్కసారి స్మరణకు తెచ్చుకుంటూ ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గండేపల్లి మండలం మురారి ఉన్నత పాఠశాలలో 2005 -06 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుని వారి ప్రస్తుత ప్రవర్తనను తెలియజేసుకున్నారు.

## భక్త జనసంద్రం... లోవక్షేత్రం...

**శాకాంబరీ అలంకరణలో దర్శనమిచ్చిన లోవ శ్రీ తలుపులమ్మ అమ్మవారు**

**ఆషాడమాసం ఆదివారం భక్తుల రద్దీ**



తుని, ఆగష్టు 2,( ప్రభాతవార్త ) ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తుని మండలం లోవ శ్రీ తలుపులమ్మ అమ్మవారి ఆషాడ మాస ఉత్సవాలను పురస్కరించుకుని లోవ దేవస్థానం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. వేకువ జాము నుండే అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. అమ్మవారి ఉత్సవాలలో భాగంగా అర్చక స్వాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలు రకాల కూరగాయలతో శ్రీ తలుపులమ్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈవో పెనుమత్స విశ్వనాథరాజు, ధర్మకర్తల మండలి చైర్మన్ పెంటకోట భాస్కర సత్యనారాయణ మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజు సుమారు 65,000 మంది భక్తులు అమ్మవారిని దర్శించారన్నారు. కాటేజీలు, వాహన పూజలు, దర్శన టికెట్లు, ప్రసాదం తదితర విభాగాల ద్వారా 17 లక్షల40 వేల610 రూపాయల ఆదాయం దేవస్థానానికి సమకూరినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో, చైర్మన్ పర్యవేక్షణలో దేవస్థాన సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల వాహన రద్దీని దృష్టిలో పెట్టుకుని తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై కృష్ణమాచారి పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు.

## తోకలంక వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



రావులపాలెం, ఆగస్టు 02 (ప్రభాతవార్త) : కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.వి సత్యనారాయణ ఆదివారం రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలోని తోకలంక వరద ముంపు ప్రాంతాన్ని సందర్శించారు. తహసీల్దార్ బి ఎమ్ ముక్తేశ్వరరావు తో కలిసి ముంపు ప్రభావిత ప్రాంతాలను అక్కడి పరిస్థితులను పరిశీలించారు. వరద పరిస్థితులు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఆర్డీవో జి.వి.వి సత్యనారాయణ ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి ఆర్థిక సహాయం.



మామిడి కుదురు. ఆగస్టు02(ప్రభాతవార్త) మండల శెట్టిబలిజ సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మామిడికుదురు మండల శెట్టిబలిజ సేవా సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ తెలిపారు.ఇటీవల మాకనపాలెం గ్రామానికి చెందిన చెల్లింగి భవాని మనవడు తులసి గణేష్ బైక్ ప్రమాదంలో తల,మెడ నరాలకు పెద్ద గాయాలు అవడం వలన నడవలేని స్థితిలో ఉన్నాడు.బాధితునికి మెరుగైన వైద్య సేవలు అందించే నిమిత్తం మాకనపాలెం సీతారామలయ యువజన సంఘం రూ. 63,500 మరియు మామిడికుదురు మండలం శెట్టిబలిజ సంఘం 41,500 కలిపి మొత్తం రూ.1,05,000 లను ఆదివారం సంఘ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు అందించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కుడుపూడి ఏకాంబరీశ్వరావు, తాలూకా ట్రెజరర్ బొక్కా వెంకటేశ్వరావు,నయనాల రామకృష్ణ, సంఘం ట్రెజరర్ పెచ్చెట్టి సత్య చంద్ర,వాసంశెట్టి రామకృష్ణ,పాటి గోవిందు,చెల్లింగి శ్రీనివాస్,యాండ్ర వీరబాబు,మొల్లేటి చక్రపాణి ,చెల్లింగి రామకృష్ణ,చిట్టూరి గశ్వరరావు, అప్పారి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అమ్మవార్లకు 'ఆషాఢ సారె' సమర్పణ



మామిడికుదురు.ఆగస్టు 02(ప్రభాతవార్త) పవిత్ర ఆషాఢ మాసం సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం నాడు గ్రామ దేవతల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఆలయాల్లోని అమ్మవార్లను 'శాకంభరి'గా (వివిధ రకాల కూరగాయలతో) విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు సాంప్రదాయబద్ధంగా 'ఆషాఢ సారె'ను సమర్పించారు.మండలంలోని వివిధ గ్రామ దేవతలైన మామిడికుదురు నూకాలమ్మమొగలికుదురు శ్రీ పళ్లాలమ్మ, మాకనపాలెం శ్రీపొల్లమ్మ,పెదపట్నం లంక బొక్కావారిపాలెం శ్రీ మహాలక్ష్మమ్మ, లూటుకుర్రు శ్రీపొల్లమ్మ అమ్మవార్ల ఆలయాల్లో సాంప్రదాయ గరగ నృత్యాలు,మంగళ వాయిద్యాలు, మేళతాళాలు మరియు భక్తుల జయజయధ్వానాల నడుమ భారీ ఊరేగింపులను నిర్వహించారు.ఈ వేడుకల్లో అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వారు పసుపు వస్త్రాలు ధరించి, తమ నెత్తిన వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు, చలిమిడి మరియు పానకాలను మోస్తూ ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం వాటన్నింటినీ భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## కలర్ బెల్ట్ టెస్ట్ లో పాల్గొన్న తైక్వాండో విద్యార్థులు..



అంబాజీపేట, ఆగస్టు 2,(ప్రభాతవార్త): అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ కోచ్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన కలర్ బెల్ట్ టెస్టులో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన కలర్ బెల్ట్ టెస్ట్ కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టైక్వాండో సెక్రెటరీ,ఒలింపిక్ రిఫరీ బి.అర్జునరావు న్యాయ నిర్ణీతగా వ్యవహరించారు. ఈ ఎంపికలో అంబాజీపేట, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు, ముంగండ ప్రాంతాల నుండి సుమారు 120 మంది టైక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్లో, ఎల్లో 1, గ్రీన్, గ్రీన్1, బ్లూ, బ్లూ1, రెడ్,రెడ్1 కు పలువురు విద్యార్థులు ఎంపిక చేశారు. అలాగే ఈ ఏడాది టైక్వాండో గేమ్ లో నేషనల్ లెవెల్ లో పాల్గొన్న అంబాజీపేటకు చెందిన కావ్యకు నేషనల్ రిఫరీ అర్జునరావు రూ.1000లు నగదును బహుమతిగా అందించి, టైక్వాండో లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు భూషణం, భార్గవి,కుసువీర్, కేవీ సత్యనారాయణ,హర్ష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి మెడల్స్ సాధించిన శివ కరాటే స్కూల్ విద్యార్థులు



తుని, ఆగష్టు 2,( ప్రభాతవార్త ) తుని పట్టణంలోని స్థానిక గణపతి నగర్ లో గల శివ కరాటే స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ కుర్రా శివకుమార్ మాట్లాడుతూ ఆదివారం విజయవాడలో మెరిసేస్ స్టెల్లా మోస్టీ స్టేడియం లో 23వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే శాంపియన్షిప్ నిర్వహించడం జరిగిందన్నారు. అందులో తుని శివ కరాటే స్కూల్ విద్యార్థులు పాల్గొనగా బాలికల అండర్ 11 ఇయర్స్ లో కె. యశస్వినీ గోల్డ్ మెడల్,కె. నక్షత్రం బ్రాంజ్ మెడల్, బాలుర అండర్ 8 ఇయర్స్ విభాగంలో .పి.రుష్విక్ వెంకట్ సాయి బ్రాంచ్ మెడల్ సాధించి విజేతలుగా నిలిచారన్నారు. వీరిని ఏపీ కరాటే చీఫ్ కీర్తన్ కొండూరి అభినందించారన్నారు. రాష్ట్రస్థాయి మెడల్ సాధించిన కరాటే స్కూల్ విద్యార్థులను, కోచ్ శివకుమార్ ని పలువురు అభినందించారు.

## మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు

**ఎమ్మెల్యే పంతం నానాజీ**



కాకినాడ రూరల్, ఆగస్ట్ 2 (ప్రభాతవార్త): రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదని, పోలీసుల ధైర్యాన్ని అణచివేసే శక్తుల పై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.ఇటీవల శ్రీకాకుళంలో మాజీ సీఎం జగన్ పర్యటనకు బందోబస్తు నిర్వహిస్తున్న మహిళ ఎస్సై ప్రవల్లిక పై వైసిపి మూకలు దాడిని ఖండిస్తూ, ఆదివారం సర్పవరం జంక్షన్ లో ఆమెకు సంఘీభావం తెలుపుతూ భారీ ఎత్తున కూటమి నాయకులతో కలిసి మానవహారం నిర్వహించారు. అనంతరం జనసైనికులు, వీర మహిళలతో ర్యాలీగా వెళ్లి సర్పవరం పోలీస్ స్టేషన్ కు చేరుకుని సి ఐ ప్రకాష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ఉన్న మహిళ ఎస్సై పై వైసిపి పార్టీ శ్రేణులు చేసిన దాడి సభ్యసమాజం తలదించుకునేలా ఉందని తక్షణం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నానాజీ కోరారు. సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై చేయి వేస్తే ఏ రాజకీయ రంగు నాయకులైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జనసేన పార్టీ వీర మహిళలు, కూటమి పార్టీ మహిళా నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కలకాలం నిలిచేది స్నేహమేరా... ఘనంగా స్నేహితుల దినోత్సవం.



తాళ్ళరేవు, ఆగస్టు 2 (ప్రభాతవార్త): ఆనాటి, ఆ స్నేహ, ఆనందగీతం ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం, అన్నాడు ఓ మహాకవి. జగత్తులో కలకాలం నిలిచేది స్నేహమేరా... అంటూ... చిన్ననాటి స్నేహితులు అంతా ఒకచోట చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండలంలో పలుచోట్ల పలువురు స్నేహితులు కలిసి ఆనందాలు పంచుకున్నారు. తాళ్లరేవు హై స్కూల్ లో చదివిన గోల్డెన్ గ్రూప్ 1985, 86 బ్యాచ్ ఫ్రెండ్షిప్ డేను స్థానిక లయన్స్ క్లబ్ లో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిపారు.1989,90 బ్యాచ్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు తాము చదివిన తరగతి గదిలో కూర్చుని మళ్లీ పాటలు చెప్పమని ఈనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.


## గరగలంపాలెంలో సేవా సందడి...

**400 మంది మహిళలకు కంబాల శ్రీనివాసరావు పట్టు చీరల పంపిణీ.**



గోకవరం ఆగస్టు 02: ప్రభాత వార్త కోరుకొండ మండలం గరగలంపాలెం గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన "కంబాల కానుక వనితల వేడుక" ఘనంగా జరిగింది. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలు పంపిణీ చేయడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగాగ్రామానికి విచ్చేసిన కంబాల శ్రీనివాసరావుకు మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, యువత, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలతో సత్కరించి ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం గ్రామంలోని ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, గ్రామ దేవతలకు తొలి చీరలను సమర్పించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను కులాలు, మతాల పేరుతో విభజించే ప్రయత్నం చేస్తున్నారని, తాను మాత్రం కులమతాలకు అతీతంగా అందరినీ కలుపుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. భారతదేశం విశ్వగురువుగా నిలవడానికి కారణం మన గొప్ప సంస్కృతి, సంప్రదాయాలేనని పేర్కొన్నారు. వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అన్ని మతాలు ఒకటే అనే భావనతో పరస్పర ప్రేమాభిమానాలతో కలిసిజీవించాలని పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమానికి హాజరై పట్టు చీరలను అందుకున్నారు. గ్రామంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని స్థానికులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, యువత, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జలదిగ్బంధంలో గ్రామాలు పల్లపు ప్రాంతాలు జలమయం



అయినవిల్లి ఆగస్టు 2 ప్రభాతవార్త గోదావరి ఉగ్రరు రూపం దాల్చడంతో బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలోని లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి పల్లపు ప్రాంతాలు జలమయం కాగా ముక్తేశ్వరం వద్ద కాజ్వే నీట మునగటంతో అయినవిల్లి లంక వీరవెల్లిపాలెం అద్దంకివారిలంక పల్లపులంక కొడుకులంక పొట్టిలంక గ్రామాల ప్రజలు పడవలపై వ్యవసాయ ఉత్పత్తులను నిత్యవసరాలను తరలిస్తున్నారు ఇప్పటికే పల్లపు ప్రాంతాల్లో వేసిన కాయగూర పంటలు పూర్తిగా దెబ్బతినిగా ఆదివారం సాయంత్రం నాటికి వరద పరిస్థితి నిలకడగా ఉన్నది రైతులు కొబ్బరి అరటి వ్యవసాయ ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతున్నారు

మరిన్ని వార్తలు 6లో


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


# రైతుల క్షేమం కోసమే పట్టాదారు పాస్ పుస్తకాలు

## ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అయినవిల్లి ఆగస్టు 2 ప్రభాతవార్త** రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారికి ఉపయోగపడే విధంగా పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ అన్నారు నేదునూరు గ్రామంలో పట్టారు పాసుబుక్కులు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతులపై ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా అనవసర భారం మోపిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి, "రైతే రాజు" అనే సంకల్పంతో రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రైతుల శ్రమ వల్లే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం అందజేస్తున్న పట్టాదార్ పాస్ పుస్తకాలు పూర్తి పారదర్శకతతో రూపొందించబడుతున్నాయని చెప్పారు. రైతుకు సంబంధించిన భూ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతు ఆమోదంతోనే పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్. సావరం గ్రామానికి చెందిన 222 మంది రైతులకు, అలాగే సిరిపల్లి గ్రామానికి చెందిన 769 మంది రైతులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వరద నీటిలో మునిగి పశువులు మృతి.



**చింతూరు ఆగస్టు 2 ప్రభాత వార్త.** గోదావరి, శబరినది వరదల వల్ల చింతూరు, విఆర్ పురం, కూనవరం మండలంలోని వరద ప్రభావిత గ్రామాల్లో అనేకమందికి చెందిన పశువులు, మేకలు వరద నీటిలో మునిగి మృతి చెందినట్లు సమాచారం అందింది. చింతూరు మండలం కుమ్మూరు గ్రామానికి చెందిన అనిగి లక్ష్మీయ్య కు చెందిన గిత్త తాటి గుంపు వద్ద వరద నీటిలో మునిగి మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు.

# కూనవరం మండలంలో వరద తగ్గుముఖం

**బయటపడుతున్న రహదారులు**

**- 5 పునరావాస కేంద్రాలలో 581 మంది బాధితులు**

**- వరద నుండి బయటపడుతున్న గృహాలు**



**కూనవరం, ఆగస్టు 2, ప్రభాతవార్త:** గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో రహదారులు వరద నీటి నుండి బయట పడుతున్నాయి. కూనవరం లో వరద 53 అడుగుల వరకు వచ్చి ఆదివారం ఉదయం నుండి వరద తగ్గుతూ రావడంతో రహదారులు బయటపడుతున్నాయి. కూనవరం నుండి వి ఆర్ పురం వెళ్లే రహదారి, పంద్రాజు పల్లి రహదారి, టేకుల బోరు వెళ్లే ప్రధాన రహదారి తదితర, కరకగూడెం వెళ్లే ప్రధాన రహదారి తదితర రహదారులు బయటపడ్డాయి. మండలంలో వరదలతో ముంపుకు గురైె గృహాలు ఒండ్రు మట్టి చేరడంతో యజమానులు మట్టిని తొలగించి శుభ్రపరచుకుంటున్నారు. వరద పట్టిన గృహాలను రెవెన్యూ అధికారి సర్వేలు నిర్వహిస్తున్నారు.ఇదిలా ఉండగా 581 మంది రెహబి లేషన్ సెంటర్లకు తరలించడం జరిగిందని అధికారికంగా తెలుస్తుంది. స్థానిక సచివాలయం, టేకులబోరు ఎంపీడీఓ కార్యాలయం, శబరి కొత్తగూడెం, తాళ్లగూడెం, బొజ్జరాయి గూడెం, గ్రామాలలో పునరావాస కేంద్రాలలో వరద బాధితులు తలదాచుకుంటున్నారు. వారికి భోజనం ఏర్పాటు చేయడం, వరద తగ్గుముఖం పట్టడంతో కొన్ని వీధులు బురదమయ్యాయి.

**అధికారుల పర్యటన..**

వరద ప్రభావిత గ్రామాలలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నోక్వాల్ పర్యటించారు. మండలంలోని పంద్రాజు పల్లి చౌక దుకాణాన్ని సందర్శించి వరద ప్రభావిత రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పంపిణీ ని పరిశీలించారు. వరదల కారణంగా ప్రజల ఇబ్బందులు పడకుండా ఆగస్టు నెలతో పాటు సెప్టెంబర్ నెల బియ్యాన్ని ముందస్తుగా పంపిణీ చేయాలని ఆదేశించారు. వీరి వెంట తహసిల్దార్ ధర్మేంద్ర, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేషెంట్‌కు పింఛను పంపిణీ..



**అంబాజీపేట,ఆగస్టు 2, (ప్రభాతవార్త):** ప్రభుత్వ అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ లో భాగంగా సుమారు 300 కిలోమీటర్లు ప్రయాణించి ఆస్పత్రిలో ఉన్న పేషెంట్ కు పింఛను అందజేసిన సర్వేశ్వరరావు పలువురు అభినందించారు. అంబాజీపేటకు చెందిన పితాని ఏసుకుమార్ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. దాతలు, స్నేహితులు, బంధువులు,సమాజ సేవకుల ఆర్థిక సహకారంతో రెండున్నర నెలల క్రితం శ్రీకాకుళం జిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు.ఆసుపత్రిలో ఇన్ పేషెంట్గా ఉన్న ఏసుకుమార్ పింఛన్ అందుకునేందుకు గత రెండు నెలలుగా అంబాజీపేటకు రాలేకపోయారు. దయాలసిస్ పేషెంట్ కు ప్రతినెల అందించే రూ.10 వేల పింఛన్ను (జూన్, జూలై,ఆగస్టు )మూడు నెలలకు కలిపి రూ.30 వేలను మాచవరం గ్రామపంచాయతీ గుమస్తా బందుల సర్వేశ్వరరావు (ఏసుబాబు) శ్రీకాకుళం జిమ్స్ ఆస్పత్రి సమీపంలోని బస్ స్టాండ్ కు వెళ్లి పింఛనుదారుడు ఏసుకుమార్ కు శనివారం రాత్రి గం:10ల సమయంలో అందజేశారు.ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,ఎంపీడీవో బి. మమత, డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కె.వి.వి సత్యనారాయణల సూచనలతో సర్వేశ్వరరావు పింఛనుదారుడికి నగదును అందజేశారు. ప్రభుత్వ లక్ష్యంను ప్రజలలోకి తీసుకు వెళ్లడంలో ఉద్యోగుల పాత్ర చాలా కీలకమైందని పలువురు అన్నారు.

# గంజాయి వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం.



**రాజవొమ్మంగి, ఆగస్టు 02, ప్రభాతవార్త** గంజాయితో పట్టుబడితే కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యి మానసిక ప్రశాంతతకు దూరమవుతారని రాజవొమ్మంగి సి. ఐ. సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం ఊర్లకులపాడు గ్రామంలో జడ్డంగి ఎస్. ఐ. చినబాబు ఆధ్వర్యంలో గంజాయి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా సి. ఐ. సన్యాసినాయుడు మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, అమ్మడం, సహకరించడం కూడా నేరమని అన్నారు. యువత గంజాయి జోలికి వెళ్లి ఉజ్వలమైన భవిష్యత్ ను పాడు చేసుకోవద్దని అన్నారు. గంజాయి సమాచారం ఉంటే సి. ఐ.9440900764, జడ్డంగి ఎస్. ఐ.9440900766 కు ఫోన్ చేసి తెలుపవచ్చునని అన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. రహదారి నిబంధనలు ప్రతీ ఒక్కరూ పాటించాలని అన్నారు. మైనర్ల మోటార్ వాహనాలను ఇవ్వవద్దన్నారు. ప్రతీ ద్విచక్ర వాహనదారుడు ప్రయాణ సమయంలో హెల్మెట్ ను దరించా లన్నారు. ఈకార్యక్రమంలో సి. ఐ. సన్యాసినాయుడు, ఎస్. ఐ. చినబాబు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుల్ దేవుడు, ఏ. పి. ఎస్. పి. సిబ్బంది పాల్గొన్నారు.

# భోగాపురం సభకు విద్యార్థుల తరలింపుపై ఏఐఎస్ఎఫ్ విమర్శ



**గోపాలపురం, ఆగస్టు 2 (ప్రభాతవార్త ):** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి విద్యార్థులను పెద్ద ఎత్తున తరలించాలని ప్రభుత్వం ఆదేశించడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ విమర్శించారు. విద్యార్థులను ప్రభుత్వ కార్యక్రమాలకు బలవంతంగా తరలించడం వారి విద్యా హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

# పేదల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన: : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, ఆగస్టు 2 (ప్రభాత వార్త )** పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి, సీతానగరం గ్రామాల్లో ఆదివారం కాట్రావులపల్లి టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరావు, సీతానగరం గ్రామ టిడిపి అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ( బుజ్జి) ఆధ్వర్యంలో నిర్వహించిన "రెండేళ్ల అభివృద్ధి - నమ్మకం - సంక్షేమం" కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కాట్రావులపల్లి గ్రామంలో ఎమ్మెన్నార్ యూత్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి గ్రామంలో మహిళలు యువత పెద్ద ఎత్తున నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, సూపర్ సిక్స్ హామీల అమలుతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేల నుంచి రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల వరకు పెంచి వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి ఆర్థిక సహాయం, దీపం-2 ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆటో డ్రైవర్లకు వార్షిక ఆర్థిక సహాయం, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్తోందని అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, నక్కపల్లి ఉక్కు కర్మాగారం, గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కుంచే రాజా, కొత్త కొండబాబు, చదరం చంటిబాబు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, బిక్కిన బాబి, పోలినాటి ధర్మానందకుమారి శాస్త్రి, వేమగిరి రాజు, కోడూరి సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజి, తాతినేని నాగేశ్వరావు,ఈ శ్రీను, గుడపాటి సత్యనారాయణ, పిండి రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత మారెమ్మ, శ్రీ విజయ దుర్గ

# అమ్మవార్లకు సారె...

**భక్తి శ్రద్ధలతో బారీ ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సాంప్రదాయ బద్ధంగా సారె సమర్పణ..**





**ఆత్రేయపురం, ఆగస్టు, 02,(ప్రభాత వార్త)** ఆషాఢ మాసంలో గ్రామ దేవత మారెమ్మ తల్లి, శ్రీ విజయ దుర్గా అమ్మవార్లకు మహిళలు భక్తిశ్రద్ధలతో ఆషాఢ మాస సారె సమర్పించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ విజయ దుర్గా అమ్మవారికి, గ్రామ దేవత మారెమ్మ తల్లి అమ్మవార్లకు మంగళవాయిద్యాలతో బారీ సంఖ్యలో మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించి అమ్మవార్లను దర్శించుకున్నారు . ఉచ్చిలి గ్రామంలో గ్రామ దేవత మారెమ్మ తల్లి, శ్రీ విజయ దుర్గా అమ్మవారికి తొలిసారి ఆషాఢ మాస సారె పెట్టడంతో గ్రామ మంతా పండుగ వాతావరణం సంతరించుకుంది.కుల మతాలకు అతీతంగా మహిళలంతా కలసి గ్రామ పురవీధులలో ఊరేగింపుగా వెళ్లి చలివిడి పానకాలతో చీర సారెను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు గ్రామ ఆడపడుచులు గ్రామస్తులంతా గ్రామ దేవత మారెమ్మ, శ్రీ విజయ దుర్గ అమ్మవార్లను దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు.

# ఢీ-పట్టాల వ్యవహారంలో మోసం ఆరోపణలు.. గిరిజన యువకుడి ఆత్మహత్యాయత్నం



**దేవీపట్నం, ఆగస్టు 2 (ప్రభాతవార్త):** పోలవరం ప్రాజెక్టు డి-పట్టాల వ్యవహారంలో మోసం జరిగిందంటూ దేవీపట్నం మండలం మంటూరు గ్రామానికి చెందిన ఓ గిరిజన యువకుడు శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధిత యువకుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, పోలవరం ప్రాజెక్టు డి-పట్టాలు ఇప్పిస్తామని నమ్మించి గిరిజనుల నుంచి లక్ష రూపాయలకు రూ.10 వేల చొప్పున ఒక వ్యక్తి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు తీసుకున్నప్పటికీ పట్టాలు ఇప్పించకపోవడంతో పాటు పలుమార్లు అడిగినా సరైన సమాధానం ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తమకు న్యాయం జరగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మంటూరు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు ఈరోజు ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే యువకుడిని రక్షించి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై గిరిజన సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డి-పట్టాల పేరుతో గిరిజనుల నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అయితే ఈ వ్యవహారంపై అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అలాగే డబ్బుల వసూళ్లు, ఫిర్యాదులు, ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు

# బీసీ కమ్యూనిటీ హాల్ పనులు వేగవంతం చేయాలి



**కాకినాడ రూరల్ ఆగస్ట్ 2 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గైగోలపాడు సాయి భవజ్ఞ నగర్‌లోని అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ కమ్యూనిటీ హాల్ పనులు వేగవంతం చేయాలని, కమ్యుటి హాల్ పై భాగంలో సాయిబాబా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ఆదివారం పెద్ద సంఖ్యలో గైగోలుపాడు గ్రామస్తులు రూరల్ ఎమ్మెల్యే నానాజీకి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను నెల రోజుల్లో ప్రారంభిస్తామని, ఆలయ అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి స్థానికంగా ఉంటున్న కాసారావు,కు సంబంధించి అవినీతి, అక్రమాలపై తనకు పలు ఫిర్యాదులు అందాయని, వాటి పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయాల నిర్వహణ పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యంతో కొనసాగాలని, అభివృద్ధికి ఎవరైనా ఆటంకాలు సృష్టిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో స్థానిక పెద్దలు గుబ్బల అప్పారావు, కోడి సీతారామరాజు, పాలిక సతీష్ ,వీర్రాజు కమ్ము, పంపన మహేష్, కాకరపల్లి శ్యామ్, గంజా సత్తిబాబు, వాసంశెట్టి గోవింద్ ,ఎస్ఎంసి అరవింద్, రోహిత్ కుమార, పాలిక లక్ష్మి యానిమేటర్, పెంకె వీరబ్బాయి, వాసంశెట్టి మురళి, పాలిక శివ, కోడి భవాని, నాగమణి, పాలిక వేణు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.అనంతరం కాకినాడ రూరల్ నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను కలిసి గ్రామంలో పలు సమస్యలు పై వినతి పత్రాన్ని అందజేశారు.

# రీ సర్వే తో రైతులకు మేలు నాగిడి



**కాట్రేనికోన ఆగస్టు 02 (ప్రభాతవార్త)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే తో సరిహద్దు భూ తగాదాలు లేకుండా రైతులకు భూస్వాములకు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని మాజీ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు .మండలంలోని కందికుప్ప గ్రామంలో రీ సర్వేలో భాగంగా రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారును పాస్ బుక్ పంపిణీ కార్యక్రమం తహసీల్దార్ రవికిరణ్ ఆధ్వర్యం లో ఆదివారం నిర్వహించారు.రీ సర్వే ను రైతులు, ప్రజలు వినియోగించుకుని భూ వివాదాలు లేకుండా చూసుకోవాలని నాగిడి తెలిపారు. రాజముద్ర తో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు అందించారు. కార్యక్రమంలో నీటి సంఘం డిసి చైర్మన్ ఆకాశం శ్రీను, నూకల మూర్తి, కాలాడి వీరబాబు , గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

**పిఠాపురం, ఆగస్టు 2 ( ప్రభాతవార్త )** పిఠాపురం కరివేపాకు పేటకు చెందిన ఇ శీడుగపల్లి నూకరాజు(72) ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో నడుచుకుంటూనాగార్జున రెసిడెన్సి దగ్గరకు వెళ్లేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మరణించడం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో నూకరాజు జగ్గయ్య చెరువులో నివాసం ఉంటున్న కొడుకు దగ్గరకు వెళుతుండగాఈ ప్రమాదం జరిగిందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వారు తెలిపారు.

# ఆక్వా చెరువుల తవ్వకం ఆగేనా??!



**కాట్రేనికోన ఆగస్టు 02(ప్రభాతవార్త)** కాట్రేనికోన మండలంలో అనధికార ఆక్వా చెరువుల తవ్వకాలు ఆగని పరిస్థితి నెలకొందని ప్రజలు రైతులు ఆరోపిస్తున్నారు . ఎక్కడికక్కడ వ్యవసాయ పొలాలను ,వివిధ రకాల భూములను ఇస్తాను రీతిన తవ్విస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా మండల స్థాయి అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని అంటున్నారు. కందికుప్ప శివారు గండి సమీపంలో సుమారు ఎకరంన్నార పైనే చెరువు ఇటీవల కొంతమంది తవ్వారు. ఇక్కడ సొసైటీ భూములుగా చెబుతున్న స్థలంలో ఏపుగా పెరిగిన మాడ అడవులను తొలగించి మరి చెరువులు తవ్వుతున్నారు. వీటికి ఎటువంటి అనుమతులు లేవని తెలుస్తోంది. జిరాయితీ భూములైన, సొసైటీ భూములైనా మడ అడవులను తొలగించి చెరువులు తవ్వడం నిబంధనలకు విరుద్ధం. గండి ప్రాంతంలో నాలుగైదు రోజులుగా అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతునా స్థానిక విఆర్ఓ , మత్స్యశాఖ సిబ్బంది గానీ కనీసం పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది . పర్యావరణ పరిరక్షణకు అండగా ఉండే మడ అడవులను తొలగిస్తూన్నా, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం పై ఉన్న గ్రామ స్థాయిలో ఇవేమీ పట్టించుకోవడంలేదని ఆరోపణలు ప్రజల నుంచి ఎక్కువగా వినబడుతున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో చెరువులు తవ్వినా, మరి ఏ పనులు చేపట్టిన ప్రభుత్వ అనుమతులు తీసుకున్నకే ,సంబంధిత అధికారులు పరిశీలించిన తర్వాతే చేపట్టేలా చూడాలని ప్రజలు రైతులు కోరుతున్నారు.

## శ్రీ శాకాంబరీ అలంకరణ లో గుర్రాలక్క అమ్మవారు.....



**సఖినేటిపల్లి ఆగస్టు 2, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి అనుబంధ దేవాలయం అయిన అశ్వరుడాంబిక(గుఱ్ఱాలక్కమ్మ)వారు ఆషాడమాసం సందర్భంగా శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినారు. శ్రీ స్వామి వారి దేవాలయం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు సమర్పించినారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు.

# యానం రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహణ



**యానం, ఆగస్టు 2: (ప్రభాతవార్త)**యానం మార్కెట్ కమిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో యానం ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (నం.గ్రా.842) సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఫార్మర్ కోపరేటివ్ సొసైటీ రైతు సభ్యులు హాజరయ్యారు. భారత ప్రభుత్వ లి"10,000 రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఖీఉం) ఏర్పాటు మరియు ప్రోత్సాహం కేంద్ర పథకం కింద 2023 నవంబర్ 22న స్థాపించబడిన ఈ సొసైటీ రైతుల ఆదాయాన్ని పెంచడం, సామూహిక మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో పనిచేస్తోంది. ఈ సమావేశానికి పుదుచ్చేరి మంత్రివర్యులు మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా రైతుల ఆదాయం పెంపొందించడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షులు మాజేటి సత్య భాస్కర వెంకటేశ్వర్ మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి కొత్త వ్యాపార అవకాశాలను కల్పిస్తూ, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలను అందించేందుకు సొసైటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు కోన వెంకటరావు, డైరెక్టర్లు కొండమూరి భాస్కరరావు, కోన సత్తయ్య, మట్టా సురేష్ బాబు, తిరుకోటి నాగేశ్వరరావు, కాకర్లపూడి వీర వెంకట సత్య సూర్య నెల్లాద్రి వరప్రసాద్ మూర్తి రాజు, తిరుకోటి ధర్మారావు, మొలగజ్జల ఆనందరావు, కోన కొండ బాబు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు చి.జోగిరాజు, ఎఫ్‌పీఓ సిబ్బంది, మార్కెట్ కమిటీ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సభ్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు

# గురజాపులంక రాకపోకలు బంద్



**ముమ్మిడివరం ఆగస్టు 2 తర్వాత వార్త** గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో లంక గ్రామాలు వరద కారణంగా నీట మునిగాయి. లంక ఆఫ్ ఠానేలంక - గురజాపులంక గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి వరదకు నీరు ఉధృతంగా ప్రవహించడమే కాకుండా లంక గ్రామాలు మునిగి రాకపోకలకు ఉన్న రోడ్లన్నీ మునిగిపోయాయి. లంకలలో పండించే వంగ చిక్కుడు బెండ మునగ లతోపాటు పలు పంటలు నీట మునిగాయి లంక గ్రామాల్లో కాయగూరలు పండించే రైతులు అధిక పెట్టుబడితో పెట్టుబడి పెట్టి కరెక్ట్ గా కాపు చేతికి వచ్చే సమయానికి వరద వచ్చి నీటి ఉంచేసిందని లబోదిబోమంటున్నారు. నీట మునిగిన గ్రామాలలో ముమ్మిడివరం తహసీల్దార్ టి సుభాష్ గ్రామ రెవిన్యూ అధికారి కనకాల వెంకటరావు తో కలిసి లంక గ్రామాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు

# వరద బాధితులకు ఏడాదిగా తక్షణ సహాయం అందివ్వకపోవటం సిగ్గుచేటు

**: ఈ విడతైనా బాధితులకు సహాయం అందేనా**



**వి.ఆర్.పురం,ఆగష్టు2,ప్రభాతవార్త** గోదావరి వరద బాధితులకు ఏడాదిగా తక్షణ సహాయం అందివ్వకపోవటం సిగ్గుచేటని, కనీసం ఈ ఏడాదైనా వరద బైతులకు కూటమి ప్రభుత్వం వరద తక్షణ సహాయం బియ్యం, పప్పులు, నగదు అందిస్తుందా అని, సిపిఎం మండల కార్యదర్శి పులి.సంతోష్ కుమార్ అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం సిపిఎం నాయకులు శ్రీరామగిరి వరద బాధిత కుటుంబాలను పామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడారు. వరదలు, అగ్నిప్రమాదాలు ఇతరత్రా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, ప్రభుత్వాలు బాధితులకు అందించే తక్షణ సహాయం వారికి ఎంతో ఊరట కలిగిస్తుందన్నారు. బాధితులకు తక్షణ సహాయం చేయటం ప్రభుత్వ నైతిక బాధ్యత అన్నారు. కూటమి ప్రభుత్వం గత సంవత్సరం నిర్వాసితులకు తక్షణ సహాయం చేయకుండా నిండా ముంచిందని గుర్తు చేశారు. కనీసం ఈసారైనా ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొడియం.శ్రీరామూర్తి, ఆత్మకూరి.కాంతారావు, గుండిపుడి.లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి గట్టును పరిశీలించిన ఇరిగేషన్ ఉన్నతాధికారులు



**కె.గంగవరం, ఆగస్టు 02,(ప్రభాతవార్త):** గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ పి. చిన్నబాబు, ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆనంద్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు కె. సుబ్బారావు, ఎం. రెహ్మాన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో, జి శ్రీనివాస్, స్థానిక అధికారులతో కలిసి కె గంగవరం మండలం కూళ్ల, సుందరపల్లి,కోటిపల్లి ప్రాంతాలలోని వరద బలహీన గట్లను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు గట్ల భద్రత, నీటి ప్రవాహ పరిస్థితులు, వరద ముప్పు అవకాశాలు రక్షణ చర్యలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా ఇరిగేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# తగ్గు ముఖం పడుతున్న గోదావరి నది.

**ఇంకా జలదిగ్బంధంలోనే రహదారులు.**





**చింతూరు ఆగస్టు 2 ప్రభాతవార్త.** భద్రాచలం వద్ద గోదావరి నది ఆదివారం సాయంత్రం 44 అడుగులకు చేరుకొని తగ్గుముఖం పట్టింది. అయినా చింతూరు వద్ద శబరి నది ఉధృతి దగ్గ ముఖం పట్టకపోవడంతో రహదారులన్నీ ఇంకా జలది గ్రంధంలోనే చిక్కుకొని ఉన్నాయి. చింతూరు ఒరిస్సా మధ్య జాతీయ రహదారి 320 మునిగిపోవడంతో ఒరిస్సాకు వెళ్లాల్సిన వందలాది వాహనాలు చింతూరు వద్ద రహదారులపై నిలిచిపోయాయి. చింతూరు విఆర్ పురం మధ్య వరద నీరు తగ్గకపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. చింతూరు కూనవరం మధ్య పంద్రాజూపల్లి వద్ద రహదారి నీట మునగటంతో కూనవరం చింతూరు మధ్య కూడా రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. ఇంకా చాలా ప్రాంతాల్లో చుట్టుముట్టిన వరద నీరు ఇంకానే అలా ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.అయితే ప్రస్తుతానికి వర్షాలు లేకపోవడంతో గోదావరి, శబరి నదుల్లో కూడా వరద తగ్గు ముఖం పట్టే అవకాశం ఉన్నట్టు అధికారులు ప్రకటించారు.

## వైకాపా ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెడ్డి సతీష్. నీలపల్లి లో సతీష్ కు పలువురి అభినందనలు.



**తాళ్ళరేవు, ఆగస్టు 2 (ప్రభాతవార్త):** ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలానికి చెందిన రాష్ట్ర బి.సి. నాయకులు రెడ్డి ఈశ్వరరావు(సతీష్)ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పదవి వరించింది. ఆ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ అధిష్ఠానం నుండి ఉత్తర్వులు రావడం పట్ల వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సతీష్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీలపల్లిలోని సతీష్ నివాసం వద్ద పలువురు ఆయనను అభినందించారు. పార్టీ శ్రేణులతో కలిసి సతీష్ కేక్ కట్ చేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం నుండి పనిచేస్తున్న సతీష్ కు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిజమైన గౌరవాన్ని ఇచ్చారని పలువురు నాయకులు అన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర పదవి ఇచ్చిన అధినేత జగన్మోహన్ రెడ్డి కి సతీష్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తూ ఆ గౌరవాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. రాష్ట్ర పదవి రావడానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర నాయకులు, పి గన్నవరం, రామచంద్రపురం నియోజకవర్గాల పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరాజు, సీఈసీ సభ్యులు పితాని బాలకృష్ణ, ఎస్ ఈ సి సభ్యులు ముని కుమారి, తాళ్లరేవు జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల కార్యదర్శి కాద గోవింద్ కుమార్, నాయకులు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కొండపల్లిలో పోస్టల్ సేవలపై అవగాహన కార్యక్రమం



**రాజవొమ్మంగి, ఆగస్టు 02, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామంలో పీసా గ్రామసభ ఉపాధ్యక్షుడు కోటం వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పోస్టల్ సేవలపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ అప్పలకొండ పోస్టాఫీన్ సేవింగ్స్ ఖాతాలు, ఆర్డీ, సుకన్య సమృద్ధి, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, స్పీడ్ పోస్ట్, ఆధార్, ఐపీపీబీ తదితర సేవలపై ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబం పోస్టాఫీన్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ, ఆర్థిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్.డబ్ల్యూ.ఎస్ జెఇ దాతృత్వం...

**శ్రీరామగిరి వరద బాధితులకు త్రాగునీరు అందజేత**



**వి.ఆర్.పురం, ఆగష్టు2, ప్రభాతవార్త** ఆర్.డబ్ల్యూ.ఎస్ జెఇ సాయిరామ్ శ్రీరామగిరి వరద బాదితులపట్ల దాతృత్వం ప్రదర్శించారు. గడిచిన మూడు రోజులుగా శ్రీరామగిరి ప్రజలు గోదావరి వరద గ్రామాన్ని ముంచెత్తటంతో గుట్టమీద తలదాచు కుంటున్నారు. జలదిగ్బంధంలో ఉన్న అక్కడి ప్రజలకు త్రాగేందుకు సురక్షిత తాగు నీరు కరువైంది. దీంతో బాధిత ప్రజలు వరద నీటినే వడబోసి తాగుతు దాహార్తి తీర్చుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఆర్.డబ్ల్యూ.ఎస్ జెఇ సాయిరామ్ స్పందించారు. రేఖపల్లి నుండి మినరల్ వాటర్ 20 లీటర్ల డబ్బాలను మరపడవలో వేసి నాలుగు విడతలుగా శ్రీరామగిరి తీసుకొని వెళ్లారు. సుమారు 100 కుటుంబాల వరద బాధితులకు దగ్గరుండి ఇంటికి ఒక డబ్బా చొప్పున నీరు అందించి, తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఉద్యోగ రీత్యా రక్షిత మంచినీటి శాఖలో ఉద్యోగం చేస్తున్న సాయిరామ్ కు త్రాగునీటి ప్రాముఖ్యత తెలుసు. అది తెలిసిన సాయిరామ్ సరైన సమయంలో, ప్రజలకు చేయాల్సిన సేవచేసి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. స్వచ్ఛందంగా శ్రీరామగిరి వరదబాదిత కుటుంబాలకు కుటుంబాలకు మినరల్ వాటర్ అందించిన జెఇ సాయిరామ్ ను పలువురు ప్రశంసించారు

# అక్రమ కేసులకు భయపడేదే లేదు: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



**అనపర్తి ఆగస్టు 2(ప్రభాతవార్త)** అనపర్తి మండలం రామవరంలో వైయస్ఆర్ సిపి జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ఇంటి దగ్గర పరామర్శ విషయంలో వైయస్ఆర్ సిపి నాయకులు, కూటమి నాయకుల మధ్య ఏర్పడిన ఉద్రిక్త వాతావరణంలో వైయస్ఆర్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టడాన్ని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ దాడి వెనుక అసలుసూత్రధారి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అని ఆయన ఆరోపించారు.ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రామవరం గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్; పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ఇంటిపై దాడి చేయించి, పరామర్శ పేరిట ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి నాటకాలాడుతున్నారని ఆయన ఆరోపించారు. వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పరామర్శకు వెళ్తున్న సమయంలోనే ఎమ్మెల్యే కూడా వచ్చి ఉద్దేశపూర్వకంగా రభస సృష్టించారని, ఈ దృశ్యాలన్నీ నియోజకవర్గ ప్రజలు వీడియోల ద్వారా చూశారని స్పష్టం చేశారు. ఘటన అనంతరం వైయస్ఆర్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చెయ్యాలని ఎమ్మెల్యే తన అధికారాన్ని ఉపయోగించి నాతో సహ 15 మంది వైయస్ఆర్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించారని, ఇలాంటి తప్పుడు కేసులకు, అరెస్టులకు ఎవరూ భయపడేది లేదని అన్నారు వైయస్ఆర్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేసి అనగదొక్కాలని కలలు కంటున్నారని, కానీ అవి ఎప్పటికీ నిజం కావని పేర్కొన్నారు. నిజంగా బాధితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ గ్రామంలోని మిగతా బాధితుల ఇళ్లకు కానీ, గతంలో రంగాపురం, దొడ్డిగుంట గ్రామాలలో హత్యకు గురైన వారి కుటుంబాలను పరామర్శించడానికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. ఇదే సమయంలో పోలీసు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూర్యనారాయణ రెడ్డివిజ్ఞప్తి చేశారు. వీఆర్ఓ వంటి అధికారులతో తప్పుడు ఫిర్యాదులు ఇప్పించి కేసులు నమోదు చేయించడం సరికాదని, సంఘటన స్థలంలో ఉన్న పోలీసులకు నిజమేంటో స్పష్టంగా తెలుసని అన్నారు. వైయస్ఆర్‌సీపీ సమర్పించిన సీసీటీవీ ఫుటేజ్, ఆధారాలపై ఇప్పటివరకు ఎలాంటి సమగ్ర విచారణ చేపట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps